ఘు గ్రంథాలు

# తెలుగులో శ్రవ్యనాటకాలు

కాటూరు రవీంద్ర త్రివిక్రమ్

ప్రపంచ తెలుగు మహాసభలు

WORLD TELUGU CONFERENCE

2012

27-29 డిసెంబర్, 2012, తిరుపతి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రాష్ట్ర సాంస్కృతిక శాఖ, సాంస్కృతిక మండలి

పొట్టి శ్రీరాములు
తెలుగు విశ్వవిద్యాలయం

Blank Page

లఘు గ్రంథాలు

# తెలుగులో శ్రవ్యనాటకాలు

## కాటూరు రవీంద్ర త్రివిక్రమ్

ప్రపంచ తెలుగు మహాసభలు

27-29 డిసెంబర్, 2012, తిరుపతి

**పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం**

మండలి వెంకట కృష్ణారావు అంతర్జాతీయ తెలుగు కేంద్రం

హైదరాబాద్

**తెలుగులో శ్రవ్యనాటకాలు**

Telugulo Sravyanatakalu

**రచయిత : కాటూరు రవీంద్ర త్రివిక్రమ్**

**ISBN : 81-86073-374-5**

**© పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం**

ప్రచురణల సంఖ్య : 493

వెల : **రూ. 20/-**

ప్రతుల సంఖ్య : **5000**

ముద్రణ : **డిసెంబరు, 2012**

ప్రతులకు : **సంచాలకులు**
ప్రచురణల విభాగం,
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
పబ్లిక్ గార్డెన్స్, హైదరాబాద్ - 500 004.

---

ముద్రణ : **కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్**, విద్యానగర్, హైదరాబాద్.

యస్. కిరణ్ కుమార్ రెడ్డి

హైదరాబాదు

ముఖ్యమంత్రి
ఆంధ్రప్రదేశ్



# నాంది

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారిని ఒక్క వేదిక పైకి తీసుకు వచ్చేందుకు, తెలుగు ప్రభలను దశదిశలా వ్యాపింపజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2012 డిసెంబర్ 27 నుండి 29 వరకు ఏడుకొండలవాడి ఆవాసమైన తిరుపతి పుణ్య క్షేత్రంలో అత్యున్నత స్థాయిలో తెలుగు మహాసభలను ఏర్పాటు చేసింది. రాష్ట్రంలోనూ, దేశంలోనూ, ఇతర దేశాల్లోనూ ఉన్న తెలుగు వారందరూ పరస్పరం భావ వినిమయం చేసుకోవడానికీ, తెలుగువారు తమ గత చరిత్రను సంస్మరించుకుంటూ, ఉత్కృష్టమైన భవిష్యత్తును నిర్మించుకోవడానికో ఈ మహా సభలు ఎంతగానో దోహదం చేస్తాయని మేము విశ్వసిస్తున్నాం.

తొలి ప్రపంచ తెలుగు మహాసభలు జరిగి 37 సంవత్సరాలు గడిచాయి. అయితే ఇంతవరకూ ఏ రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ మహాసభలను నిర్వహించడానికి చొరవ చూపలేదు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ ప్రజాజీవితాన్ని ఎలా మెరుగుపరచాలీ, తెలుగు వారి వైభవాన్ని ఎలా పరిరక్షించాలీ అనే దృష్టితో పనులు చేపడుతోంది. తెలుగువారి నిర్వహణ సామర్థ్యాన్ని ఇటీవల జరిగిన జీవ వైవిధ్య సదస్సులో కూడ ప్రభుత్వం నిరూపించింది. ఈ నేపథ్యంలోనే ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహించడానికి సమాయత్తమైంది.

ఇటీవల కాలంలో ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో రాజకీయ, సామాజిక, సాంస్కృతిక పరిణామాలు సంభవించాయి. వీటి నేపథ్యంలో బహుభాషా దేశమైన మన భారత దేశంలో తెలుగు భాష, సాహిత్యం, చరిత్ర, సంస్కృతి, కళలు మొదలైన విషయాల్లో జరిగిన కృషి గురించి, జరగవలసిన కృషి గురించి మనం చర్చించవలసింది ఎంతో ఉంది. ప్రపంచీకరణ నేపథ్యంలో మన తెలుగు భాష ఉనికిని కోల్పోకుండా పరిరక్షించేందుకు, తెలుగు ఔన్నత్యాన్ని నలుదిశలా చాటేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. నిత్యం ప్రజల హితం కోరి, ప్రజల అభీష్టాలను నెరవేర్చేందుకు, తెలుగు జాతి దేశ విదేశాల్లో తలెత్తుకు తిరిగేలా చేసేందుకు అవిరళ కృషి చేస్తున్న మా ప్రభుత్వం, తెలుగు తేజం కాంతులు వెదజల్లేలా ఈ మహోజ్వలమైన సభల నిర్వహణకు పూనుకొంది. ఈ సభలలో సదస్సులు, తెలుగు వారి కళా ప్రదర్శనలు, చేతివృత్తుల ప్రదర్శనలు, లలితా కళా వైభవాన్ని చాటే కార్యక్రమాలు, రాష్ట్రేతర, విదేశాంధ్రుల సమావేశాలు, మొదలైన ఎన్నో అంశాలతో పాటు పుస్తక ప్రచురణ కూడ పెద్ద ఎత్తున చేపడుతున్నాం. అందులో భాగంగానే ఈ లఘుగ్రంథాల ప్రచురణ జరుగుతుంది.

ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ మహాసభల సందర్భంగా ప్రచురించే లఘు గ్రంథాలు పాఠకుల ఆదరణ పొందగలవని ఆశిస్తున్నాం.

కిరణ్ రెడ్డి

**(ఎన్. కిరణ్ కుమార్ రెడ్డి)**

ముఖ్యమంత్రి

**V. VASANT KUMAR**, B.Sc.,(Ag.),M.B.A.
Minister for Tourism & Culture, Archeology & Museums,
Archives & Youth Services & Sports, N.C.C.
Government of Andhra Pradesh

Room No. 501, 5th Floor,
J-Block, A.P. Secretariat,
Hyderabad-500 022.
Phone : 040-23454168, 23450541
Fax : 040-23450899



# ప్రస్తావన

తెలుగువారు తెలుగు నేలపై 37 ఏళ్ళ విరామం తర్వాత చేసుకుంటున్న పండుగ ప్రపంచ తెలుగు మహాసభలు. మన సంస్కృతిని నలుదిశలా వ్యాపింప జేస్తున్న తెలుగు వారందరూ ఒక్కచోట చేరి, తెలుగు దనాన్ని పంచు కునేందుకు, తెలుగు పరిమళాలు వెదజల్లేందుకు ఉద్దేశించిన సన్నివేశం ప్రపంచ తెలుగు మహాసభలు. తెలుగు వారి సంస్కృతి బహుముఖీనమైంది. అందులో భాష, సాహిత్యం, చరిత్ర, లలితకళలు, జానపద, గిరిజన విజ్ఞానం వంటి ఎన్నో అంశాలున్నాయి. వీటన్నిటి గురించి విశ్లేషించుకుని, వాటిని పరిరక్షించడం, పోషించడం, పరివ్యాప్తి చేయడం ప్రభుత్వం తన విద్యుక్త ధర్మంగా భావిస్తున్నది.

ఈ బృహత్తరమైన బాధ్యతని నెరవేర్చే సంకల్పంలో భాగంగానే “ప్రపంచ తెలుగు మహాసభల” నిర్వహణకు ప్రభుత్వం నడుము కట్టింది. అతి తక్కువ వ్యవధిలో అత్యంత సమున్నత స్థాయిలో తలపెట్టిన ఈ మహాసభలకు దేశ విదేశాల నుంచి తెలుగువారు స్వాగతం పలుకుతున్నారు. అత్యధిక సంఖ్యలో ఈ సభల్లో పాల్గొంటున్నారు.

తెలుగు వారందరూ ఒక్కచోట సమకూడి, తమ గురించి చర్చించుకుని, భవిష్యత్తుకు బాటలు వేసుకునే క్రమంలో మన గురించి మనం మరోసారి తెలుసుకునేందుకు, వివిధ రంగాల్లో మనం సాధించిన దాన్ని పునశ్చరణ చేసేందుకు ఈ సభల సందర్భంగా సదస్సులు, లఘుగ్రంథాల ప్రచురణ, ప్రత్యేక సంచికల ముద్రణ,

వివిధ అంశాల్లో ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతున్నది.

తెలుగువారిది ఘనమైన చరిత్ర, అత్యున్నత సంస్కృతి. అయితే కాలంతో పాటు అభివృద్ధి పథంలో నడుస్తున్న తెలుగువారు ఎప్పటి కప్పుడు తమ సంస్కృతిలోకి కొత్త నీరును ఆహ్వానించడం సహజం. ఈ "పాతకొత్తల మేలు కలయికే" ఒక జాతిని నిత్యచైతన్యంతో నింపుతుంది. ఈ విధంగా కొత్త దనాన్ని ఆహ్వానిస్తూనే, మన గతవైభవాన్ని విస్మరించకుండా కాపాడుకోవలసిన బాధ్యత మన మీద ఉంది. ఇవన్నీ ఈ ప్రపంచ తెలుగు మహాసభల్లో చర్చకు రానున్నాయి. అందరం కలిసి, తెలుగుదనాన్ని పరిరక్షించుకునే ప్రయత్నం చేయవలసిన తరుణం ఆసన్నమైంది.

వీటన్నిటినీ దృష్టిలో ఉంచుకుని తెలుగువారి భాష, సాహిత్యం, సంస్కృతి, పౌరజీవనం తదితర అంశాలపై లఘుగ్రంథాలను నిష్ణాతుల చేత రచింపజేసి ప్రచురించే గురుతర బాధ్యతను పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం, తెలుగు అకాడమీ, రాష్ట్ర సాంస్కృతిక శాఖ నిర్వర్తిస్తున్నాయి. తెలుగు ప్రజలు కలకాలం ఉపయోగించుకునే విధంగా ఈ పుస్తక ప్రచురణ జరుగుతోంది. వీటిని పాఠకులు, తెలుగు భాషాభిమానులు, పండితులు ఆదరిస్తారని విశ్వ సిస్తున్నాను.

వ. వసంతకుమార్

(వట్టి వసంతకుమార్)

# పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
## POTTI SREERAMULU TELUGU UNIVERSITY

**ఆచార్య ఎల్లూరి శివారెడ్డి**
ఉపాధ్యక్షులు

లలిత కళాక్షేత్రం,
పబ్లిక్ గార్డెన్స్,
హైదరాబాద్-500 004.


# నివేదన

ఇన్నేళ్ళ తరువాత ప్రపంచ తెలుగు మహాసభలు జరగడం తెలుగు భాషా సాహిత్యాభిమానులకు, సంస్కృత ప్రియులకు, వివిధ రంగాలలో నిష్ణాతులైన మేధావులకు ఆనంద ప్రదమైన అంశం. 1975లో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల ఉత్తేజం తోనే 1985లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం ఆవిర్భవించింది. తెలుగు విశ్వ విద్యాలయం ఈ రాష్ట్రంలోను, భారత దేశంలోను, విదేశాలలోను ఎన్నో సభలు, సమావేశాలు నిర్వహించింది. భాషా సాహిత్య సంస్కృతుల్ని దృష్టిలో ఉంచుకొని అనేక గ్రంథాలను వెలువరించింది. తెలుగు విశ్వ విద్యాలయం అప్పటి సాహిత్య అకాడమీ నిర్వహించిన పాత్రను చాలా వరకు బాధ్యతాయుతంగా నిర్వహిస్తున్నది. విస్తరణ సేవా విభాగాన్ని అకాడమీల విభాగంగా మార్చి దానికి సంబంధించిన కార్యక్రమాలను చేపడుతున్నది. నిధుల కొరత వల్ల కొన్ని కార్యక్రమాలను అనుకున్న స్థాయిలో చేయలేకపోతున్నాం.

ఈ నాలుగవ ప్రపంచ మహాసభల సందర్భంగా తెలుగు విశ్వ విద్యాలయం తన వంతు బాధ్యతను స్వీకరించింది. భారత దేశంలో పదిచోట్ల సన్నాహక సభలు ఇప్పటికే అధిక భాగం నిర్వహించింది. 1975లో మహాసభల సందర్భంగా ప్రచురించిన 30 లఘు గ్రంథాల్ని పునర్ముద్రిస్తున్నది. మరొక 50 గ్రంథాలను ప్రత్యేకమైన అంశాలమీద రాయించి ఈ మహాసభల సందర్భంగా విడుదల చేస్తున్నది. ఆయా రంగాలలో నిష్ణాతులైన వారిచేత ప్రామాణిక గ్రంథాలను రాయించాలన్నది మా విశ్వ విద్యాలయం ఆశయం. నిజంగా ఇంత స్వల్ప సమయంలో గ్రంథ రచన చేసి సహకరించిన రచయితలకు మా ధన్యవాదాలు. ఈ గ్రంథాల ప్రచురణకు ఆర్థిక సహకారం అందించిన ప్రభుత్వానికి ప్రత్యేకంగా ముఖ్యమంత్రి గౌరవనీయులు మాన్యశ్రీ నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి గారికి, సాంస్కృతిక శాఖామాత్యులు, మాన్యశ్రీ వట్టి వసంతకుమార్ గారికి, సంబంధిత ప్రభుత్వాధికారులకు మా విశ్వవిద్యాలయం పక్షాన కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ పరంపరలో 'తెలుగులో శ్రవ్యనాటకాలు' అనే అంశం మీద చిరుపొత్తాన్ని సకాలంలో వ్రాసి యిచ్చిన కాటూరు రవీంద్ర త్రివిక్రమ్ గారికి ధన్యవాదాలు. గ్రంథముద్రణ కార్యక్రమంలో చేదోడు వాదోడుగా ఉన్న విశ్వవిద్యాలయ రిజిస్టర్ ఆచార్య కె.ఆశీర్వాదం గారికి, ఆచార్య సి.మృణాళినిగారికి మరియు ఆచార్య డి. మునిరత్నం నాయుడు గారికి అభినందనలు.

(ఎల్లూరి శివారెడ్డి)

# ముందుమాట

'బహుజన హితాయ-బహుజన సుఖాయ' అనే ఆధ్యాత్మిక సూత్రం, ఆకాశవాణికి ఆత్మగా చెప్పవచ్చు.

'రవి కాంచనిచో కవి కాంచును' అన్నట్టు, ప్రయాణ సౌకర్యాలు సైతం సరిగా లేని పల్లెటూళ్లకి సైతం ఆకాశవాణి పలుకులు కర్ణపేయంగా వినిపిస్తాయి.

ఉదయాన్నే మంగళవాయిద్యాలతో శుభోదయంతో మొదలుకొని, సంగీత, సాహిత్య, ఆరోగ్య, వ్యవసాయ, వార్తా విశేషాలు వగైరాలే కాకుండా, అనేక జానపద కళారూపాలయిన బుర్రకథ, హరికథ మరెన్నో రూపకాలతో, నాటకాలతో శ్రోతల్ని ఆకట్టుకునే ఏకైక సాధనం ఆకాశవాణి.

ఆకాశవాణిలో అడుగుపెట్టి, ఆకాశమే హద్దుగా ఎదిగిన ఎందరో సాహిత్య, సరస్వతీమూర్తులున్నారు. వారు సదా ఆకాశవాణిని అభిమానపూర్వకంగా స్మరిస్తునే ఉంటారు.

1960 నుండీ నాకు ఆకాశవాణితో ఆత్మీయానుబంధం ఉంది. స్వర్గీయ ఏడిద కామేశ్వరరావుగారు (రేడియో అన్నయ్య), వింజమూరి లక్ష్మి(రేడియో అక్కయ్య)లు నాకు మార్గదర్శకులు. కీ.శే. నందూరి సుబ్బారావుగారు శ్రవ్యనాటికల కిటుకులు చెప్పిన మహానుభావుడు. కీ.శే.ఉషశ్రీ, సి.రామ్మోహనరావు, నందూరి మురళీగాన రామకృష్ణ, శంకరమంచి సత్యం, పి.ఆర్.రెడ్డి(వీరంతా కీర్తిశేషులే) నాకు నాటక రచయితగా కీర్తి ప్రతిష్ఠలు రావడానికి కారకులు. అలాగే లబ్ధప్రతిష్టులైన శ్రీ పి.పాండురంగ, తన హయాంలో నా నాటకాలు, ధారవాహికలు ప్రసారం చేసారు. శ్రీమతి శారదాశ్రీనివాసన్, శ్రీ కోకా సంజీవరావు వంటి ఉద్ధండులు నా నాటకాలు నిర్వహించారు. కీ.శే.భానుప్రకాశ్, శ్రీ విద్యాసాగర్, కీ.శే. దేశిరాజు హనుమంతరావు,

కీ.శే. నాగరత్నమ్మ, వి.బి. కనకదుర్గ, నండూరి సుబ్బారావు వంటి పూర్వతరంవారు, పిల్లా లక్ష్మీప్రసాద్, మరెందరో ప్రసిద్ధ నటులు, ముఖ్యంగా ఏ–టాప్‌గ్రేడ్ నటులయిన శ్రీ ఎమ్.సి.దాస్ ప్రధాన పాత్రలు ధరించి, నా నాటకాలకు శాశ్వతత్వాన్ని కలిగించారు.

ఆకాశవాణి సంచాలకుల్లో శ్రీ మంగళగిరి ఆదిత్యప్రసాద్, శ్రీ కులకర్ణి, శ్రీమతి వేదవతి నా రచనలను విశేషంగా ఆదరించారు. వారికి నేను సదా కృతజ్ఞుడను.

ఈ రచనకు అవకాశం కల్పించిన, జ్ఞానసరస్వతి, కులపతి ఆచార్య ఎల్లూరి శివారెడ్డిగారికి నా కృతజ్ఞతాభివందనాలు.

– కాటూరు రవీంద్రత్రివిక్రమ్

# విషయసూచిక


| వరుస నెం. | విషయం | పేజి నెం. |
|---|---|---|
| | **మొదటి అధ్యాయము** | |
| 1. | ఆకాశవాణి విజయవాడ కేంద్రం | 3 |
| 2. | అలనాటి నాటకాలు | 6 |
| 3. | ఆకాశవాణి హైదరాబాదు కేంద్రం | 12 |
| 4. | :హాస్య శ్రవ్య నాటకాలు | 15 |
| | **రెండవ అధ్యాయము** | |
| 5. | శ్రవ్య నాటకాలు ఎలా రచించాలి? | 26 |
| 6. | ఆకాశవాణి గురించి కొందరు పెద్దల జ్ఞాపకాలు | 28 |
| 7. | ధారావాహిక శ్రవ్య నాటకాలు | 36 |
| | **మూడవ అధ్యాయము** | |
| 8. | నాటకాలకు కథావస్తువులు | 42 |
| 9. | రేడియో నాటకీకరణ | 45 |
| 10. | అనుకరణలు, అనుసరణలు | 47 |
| | **నాలుగవ అధ్యాయము** | |
| 11. | శ్రవ్య సంగీత నాటకాలు | 52 |
| 12. | ప్రయోగాత్మక నాటకాలు | 60 |
| 13. | శ్రవ్య నాటకాల్లో సామాజిక స్పృహ | 62 |

## అయిదవ అధ్యాయము


| | | |
|---|---|---|
| 14. | సందేశాత్మక శ్రవ్యనాటకాలు | 65 |
| 15. | బాలల కోసం శ్రవ్య నాటకాలు | 68 |


## ఆరవ అధ్యాయము


| | | |
|---|---|---|
| 16. | శ్రోతలు-రచయితలు మెచ్చే నాటకాలు | 76 |
| 17. | ఉపసంహారం | 84 |

# మొదటి అధ్యాయం

## ఉపోద్ఘాతం:

"వినదగునెవ్వరు చెప్పిన" అన్నట్టు సొంపుగా ఎవరు చెప్పినా వినబుద్ధి వేస్తుంది. 'మార్కొని' పుణ్యమా అని ఇంటింటా ఆకాశవాణి పలుకులు పారవశ్యాన్ని, ఆహ్లాదాన్ని, ఆనందాన్ని, విజ్ఞానాన్ని, కాలక్షేపాన్ని కలిగిస్తు, ఒక అదృశ్య మిత్రుడిగా కొన్ని దశాబ్దాలుగా అలరిస్తూ వస్తోంది.

మొదట్లో స్వర, వాద్య సంగీత కచేరీలు, తర్వాత హరికథ, బుర్రకథలు, తర్వాత్తర్వాత నాటికలు, నాటకాలు శ్రోతలకు వీనులవిందు చేయసాగాయి.

ఒకటేమిటి, ఆకాశవాణిలో శ్రవ్యరూపంగా ఎన్ని ప్రక్రియలు ప్రసారం చేయవచ్చో అన్నీ చేస్తునే ఉన్నారు. అవన్నీ ఒక ఎత్తు. నాటికలు, నాటకాలు ఒక ఎత్తు.

తెలుగువారు పద్యనాటకాలకు ఎక్కువగా అలవాటు పడ్డారు. పాండవోద్యోగ విజయాలు, అందులోని 'చెల్లియొ చెల్లకో' లాంటి ఉద్వేగభరిత పద్యాలు, పసుల కాపర్లు కూడ ఆరుబయళ్లే రంగస్థలాలుగా విజృంభించి మరీ పాడేవాళ్లు. ఇక గద్య నాటకాల్లో–

గురజాడవారి 'కన్యాశుల్కం', కాళ్లకూరివారి 'వరవిక్రయం' వంటివి సుప్రసిద్ధాలు. ఆకాశవాణి తొలినాళ్లలో మద్రాసు కేంద్రం నుండీ తెలుగు నాటకాలు ప్రసారం అవుతుండేవి.

సుప్రసిద్ధ పాత్రికేయులు కీ.శే. నండూరి రామ్మోహనరావుగారు తమ జ్ఞాపకాల్లో "నేను రాసిన నా మొదటి రేడియో సంగీత నాటకం 1947 నవంబరు 5వ తేదీన మద్రాసు రేడియో కేంద్రం నుండి ప్రసారం అయింది" అని రాసారు. అది గం నాటకం. తొలితరం నాటక రచయితల్లో ఆయనొకరు.

60 ఏళ్ల క్రితం తెలుగువారిని అలరించిన, అనేక పౌరాణిక రంగస్థల నాటకాల్లో ప్రముఖులైన అద్దంకి శ్రీరామమూర్తి, కపిలవాయి రామనాథశాస్త్రి, యడవల్లి సూర్యనారాయణ, జొన్నవిత్తుల శేషగిరి, తుంగల చలపతి, డి.వి.సుబ్బారావు, పారుపల్లి సుబ్బారావు, సాధనం నరసింహారావు, బళ్లారి రాఘవ, ఈలపాట రఘురామయ్య, పీసపాటి నరసింహమూర్తి వంటి హేమాహేమీలు పాడిన పద్యాలను వారం వారం ప్రసారం చేసి, పద్యనాటక ప్రియులకు వీనులు విందు చేసారు. ఇప్పటికీ 'రంగస్థలి' కార్యక్రమం కొనసాగుతునే ఉంది.

గద్య నాటకాలకు మకుటాయమానంగా చెప్పదగిన 'కన్యాశుల్కం' నాటకాన్ని కీ.శే.కె.వెంకటేశ్వరరావు రేడియోకి అనుగుణంగా మలచుకుని, తాను గిరీశం పాత్ర ధరించి ప్రొడ్యూస్ చేసారు.

అలాగే బుచ్చిబాబుగారి శ్రవ్యనాటకాలు, విశ్వనాథ వారి వేయిపడగలు, విశ్వనాథకవిరాజు గారి 'నాటికినేడు' బందావారి పూటకూళ్లు, శంకరమంచి సత్యం హరహరమహదేవ, అమరామం పేర్కొనదగిన ప్రసారాలు.

శ్రవ్యనాటకాలలో విజయవాడ ఆకాశవాణి కేంద్రం అద్వితీయమైన కృషి చేసింది. హైదరాబాదు, విశాఖపట్నం, కడప కేంద్రాలు క్రమంగా శ్రవ్యనాటకాల నిర్మాణంలో ఉత్సాహం, చొరవ చూపించాయి. తత్ఫలితంగా మంచి మంచి శ్రవ్యనాటికలు ప్రసారం అయినాయి.

నిష్ణాతులైన నటులకు గాత్రపరీక్షలు (ఆడిషన్స్) జరిపి, అర్హత గలవారిని ఎంపిక చేయటం ఆకాశవాణి అనుసరిస్తున్న పద్ధతి. ఈ విధంగా ఎంపిక చేసుకున్న స్త్రీ, పురుష నటుల్లో, పాత్రోచిత ప్రజ్ఞ చూపగలవారికి, తగు పాత్రలనిచ్చి, తమ పర్యవేక్షణలో గొప్ప గొప్ప నాటకాలను ప్రసారం చేసారు.

అక్షరజ్ఞానం లేనివారిని సైతం శ్రవ్యనాటకాలు అలరించగలవు. అవే వాటి ప్రత్యేకత.

శ్రవ్యనాటకాల రచనలో సాంకేతికతలు, సమయ సర్దుబాటు, విరామ సంగీతాలు, నేపథ్య సంగీతం వంటివి ప్రధాన అంశాలుగా చెప్పుకోవచ్చు.

వీటి గురించి మనం తర్వాత అధ్యాయాలలో వివరంగా తెలుసుకుందాం.

ఆకాశవాణి తన సేవలను అన్ని రంగాలకు విస్తరించగలగటం వల్ల, 'జనప్రియవాణి'గా వర్ధిల్లుతోందనేది కాదనలేని సత్యం.

## ఆకాశవాణి-విజయవాడ కేంద్రం

ఆంధ్రప్రదేశ్‌కి నడిబొడ్డున ఉన్న విజయవాడ ఆకాశవాణి కేంద్రం 1-12-1948న ప్రారంభమయింది. ఆ సందర్భంగా మధురకవి దేవులపల్లి రాసిన కవితలో కొన్ని పంక్తులు.

**"పలనాట వెలనాట అలపాకనాట, రా**
**యలనాటి గరువాల జిగులు బిగిసేనాట**
**మన కళింగాన, మాయని తెలంగాణాన**

... ... ...

**ఏటిపొత్తిట శయించేటి పల్లెల, కొండ**
**ఘాటీల నిద్రపోయేటి పల్లెల, మావి**
**తోట దుప్పటి నొత్తిగించు పల్లెల, పైరు**
**చేల పానుపుల పల్లియల తెన్గు వా**
**రెందరో-అందరూ వినగల్గితే**

... ... ...

**గడియ గడియకు కొత్త జగము లేపుచు, కొత్త**
**కడిమి చూపుచు, కొత్త కొత్త మానవుడు పెన్**

**ధూళి నుంచీ కుటీపాళి నుంచీ కదలి**
**నేల నేలల మూలమూలలందెగసెనని**
**మన తెన్గునేల ప్రతిమానవుడు వింటేనా!**

ఇలా తెలుగు కోకిల కావ్యగానంతో తన ప్రసారాలను తెలుగునేల నాలుగు చెరగులా వెదజల్లింది ఆకాశవాణి విజయవాడ కేంద్రం. దీనికిగల నేపథ్యం గురించి కూడ మనం చెప్పుకోవాలి.

స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే, గాయకసార్వభౌమ కీ.శే. శ్రీ పారుపల్లి రామకృష్ణయ్య పంతులుగారు ప్రసిద్ధ కళాకారుల పేర్ల జాబితాతో, అప్పటి ప్రసార మంత్రి శ్రీ వల్లభాయిపటేల్ గారికి వినతిపత్రం పంపటం, వెంటనే ఆయన స్పందించి తగు ఏర్పాట్లు చేయటం జరిగింది.

ఆ విధంగా విజయవాడ ఆకాశవాణికి పునాది వేసిన మహనీయులు శ్రీపారుపల్లివారు.

**తొలి ప్రసారం:** 1948 డిసెంబరు ఒకటవ తేదీన జరిగిన తొలి ప్రసారంలో నాదస్వర కోవిద శ్రీ దాలిపర్తి పిచ్చిహరిగారి నాదస్వరం, శ్రీ అన్నవరపు గోపాలంగారి డోలుతో శుభారంభం జరిగింది.

అలనాటి సుప్రసిద్ధ కళాకారులైన శ్రీ పారుపల్లి రామకృష్ణయ్య పంతులు, సరిదే సుబ్బారావు (వయొలిన్), శ్రీ క్రొవ్విడి హనుమంతరావు(మృదంగం), శ్రీ ద్వారం వేంకటస్వామినాయుడు, శ్రీద్వారం నరసింగరావునాయుడు, శ్రీ మారెళ్ల కేశవరావుగార్లను వయొలీన్ త్రయంగా పిలిచేవారు. వీరి కార్యక్రమాలు వరసగా ప్రసారమైనాయి.

సంగీత రంగంలో నిష్ణాతులైన శ్రీ సంధ్యావందనం శ్రీనివాసరావుగారు, బహుముఖ ప్రజ్ఞాశాలి డా॥ మంగళంపల్లి బాలమురళీకృష్ణగారు, శ్రీ ఓలేటి వెంకటేశ్వర్లుగారు, శ్రీ మునునూరి వేంకటరమణమూర్తి, శ్రీ బాలాంత్రపు

రజనీకాంతరావు, శ్రీరంగం గోపాలరత్నం, వింజమూరి లక్ష్మి, ఎన్.సి.వి. జగన్నాథా చారి, జానపద సంగీత నిధి, బహుముఖ ప్రజ్ఞాశాలి శ్రీ ప్రయాగ నరసింహశాస్త్రిగారు (వారి కుమార్తె ప్రయాగ వేదవతి ఆకాశవాణి సంచాలకులుగా పదవీ విమరణ చేసారు), శ్రీ మల్లిక్‌గారు, భక్తిరంజని, తదితర సంగీత కార్యక్రమాలు రసవత్తరంగా రూపొందించి ప్రసారమవుతుండేవి.

**నిలయ విద్వాంసులు:** నిష్ణాతులైన సంగీత సాహిత్య ప్రముఖులను ఆకాశవాణి నిలయ విద్వాంసులుగా, ప్రొద్యూసర్లుగా నియమించుకుంది. వారిలో శ్రీ ఓలేటి వేంకటేశ్వర్లు, కుమారి శ్రీరంగం గోపాలరత్నం, శ్రీ మంగళంపల్లి బాలమురళీకృష్ణ, ముసునూరి వేంకట రమణమూర్తి మొ॥లగు వారు ప్రసిద్ధులు.

సంగీత విభాగంలో నిర్వాహకులుగా శ్రీ సంధ్యావందనం శ్రీనివాసరావుగారు, విజయకృష్ణగారు సంప్రదాయ సంగీత కార్యక్రమాల రూపకల్పన, ప్రసారంలో ఎంతో కృషి చేసారు. శ్రీ బాలాంత్రపు రజనీకాంతారావుగారు స్వయంగా సంగీత కళానిధి. ఆయన విజయవాడ కేంద్ర సంచాలకులుగా చక్కని కార్యక్రమాలను ప్రసారం చేసారు.

36 సంవత్సరాల ఆకాశవాణి సేవలో తరించిన నల్లాన్ చక్రవర్తుల కృష్ణమా చార్యుల వారి కవితారీతిలో కృతజ్ఞత-

**తే॥ సర్వ విద్యల సందీప్తి సౌరభముల**
**నేల్ల దిక్కులకును ప్రసరింపజేసి**
**కనకడోలిక నూగు నాకాశవాణి**
**మాత కర్పించు నా నమోజ్యోతులివియె ॥**

కృష్ణమాచార్యులుగారు బహుముఖ ప్రజ్ఞాశాలి. సంగీత సాహిత్యాలలో దిట్ట. ఆకాశవాణిలో ఆయన ఆణిముత్యంలా భాసించేవారు. శ్రవ్యనాటకాలకు సంబంధించి, బందా కనకలింగేశ్వరరావుగారు నిర్వాహకుడిగ అద్భుతమైన శ్రవ్యనాటకాలను రూపొందించారు. ప్రయోక్తగానే గాక విలక్షణ నటుడిగా ఆయన ప్రసిద్ధుడు.

## అలనాటి నాటకాలు

నాటకాలనగానే ప్రదర్శనకి పనికొచ్చేవిగానే ప్రజలు భావిస్తారు. 'కావ్యేషు నాటకం రమ్యం' అన్నారు. నాటకం దృశ్యకావ్యంగా లాక్షణికులు చెబుతారు. భాసుడు, కాళిదాసుల కాలంలోనే రసరమ్య నాటక ప్రదర్శనలు జరిగేవి. పురాణ గాథలు, ఇతిహాసాలు, చరిత్రలు, ప్రేమగాథలు, ధీరోదాత్త నాయకీ నాయకులు పాత్రలుగా నాటకాలు రూపకల్పన చేయబడ్డాయి.

నాటకాల్లో సంగీత, సాహిత్యాల సమ్మేళనం ఉండేది.

సూత్రధారి ఉండేవాడు.

ప్రేక్షకులకు, పాత్రధారులకు మధ్య సూత్రధారే వారధి.

ఈ ప్రక్రియ మూకీ సినిమాల కాలంలో కూడ కొనసాగింది.

సాహిత్యం పాలకుల్ని ఆనందపరచటం కోసమే కాదు, సమాజానికి మేలు చేసేదిగా ఉండాలనే విప్లవాత్మక భావనతో వచ్చిందే కన్యాశుల్కం నాటకం. అయితే, స్వగతాలు ఎక్కువగా ఉన్నవి గనుక అది ప్రదర్శన యోగ్యం కాదని విమర్శకులు వ్యంగ్య బాణాలు విసిరినా, వందలాది ప్రదర్శనలతో నాటికి, నేటికి కన్యాశుల్కం రంగస్థల రమణీయ కావ్యంగా ప్రభవిస్తునే ఉంది.

పూర్తి ప్రదర్శన ఎనిమిది గంటలు పట్టినా, చూట్టానికి ప్రజలు కుతుహుల బద్ధులవుతున్నారంటే, ఆ నాటకం పట్ల గల గౌరవం, మమకారం మనం అర్థం చేసుకోవచ్చు.

అయితే, అలనాటి నాటకాల విశిష్ఠత గురించి, కనీసం ముఖ్యాంశాలు ఇప్పటి తరానికి తెలియాల్సిన అవసరం ఉంది. వాటితో ఎక్కువ భాగం నాటకాలు శ్రవ్య నాటకాలుగా మార్చబడి ప్రసారమవటం ఒక ప్రత్యేక కారణం.

అవి: 1) పాండవోద్యోగ విజాయులు (పద్యభాగాలుగా ప్రసారమయినాయి)

2) చిత్రనళీయం 3) సావిత్రి 4) ద్రౌపదీ వస్త్రాపహరణం 5) సత్యహరిశ్చంద్ర 6) పాదుకా పట్టాభిషేకం 7) శ్రీకృష్ణలీల 8) రాధాకృష్ణ 9) శ్రీకృష్ణ తులాభారం 10) గయోపాఖ్యానము 11) భక్తప్రహ్లాద 12) తారాశశాంకం 13) సారంగధర 14) ప్రతాపరుద్రీయం 15) రోషనార 16) విప్రనారాయణ 17) చింతామణి 18) రామదాసు 19) సక్కుబాయి 20) బాలనాగమ్మ 21) కంఠాభరణము 22) వరవిక్రయం 23) మాభూమి 24) పల్లెపడుచు- ఇలా చాలా ప్రసిద్ధ నాటకాలు మనోరంజకంగా, సామాజిక ప్రయోజనకరంగా ప్రదర్శించబడ్డాయి. బందావారు వీటిని ప్రసారం చేసారు.

పద్యనాటకాలలో కొన్ని ముఖ్య ఘట్టాలు మాత్రమే ఆకాశవాణి ప్రసారం చేసింది. కొన్ని ఏకపాత్రాభినయాలు ఉన్నాయి. ప్రత్యేకంగా రాయబడినవి కొన్ని అయితే, ఆయా పాత్రధారులు తమ పాత్రలను వేరు చేసుకుని ఏకపాత్రలుగా సంభాషణలు చెప్పారు.

పైన చెప్పబడిన నాటకాల్లోని ఇతివృత్తాల గురించి కూడ మనం తెలుసుకోవాలి. అలాగే క్రమ వికాసం, మార్పులు:

**1. పాండవోద్యోగ విజయాలు:** వాస్తవానికిది రెండు భాగాల నాటకం. పాండవోద్యోగం ఒకటి, పాండవ విజయం రెండోది. ఈ విషయం చాలా తక్కువ మందికే తెలుసు. ఈ నాటకం మీద వివిధ ప్రయోగాలు జరిగాయి. గుబ్బి వీరన్న కంపెనీవారి 'కురుక్షేత్రం', మొక్కపాటి వెంకటరత్నంగారి 'ద్రౌపదీ మానసంరక్షణం' లోని మయసభను, ద్రౌపదీ వస్త్రాపహరణ సన్నివేశాన్ని మల్లాది అచ్యుతరామ శాస్త్రి గారి నాటకం నుండి కలిపి, పద్యాల క్రమాన్ని అటు ఇటు మార్చుకుని ప్రదర్శనలు ఇచ్చారు.

అయితే, తిరుపతి వేంకటకవులు దీనికి వ్యతిరేకించినందువల్ల దీనిని 'పాండవోద్యోగ విజయములు' అను కురుక్షేత్రంగా కొంతకాలం ప్రదర్శించారు. చివరకి 'కురుక్షేత్రం' పేరు ఉండిపోయింది. మూలం తిరుపతి వేంకటకవుల రచన అనే విషయం మనం గుర్తుంచుకోవాలి.

తిరుపతి వేంకటకవులు రాసిన భారత నాటకాలు ఐదు. అవి: పాండవ జననం, పాండవ ప్రవాసం, పాండవ విజయం తొలి రచనలు. ఆ తర్వాత పాండవాశ్వమేథం, పాండవ రాజసూయం వచ్చాయి.

పాండవ విజయం తృతీయ ముద్రణ నాటికి జంటకవులు కొన్ని మార్పులు చేసారు. మొదటి రెండంకములు తగ్గించి, కొత్తగా ఒక అంకము చేర్చారు. తొలగించిన రెండు అంకములకు మరికొన్ని అంకములు జోడించి పాండవోద్యోగమనే నాటకం రచించారు.

పాండవోద్యోగం నాటకం ఆరు అంకాలు.

పాండవ విజయం ఎనిమిది అంకాలు.

ఇవి రెండూ కలిసి 'పాండవోద్యోగ విజయాలు'గా ప్రసిద్ధి పొందాయి. ఈ వివరాలు మనం 1934లో తిరుపతి వేంకటకవుల షష్టిపూర్తి సందర్భంగా ప్రచురితమైన 'శ్రీతిరుపతి వేంకటేశ్వర కృతులు' అనే గ్రంథాల మూడవ సంపుటంలో చూడవచ్చు.

ఈ నాటకంలో జనప్రియాలయిన కొన్ని పద్యాలు తెలుసుకుందాం.

1) అదిగో ద్వారక... ఆలమందలివిగో 2) అరవిందాక్షుడు శేషసాయి 3) బావా! ఎప్పుడు వచ్చితీవు 4) ముందుగ వచ్చితీవు 5) ఐనను పోయిరావలయు హస్తినకు 6) చెల్లియో చెల్లకో తమకు జేసిన యెగ్గులు 7) అలుగుటయే ఎరుంగని 8) జెండాపై కపిరాజు 9) సంతోషంబున సంధి సేయుదురే 10) ఆతడనేక యుద్ధముల నారియుదేరిన వృద్ధమూర్తి 11) చతురాంబోధిపరీతమైన 12) చచ్చిరి సోదరుల్ సుతులు 13) ఎక్కడి నుండి రాక 14) ఆయుధమున్ ధరింప... 15) చెలి చుట్టంబు మహానుభావుడు.

ఈ విధంగా వ్యంగ్యం, ఎత్తిపొడుపు, ప్రగల్భాలు, వీరాలాపాలు వంటి వివిధ రసాలు మేళవించి ఉన్నాయి, ఈ పద్యాలలో.

శ్రీకృష్ణ పాత్రధారులుగా శ్రీ అబ్బూరి వరప్రసాదరావు, బెల్లంకొండ సుబ్బారావు, పీసపాటి నరసింహమూర్తి, షణ్ముఖి ఆంజనేయరాజు ప్రసిద్ధి పొందారు.

అబ్బూరి వారి బాణీని తర్వాత కాలం నాటి నటులు అనుకరించేవారు. కంచుకంఠంతో సుదీర్ఘ రాగంతో ఆయన ప్రేక్షకులను ఆకట్టుకునేవారు. ఆయన నాటకంలో 'వన్సుమోరు' అభ్యర్థనలు అధికంగా ఉండేవి.

స్వయంగా చెళ్లపిళ్లవారు ఈ నాటకాన్ని వీక్షించి, అబ్బూరి వారిని ఆశీర్వదించటం చెప్పదగిన సంఘటన.

ఉద్ధండులైన ఎందరో నటులు ఈ నాటకాన్ని వాడవాడలా ప్రదర్శించి ప్రజలను సమ్మోహితులను చేసారు. వారిలో కొందరినయినా మనం స్మరించుకోవాలి.

యడవల్లి సూర్యనారాయణ, ధూళిపాళ సీతారామశాస్త్రి, మాధవపెద్ది, ఈలపాట రఘురామయ్య, సి.యస్.ఆర్.ఆంజనేయులు, ఆచంట వేంకటరత్నంనాయుడు ఇలా ఎందరో వివిధ పాత్రలను పోషించి సెబాసనిపించుకున్నారు.

ముందే చెప్పుకున్నట్లు 'రంగస్థల' కార్యక్రమంలో ఆకాశవాణి వీటిని శ్రవణపేయంగా ప్రసారం చేసింది.

**2) చిత్రనళీయం:** ఈ నాటక రచయిత ధర్మవరం రామకృష్ణాచార్యులుగారు. ఇది నలమహారాజు కథ. భారతంలోని అరణ్యపర్వం రెండో ఆశ్వాసంలోని నలోపాఖ్యానం ఈ నాటకానికి కథాంశం.

మహత్వాచ్చ, భారవత్వాచ్చ 'మహాభారతమ్' అని వ్యుత్పత్తి అర్థం. పంచమ వేదంగా ప్రసిద్ధికెక్కిన మహాభారతంలో మనకెన్నో 'ఉపాఖ్యానాలు' కనిపిస్తాయి. ముఖ్యంగా అరణ్యపర్వంలో.

క్రీ.శ. పన్నెండో శతాబ్దంలో హర్షుడు ఇరవై రెండు సర్గల విద్వత్ కావ్యంగా దీనిని రచించాడు. దాన్నే పండితులు 'నైషధం విద్వదౌషధం' అని ప్రశంసించారు.

నలదమయంతుల కథలు కవుల్ని విపరీతంగా ఆకర్షించిన ప్రధాన కారణం, అందులోని కావ్యరసమధురిమలు. కాళిదాసు 'నలోదయ' మనే నాలుగాశ్వాసాల కావ్యం రాసాడు.

పదిహేనవ శతాబ్దంలో కవిసార్వభౌముడు శ్రీనాథుడు 'శృంగారనైషధం' రచించాడు. పదహారవ శతాబ్దంలో రామరాజ భూషణుడుగా ప్రసిద్ధుడైన భట్టుమూర్తి 'హరిశ్చంద్ర నలోపాఖ్యానం' అనే ద్వ్యర్థికావ్యంలో నలుడు-దమయంతుల కథను మేళవించాడు.

ఇవన్నీ ఈ కథ ఘనతను చాటి చెబుతాయి.

దేవతలనే సమ్మోహనపరచిన దమయంతిని తమకు భార్యగా ఒప్పించమని నలుడ్ని దిక్పాలకులు రాయబారంగా పంపటం ఒక విచిత్ర సన్నివేశం.

దమయంతి పంచ కన్యలలో ఒకతెగా ప్రసిద్ధురాలు.

ఆమె మహా పతివ్రత.

పతికి దూరమైనా, పతిభక్తిని విస్మరించని పవిత్ర.

ఈ కథలోని ఔచిత్యాన్ని, ఉదాత్తతనీ, రసాల మేళవింపునీ, మనో సంఘర్షణ లను, సమర్థవంతంగా కవులు కన్నులకే కాదు మనసుకీ హత్తించారు.

అందుకే ఇది సుప్రసిద్ధ నాటకమయింది.

చలనచిత్రంగా కూడ నిర్మించబడింది.

అయితే, శ్రవ్యనాటకమనేసరికి కాలపరిమితిలోకి ఇమడాలి. గంట లోపల నాటకం ముగిసిపోవాలి. కాబట్టి, చిత్రనళీయం కుదించి కుదించి చెప్పాలి. అప్పుడు అందులోని రస ప్రధాన ఘట్టాలు అంతగా ఆకట్టుకోవు.

కాబట్టి, ఇది కష్టసాధ్యం. అయితే, కొన్ని ప్రముఖ ఘట్టాలు ప్రసారం చేయవచ్చు.

ఇకపోతే, సావిత్రి కథ అందరికీ తెలిసిందే. ద్రౌపది, సత్యహరిశ్చంద్ర వంటి పౌరాణిక నాటకాలు సన్నివేశ రూపంలో ప్రసారయోగ్యమైనాయి తప్ప పూర్తి నాటకాలుగా శ్రవ్య మాధ్యమంలో ప్రసారం కాలేకపోయాయి. పరిమిత వ్యవధి అందుకు ప్రధాన కారణం. సాంఘిక నాటకాలను సంక్షిప్తీకరించే అవకాశం ఉంది. అప్పుడు వాటిని శ్రవ్య నాటకాలుగా ప్రసారం చేయవచ్చు.

ఆకాశవాణి తమ 'ఆర్చివ్స్' (Archives) కోసం శ్రీ పినిశెట్టి శ్రీరామమూర్తి రచించిన 'పల్లెపడుచు' నాటకాన్ని, గంట నిడివి శ్రవ్యనాటకంగా రూపొందించమని నన్ను కోరడంతో, దానిని ఆ విధంగా మలిచాను. ఇది 1950లో వెలుగు చూసిన గొప్ప సాంఘిక నాటకం.

ఆస్తులు కూడబెట్టాలనే అత్యాశ, డబ్బు మీద మమకారం, స్వల్ప వ్యవధిలో ఉన్నత స్థాయికి ఎదిగిపోవాలనే ఆరాటం- ఇవి మానవ సంబంధాలను ఎలా విధ్వంసం చేస్తాయో ఈ నాటకం చెబుతుంది.

ప్రతి సాహిత్య ప్రక్రియ సమకాలీన సమాజ చరిత్రను తనలో ఇముడ్చుకుంటుంది. ఛాయాచిత్రంలా నిలిచిపోతుంది. ముఖ్యంగా సాంఘిక నాటకాలు ఇందుకు ఉదాహరణలుగా నిలుస్తాయి.

నాటకాలలో కొన్ని ప్రయోగాత్మకంగా, సందేశాత్మకంగా రూపొందించబడినవీ ఉన్నాయి. విశాఖ నివాసి శ్రీ అబ్బూరి గోపాలకృష్ణగారు అలాంటి ఒక నాటకం రాసారు. దానికి 'త్రిజాకీ యమదర్శనం' అని శ్రీశ్రీగారు పేరు పెట్టటం ఒక విశేషం. అది రంగస్థలం మీద ఎన్నో మార్లు ప్రదర్శితమయింది. ప్రేక్షకుల విశేషాదరణ పొందింది. ప్రముఖ ఆకాశవాణి నాటక ప్రయోక్త, కార్యక్రమ నిర్వహణాధికారి శ్రీ సి.వి.సూర్యనారాయణ, ఈ నాటక విజయానికి ఎంతో కృషి చేసారు.

ఆకాశవాణి విజయవాడ కేంద్రంవారు ఈ నాటకాన్ని శ్రీ సి.వి. సూర్యనారాయణగారి నిర్మాణతలో 'ఆర్చివ్స్'కి తయారు చేయించాలని ఆపేక్షించారు.

అప్పటి కార్యనిర్వహణాధికారి శ్రీ పంతగాని గోపాలకృష్ణగారు ఫోనులో శ్రీ సూర్యనారాయణగారిని సంప్రదించగా ఆయన అప్పటికే నా రచన 'జురాహామ' మీద సదభిప్రాయం కలిగి ఉండటంచేత, నేను రేడియో నాటకీకరణ చేస్తే, తప్పక ప్రొడ్యూస్ చేస్తానన్నారు.

పాలసీకి వ్యతిరేకమైనా, గోపాలకృష్ణగారి చొరవతో, ఆర్చివ్స్‌కి నా రెండో నాటకానుసరణగా 'త్రిజాకీయమదర్శనం' తయారు చెయ్యమని అసలు ప్రతిని నాకిచ్చారు.

నాటకం సొంతం చదివి ఎంతో ముగ్ధుణ్ణయాను. అలాంటి నాటకాన్ని రేడియోకి అనుసరణ చేసే అవకాశం వచ్చినందుకు చాలా సంతోషించాను. రాత్రింబగళ్లు శ్రమించి, సకాలంలో శ్రవ్యనాటకంగా 'త్రిజాకీ యమదర్శనం' మలిచాను. శ్రీ సి.వి. సూర్యనారాయణగారు వచ్చి 'స్క్రిప్టు' చదివి చాలా సంతోషించారు.

ఆ నాటకంలో చాలా పాత్రలున్నాయి. కొన్ని మరీ చిన్నవి. ప్రధాన పాత్రధారిగా శ్రీకృష్ణాజీ నటించగా, నేను నాలుగు చిన్న పాత్రలు వేసాను.

తెల్లవార్లూ నాటకం రికార్డింగ్ జరిగింది. మర్చిపోలేని మధురస్మృతి అది. ఇప్పుడు శ్రీ సి.వి. సూర్యనారాయణగారు లేరు. నాటకం రికార్డింగ్ సమయంలో మేము దిగిన ఫొటోలు జ్ఞాపకాలుగా మిగిలిపోయాయి.

ఆకాశవాణి నాటకాల రికార్డింగులు రోజంతా జరగటం పరిపాటి. కానీ, నటుల గొంతులు రాత్రివేళ బాగా పలుకుతాయని సి.వి. సూర్యనారాయణగారి అనుభవపూర్వక అభిప్రాయం. నిజంగానే ఆ నాటకం అద్భుతంగా వచ్చింది.

## ఆకాశవాణి హైదరాబాదు కేంద్రం

రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారు సంస్కృతంలో నిష్ణాతులు కవి, పండితులు. ఆలిండియా రేడియోకి ఆయనే 'ఆకాశవాణి' అనే పేరు పెట్టారని చెబుతారు. ఆయన భావనాశక్తికి జోహారు చెప్పాల్సిందే.

హైదరాబాదులో 1933 సం॥లో ప్రైవేటు రేడియో కేంద్రం పని చేస్తుండేది. 1935లో హైదరాబాదు ప్రభుత్వం దానిని స్వాధీనం చేసుకుంది. దాని పేరు 'డెక్కన్ రేడియో'గా మార్చారు.

ఆకాశవాణి హైదరాబాదు కేంద్రంగా 1-4-1950న ప్రసారాలు ప్రారంభించింది. అంటే విజయవాడ ఆకాశవాణి కేంద్రం(1-12-48) ప్రారంభించిన సుమారు రెండు సంవత్సరాల తర్వాతనే ఆకాశవాణి హైదరాబాదు కేంద్రం ప్రారంభమయింది. 1954 నుండీ వార్తాప్రసారాలు ప్రారంభమయ్యాయి. 1957లో ప్రస్తుతం మనం చూస్తున్న ప్రదేశంలోకి రాక్‌ల్యాండ్స్ నుండీ మార్చబడింది. ఈ వివరాలు మనం శారదా శ్రీనివాసన్‌గారి గ్రంథంలో చూడవచ్చు.

హైదరాబాదు నగరం నిష్ణాతులైన కళాకారులకు పెట్టింది పేరు. నాటక ప్రదర్శనలు చాలా తరచుగా ఇక్కడ జరుగుతుంటాయి. 'రవీంద్రభారతి' ఇందుకు ఎంతో అనుకూలమైన క్షేత్రంగా కళాకారులు, కళాభిమానులు భావిస్తుంటారు. రవీంద్రభారతికి సమీపంగానే ఆకాశవాణి ఉంది.

ఆకాశవాణి హైదరాబాదు కేంద్రంతో నా అనుబంధం ప్రత్యేకించి చెప్పాలి. ఉద్యోగరీత్యా నేను కలకత్తా నుండి బేగంపేట విమానాశ్రయానికి బదిలీ మీద (ఏరోనాటికల్ ఇంజినీరుగా) వచ్చాను. రాగానే ఆకాశవాణి హైదరాబాదు కేంద్రానికి వెళ్లాను. చిరకాల మిత్రుడు శ్రీ గోపాల్ (శంకరాభరణం 'బ్రోచేవారెవరురా' పాడిన సంగీతం మాస్టారిగా ప్రముఖులు)ని కలిసాను. విజయవాడ ఆకాశవాణి కేంద్రంలో శ్రీ గోపాల్ నాకు సుపరిచితుడు. నేను అంటే ఎంతో అభిమానం. నాటక విభాగ కార్యక్రమ అధికారి శ్రీ వి.వి.యస్. శాస్త్రికి నన్ను పరిచయం చేసారు. "చాలా సీనియర్ రైటర్, గంట నాటకాలు బాగా రాస్తాడు, రాయించుకో" అన్నారు.

నేను శాస్త్రి గారికి రెండు గంట నాటకాలు ఇచ్చాను. ఒకటి - పోలీసు డైరెక్టరు జనరల్‌గా పదవీ విరమణ చేసిన మిత్రులు శ్రీ రావులపాటి సీతారాం రావుగారి 'బ్రతుకుబొంగరం' (ఇది ఆంధ్రప్రభ నవలల పోటీలో బహుమతి పొంది ఎంతో

ప్రసిద్ధి గాంచింది) నవలకి రేడియో నాటకీకరణ. రెండు– నేలతల్లి నవ్వింది. (Return to villages అనే సందేశాత్మక రచన).

రెండూ గంట నాటకాలే.

ప్రారంభం నుండీ నాకు నేరుగా రచన చేయటం అలవాటు. చిత్తుప్రతి, మేలుప్రతి అనేవి నాకు ఉండవు. రచనను మళ్ళీ మళ్ళీ పరిశీలించినప్పుడు అవసరమైన మార్పులు చేస్తాను. మరీ నచ్చకపోతే, ఆ పేజి మార్చేస్తాను.

1977 సం॥లో నేను శాస్త్రిగారికిచ్చిన రెండు నాటకాలకు కాపీలు నా దగ్గర లేవు. అప్పట్లో జిరాక్సులు లేవు. మిత్రుడు పిశుపాటి కార్బన్ కాపీ రాసిపెట్టుకునేవాడు. నాకు అంత ఓపిక ఉండేది కాదు. సమయం కూడ తక్కువ.

పైగా నా రచనలు తిరస్కరించబడిన సందర్భాలు చాలా తక్కువ. కారణం రాసిన తర్వాత పాఠకుడుగా, విమర్శకుడిగా, విశ్లేషణాత్మకంగా చదవటం నాకు అలవాటు. నచ్చితేనే రచన పంపుతాను.

ఇంతకీ చెప్పాల్సిన విషయమేమిటంటే శ్రీ శాస్త్రిగారు నేనిచ్చిన రెండు రచనలూ పోగొట్టారు! మార్పులు సూచిస్తూ పోస్టులో పంపామన్నారు. అప్పట్లో ఇంటెలిజెన్స్ ఎస్పీగా ఉన్న రావులపాటివారు తమ పలుకుబడితో పోస్టల్ డిపార్ట్‌మెంటు నుండీ ఆ రచనల ఆచూకీ కోసం గట్టి ప్రయత్నం చేసారు. కానీ, ఉపయోగం లేకపోయింది.

ఈ సంఘటన నాకు చాలా నిరుత్సాహం కల్గించింది. కానీ, శాస్త్రిగారు త్వరలోనే శ్రీ జీడిగుంట రామచంద్రమూర్తి గారు రాసిన ఒక నాటిక ఇతివృత్తం, ఆయన సెలవు మీద వెళ్లటంతో అరగంట నాటికగా ఒక్క రోజులో రాసివ్వమని అడిగేరు. ఆ రోజు రాత్రి దానిని పూర్తి చేసి అందజేసాను. శాస్త్రిగారు చాలా ఆనందించారు.

"మీ సామర్థ్యం అర్థమయింది కాటూరుగారూ! ఇకనుంచీ మీ స్క్రిప్టులు నేను చదివి సెలక్టు చేయాల్సిన పనిలేదు. టైటిల్, ఇతివృత్తం ఇస్తే షెడ్యూలు చేసేస్తాను" అన్నారు. అదే మాట చివరి వరకు నిలబెట్టుకున్నారు.

మా ఇద్దరి స్నేహానికి కారణమైన నాటిక పేరు 'ఊబి'. అప్పట్లో తాగుడుకి వ్యతిరేకంగా, తప్పనిసరిగా కొన్ని నాటకాలు ప్రసారం చేయాల్సి వచ్చేది. అందులో అదొకటి.

అలాంటిదే మరొక గంట నాటకం 'పిచ్చివాళ్ల స్వర్గం'. దీనిని సుప్రసిద్ధ నటి, ప్రయోక్త, శ్రీమతి శారదా శ్రీనివాసన్‌గారు ప్రొడ్యూస్ చెయ్యటం ఆ నాటకం అదృష్టం.

ఇప్పటికీ ఆ నాటకం రికార్డు(సిడిగా మార్పించాను) నా దగ్గరుంది. ఆకాశవాణి హైదరాబాదు కేంద్రంలో 'బవేజా'గారు డైరెక్టరుగా ఉన్నప్పుడు 'ఏడుపులో నవ్వు' అనే రంగస్థలానికి అనువైన శ్రవ్యనాటిక ఇచ్చాను. కీ.శే. ఎ.సత్యనారాయణ దానిని ప్రొడ్యూస్ చేసారు. ఆకాశవాణి ఒక సంగీత, సాహిత్య సాంస్కృతిక కేంద్రంగా విలసిల్లిన బంగారు శకంలో నేను మమేకమై ఉండటం నా పూర్వ జన్మ సుకృతం.

## హాస్య శ్రవ్యనాటికలు

హాస్యానికి గల ప్రాధాన్యత అందరికీ తెల్సిందే.

ఆకాశవాణి హాస్యానికి పెద్ద పీట వేసింది.

వివిధభారతి కార్యక్రమాలు నిర్వహించే అధికారి నర్సింహాచార్యులుగారు నా చేత హాస్య నాటికలు ఎక్కువగా రాయించుకునేవారు. ఒక విధంగా హాస్య రచనతో మెప్పించటం చాలా కష్టం. శ్రవ్య నాటకాల్లోగానీ, నాటికల్లోగానీ శబ్దాశ్రయ హాస్యంతోనే ఇతివృత్తాన్ని తీర్చిదిద్దాలి.

నటుడిలో హాస్యాన్ని పండించగల పలుకుబడి ఉండాలి. ఇందులో నండూరి సుబ్బారావుగారిది అనితరసాధ్యమైన బాణీ. ఈ సందర్భంగా నేనొక చిన్న సంఘటనను ఎలా హాస్య నాటికగా మలిచానో చెబుతాను. దాని పేరు 'కుక్కలున్నాయి జాగ్రత్త'.

నేను డ్యూటీ ముగించుకుని, హిమాయత్‌నగర్ పోస్టాఫీసు మీదుగా, మా ఇంటికి (దోమలగూడ) వెళ్తుండేవాడిని. దారిలో ఒక సంపన్న గృహం ఉండేది.

గేటుకి 'కుక్కలున్నాయి జాగ్రత్త' అనే బోర్డు వ్రేలాడుతూ ఉండేది. కానీ, ఎప్పుడూ కుక్క కనిపించేది కాదు. ఒక అందమైన అమ్మాయి అటు ఇటు తిరుగుతు కన్పించేది.

నాకు నవ్వొచ్చేది.

దాన్ని హాస్య నాటికగా 'కుక్కలున్నాయి జాగ్రత్త' పేరు మీద రాసాను. క్లుప్తంగా కథేమిటంటే–

ఒక ముసలి తండ్రి.

ఆయనకో అందాలభరిణె కుమార్తె.

ఎవరన్నా కూతుర్ని వలలో వేసుకుని మోసం చేస్తారేమోనని ఆయనకి ఒకటే భయం.

అందుకే కుక్క లేకపోయినా ఉన్నట్టు బోర్డు పెట్టాడు. చివరకి కూతురి క్లాసుమేట్ ఆ ఇంట్లోకి, ఆమె మద్దతుతో అద్దెకు చేరతాడు. మేడమీద గది అతనికిస్తారు.

వాళ్లిద్దరూ ఎప్పుడు ఏకాంతంగా కలుసుకుని ఊసులాడుకుంటున్నా, కిందనుంచీ ముసలాయన కుక్కలా మొరిగి కూతుర్ని హెచ్చరిస్తాడు. కానీ ఆమె పట్టించుకోదు.

చివరకి క్లాసుమేట్లు ఇద్దరూ పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకుంటారు. ఆద్యంతమూ నవ్వించే ఈ హాస్య నాటికను శ్రోతలు బాగా స్వీకరించారు. ప్రశంసలు కురిపించారు. ఇందులో తండ్రి పాత్రను ఆకాశవాణి అధికారి భీమయ్యగారు ధరించటం విశేషం. ఆయనిప్పుడు లేరు. కానీ, నా దగ్గరున్న రికార్డులో ఆయన గాత్రం భద్రంగా ఉంది.

శ్రవ్యనాటికలు, నాటకాలు రాయటానికి హాస్య ప్రవృత్తి కలిగి ఉండడం చాలా ఉపకరిస్తుంది. పిశుపాటి ఉమామహేశ్వరమ్‌లో ఈ స్వభావం ఉండేది. ఆయన• ఎప్పుడూ ఛలోక్తులు విసుర్తు, అందర్నీ నవ్వుల్లో ముంచెత్తే ప్రయత్నం చేస్తుండేవారు. ఆయన కూడా రేడియోకి చాలా శ్రవ్యనాటకాలు రాసారు.

ఆయన రచనల్లో వ్యంగ్య హాస్యం ఉండేది.

హాస్యం కన్న వ్యంగ్య హాస్యం రాయటం చాలా కష్టం.

గురజాడవారి 'కన్యాశుల్కం'లో పైకి హాస్యం కనిపించినా, అంతర్గతంగా వ్యంగ్యం ఉంది.

బహుకొద్దిమంది ఈ లక్షణాన్ని గ్రహించగలిగారు.

ఈ సందర్భంగా పిశుపాటి 'గవర్నమెంటు దొంగలు' నాటకం గురించి చెప్పుకోవాలి.

ఆయన ఒకమాటు నా దగ్గరకొచ్చి 'గవర్నమెంటు దొంగలు' నాటకం స్క్రిప్టు ఇచ్చి "గురువుగారూ! దీని మీద మీ అమూల్యాభిప్రాయం కావాలి" అని ఎదురుగా కూర్చున్నాడు.

ఓపిగ్గా చదివేను.

నాటకం చాలా పదునుగా ఉంది.

వ్యంగ్య హాస్యం!

రాసింది ప్రభుత్వ ఉద్యోగుల లంచగొండితనం మీద! స్క్రిప్టు తిరిగి ఇస్తు "మీరు వ్రత కథలెప్పుడైనా చదివేరా?" అనడిగేను.

"చదివేను. ఎందుకలా అడిగేరు?" అని ప్రశ్నించాడు.

"వ్రతకథ చివర్లో ఫలం గురించి రాస్తారు... అవునా?"

"అవును!"

"ఏమని రాస్తారో చెప్పండి"

"ఈ వ్రతం చేసినవారు, చూసినవారు తరిస్తారనో, సర్వ సంపదలూ పొందుతారనో ఉంటుంది".

"అలాగే, మీ నాటకం వేసినవార్ని, చూసినవార్ని, చివరకి రాసిన మిమ్మల్ని కూడా పోలీసులు లాక్కెళ్లి లాఠీలతో సత్కరిస్తారు" అనేసరికి ఆయన ఫక్కున నవ్వేసారు.

"నాకు తెలుసు మీరిలా అంటారని! మనసు ఆపుకోలేక రాసాను. స్టేజికీ, రేడియోకి రెంటికీ పనికిరానిదయింది" అన్నాడు విచారంగా.

"విచారించకండి. మీ నాటక సంపుటిలో ముద్రించుకోవచ్చు! ఆ విధంగా మీ రచన వ్యర్థం కాదు" అన్నాను.

ఈ విషయం ఎందుకు చెప్పానంటే, శ్రవ్య నాటకాలు ప్రభుత్వ వ్యతిరేకంగా, ప్రభుత్వాన్ని విమర్శిస్తు రాయకూడదు.

శ్రవ్యనాటకాల రచనల్లోని జాగ్రత్తలు-మెళుకువలు గురించి తర్వాత అధ్యాయాల్లో వివరిస్తాను.

ఆకాశవాణితో నా అనుబంధం అయిదేళ్లు కొనసాగింది. నాటక విభాగ అధికార్లుగా శ్రీ పి.ఎస్.గోపాలకృష్ణ, అట్లూరి వెంకట్రామయ్య చౌదరిగార్లుండేవారు. గోపాలకృష్ణగారు తదనంతర కాలంలో హైదరాబాదు కేంద్ర సంచాలకులుగా పదవీ విరమణ చేసారు.

నేను విరివిగా శ్రవ్య నాటకాలు రాసిన కాలంలో ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో నాటక విభాగ కార్యక్రమ నిర్వహణాధికార్లుగా పని చేసినవారిలో ప్రముఖులు- శ్రీ శంకరమంచి సత్యం, శ్రీ పి.ఆర్.రెడ్డి, శ్రీ ఎన్.ఎమ్.జి.రామకృష్ణ, శ్రీ పాండురంగ, శ్రీ ఐ.రమామోహనరావు, శ్రీ గోపాల్, శ్రీమతి ముంజలూరి కృష్ణకుమారి(వీరి హయాంలోనే నాకు జాతీయ బహుమతి వచ్చింది), శ్రీమతి వేదవతి, శ్రీ బాబూరావ్, శ్రీ పంతగాని గోపాలకృష్ణ, శ్రీ ఖుద్దూస్ వగైరాలు.

వీరిలో మొదటి తరం వారంతా డైరెక్టర్లయ్యారు.

కొందరు కీర్తిశేషులయ్యారు. కొందరు రిటైరయ్యారు. శ్రీమతి కృష్ణకుమారిగారు ఆకాశవాణి విజయవాడ కేంద్ర సహాయ సంచాలకులుగా ఉన్నారు. వారి భర్త

శ్రీ పన్నాల సుబ్రహ్మణ్యభట్టు మేధావిగా ప్రసిద్ధులు. ఇంగ్లీషు, తెలుగుల మీద మంచి పట్టు ఉన్న రచయిత. హాస్య, వ్యంగ్య రీతుల్లో నిష్ణాతుడు. సద్విమర్శకుడు. సూటిగా వ్యవహరిస్తారు.

నాకు జాతీయ బహుమతి లభించగానే అభినందిసస్తూ "ఇక మీరు సన్మానాలు చేయించుకో" వచ్చునటం నాకు నవ్వు తెప్పించింది. ఈ రచనలో శ్రీమతి కృష్ణకుమారి గారు కొంత సమాచారాన్నిచ్చి సహకరించారు. వారికి కృతజ్ఞతలు చెప్పటం నా ధర్మం. అలాగే విశ్రాంత సంచాలకులు, నా చిరకాల మిత్రుడు నేను ఆప్యాయంగా 'బావగారూ!' అని పిలిచే శ్రీ పాండురంగ, చినుకు సంపాదకులు రాజగోపాల్, కాలమిస్టు డా॥ స. శ్రీ., శ్రీమతి శారదా శ్రీనివాసన్, మా అల్లుడు ఏ-టాప్ గ్రేడ్ ఆర్టిస్టు, రోటరీ గవర్నర్‌గా అంతర్జాతీయ కీర్తిని ఆర్జించిన శ్రీ ఎమ్.సి.దాస్‌లు నేను కోరిన సమాచారాన్ని ఆప్యాయంగా ఆత్మీయంగా అందించారు. అందరికీ నేను ఋణగ్రస్తుడ్ని.

నా నాటకాల్లో చాలా సీనియర్లు నటించారు. శ్రీ ఎమ్.సి.దాస్, కర్నాటి లక్ష్మీనర్సయ్య, శ్రీ ఆచంటవారు, మాచినేని, శ్రీ అర్జా ప్రకాశరావు, వైయస్టీశాయి, నండూరి సుబ్బారావు, చుండూరి మధుసూదనరావు, ఎమ్వీయల్ నర్సింహారావు, సుఖమంచి కోటేశ్వర్రావు, ఎమ్మెల్సీ బోసుగారు ఇలా ఎందరో.

ప్రస్తుతం సినిమాల్లో రాణిస్తున్న పిల్లా లక్ష్మీప్రసాదు నా ప్రత్యేక శ్రవ్యనాటకాల్లో ప్రధాన పాత్రలు పోషించారు.

శ్రీ కోకా సంజీవరావు, శ్రీ ఎ.బి.ఆనంద్‌లు నా నాటకాలలో నటించడంతో బాటు నిర్వహించేవారు. అలాగే మాడుగుల రామకృష్ణ.

పాత తరానికి చెందిన నటీమణులు వి.బి.కనకదుర్గ, సీతారత్నమ్మ, విజయలక్ష్మిలతో బాటు తర్వాత తరానికి చెందిన ఒంగోలు ఇందిర, రాజకుమారి, సి.హెచ్.వాణీబాల వంటి మేటి ఆర్టిస్టు నటించారు.

నా ధారవాహిక నాటకాల్లో 'కామరాజు కాపురం' (ఏడు భాగాలు) గురించి ప్రత్యేకంగా చెప్పాలి. శ్రీ పాండురంగ ఈ నాటక ప్రయోక్త.

శ్రీ పేరి కామేశ్వర్రావు, శ్రీమతి సరోజానిర్మల (ఆకాశవాణి హైదరాబాదు కేంద్ర అధికారిగా పదవీ విరమణ చేసారు) ఈ హాస్య ధారావాహికలో ప్రధాన పాత్రలు పోషించారు).

సమకాలీన సమస్యలు, పరిస్థితుల్ని ఇతివృత్తంగా తీసుకుని, ఏ వారానికి ఆ వారం రాసి ఇచ్చేవాడిని. దీనికి సంబంధించిన సంఘటన ఒకటి చెప్పుకోవాలి.

విజయవాడ సూర్యారావు పేటలో రోడ్డు పక్కనే ఉన్న ఇంట్లో పాండురంగ అద్దెకుండేవాడు. ఒక మాటు భార్యాభర్తలు రాత్రి రెండో ఆట సినిమాకి వెళ్లివచ్చేసరికి దొంగలు ఇంట్లో పూచికపుల్ల కూడ మిగల్చకుండా దోచేసారు.

ఇదే ఇతివృత్తంగా ఆ తర్వాత వారం ఎపిసోడ్ రాసి ఇచ్చాను. ఇందులో హెచ్చరికను హాస్యంలో ఇమిడ్చాను. శ్రోతలు బాగా ఆనందించారు. ప్రశంసల లేఖలు చాలా వచ్చాయి.

శ్రీ పేరి కామేశ్వరావు ప్రస్తుతం లేరు. ఆయన వాచకం చాలా బావుండేది. ఈ ధారావాహిక రికార్డు కూడ నా వద్ద భద్రంగా ఉంది. కందుకూరి చిరంజీవిరావు గారిది చక్కని గళం. ఆయన రంగస్థల నటులు కూడా. ఆయన కొన్ని నాటకాల్లో నటించి, నా రచనకు న్యాయం చేసారు. ఎప్పుడు కన్పించినా ఎంతో ఆత్మీయంగా మాట్లాడేవారు. ఆయన ఆకాశవాణి ఉద్యోగిగా పదవీ విరమణ చేసారు.

ప్రస్తుతానికి ఆయనా లేరు.

'దేశం పిలుస్తోంది' అనే గంట నాటకం భారత వైమానిక దళ ప్రత్యేక ఉత్సవాల సందర్భంగా రాసి ఇచ్చాను. ఇందులో వైమానిక యుద్ధ సన్నివేశాలు ధ్వనుల ద్వారా (sound effects) వినిపించాలి. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (A.T.C.), యుద్ధ విమాన పైలట్‌తో చేసే సంభాషణలు ఉంటాయి. కొన్ని సాంకేతిక పదాలు

ఉన్నాయి. వాటిలో 'ఏంజెల్స్' అనే మాట ఒకటి.

దీనర్థం 'భూమినుండీ విమానం ఎత్తు' వేల అడుగుల్లో చెబుతారు. పైలట్‌కి రాడార్ కంట్రోల్‌వారు ఈ సమాచారాన్ని తెలియజేస్తుంటారు.

ఈ నాటకంలో ప్రధాన పాత్ర శ్రీ ఎమ్.సి.దాస్ పోషించారు. సుస్వరం ఆయనకు దేవుడిచ్చిన వరం, అద్భుతమైన వాచకంతో అందర్నీ ఆకట్టుకునేవారు. నాలుగు దశాబ్దాలు దాటుతున్న మా స్నేహం కొంతకాలం క్రితం బాంధవ్యమై ఆయన నాకు వరసకి అల్లుడైనాడు.

ఈ నాటకాన్ని శ్రీ చల్లారామ్మోహనరావుగారు ప్రయోక్తగా రికార్డు చేయిస్తున్నారు. ఆయన నేను పైన చెప్పిన 'ఏంజెల్స్' అనే సాంకేతిక పదాన్ని 'ఏంగెల్స్'గా పలకటం విన్న ఉషశ్రీ (ఇద్దరూ ఆప్తమిత్రులు. కలిసే తిరిగేవారు). అందులో ఏదో పొరబాటు ఉందనిపించి, విజయవాడ మెయిన్ బ్రాంచి (పంజాబ్ నేషనల్ బ్యాంకు)లో పన్చేస్తున్న నన్ను పిలిపించారు.

నేను దాని గురించి వివరించి 'ఏంజెల్స్'గా పలకాలని సూచించాను. ఆ ఆనటకం పూర్తయేవరకు నన్ను తమతోనే ఉండమనటంతో ఉండిపోయాను.

ఉషశ్రీగారు నన్ను తమ గదికి తీసుకువెళ్లి గంటసేపు నా వైమానిక జీవితానుభవాలు, నేను పాల్గొన్న రెండు యుద్ధాల (1965, 1971) వివరాలు ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత "అబ్బో... మీ దగ్గర వినాల్సినవి ఇంకా చాలా ఉన్నాయి" అంటూ కన్పించినప్పుడల్లా సరదాగా 'గురూగారూ' అంటూ ఆత్మీయంగా పలకరించేవారు.

నిజానికి 'ధర్మసందేహాలు' తీర్చిన ఆధ్యాత్మికవేత్తగా ఎందరికో ఆయన గురుతుల్యుడయ్యాడు.

ఆయన ఎంత గంభీరుడో అంత చమత్కారి, స్నేహశీలి.

వయస్సులోను, విజ్ఞానంలోను పెద్దవాడయినా ఆత్మీయంగా అందరితో కలిసిపోవటం ఆయన ప్రత్యేకత. నేను రాసిన ప్రముఖ నాటకాల ప్రస్తావనకి ఒక కారణం ఉంది. రాబోయే అధ్యాయాలలో శ్రవ్యనాటక రచనలోని లక్షణాలు, ఆవశ్యకతలు, తదితర విషయాల వివరణ సమయంలో ఈ వివరాలు చెప్పటం వీలుకాదు. ఆకాశవాణికి అపురూపమైన సేవలు అందించిన మహానుభావుల గురించి చెప్పకపోవటం ఈ గ్రంథ సమగ్రతకి లోపం అవుతుంది. స్వగతంగా కనిపించినా ఇందులో ప్రముఖంగా వారి ప్రస్తావనే ఉంటుంది. ఇది గమనించాల్సిన విషయం.

ఆకాశవాణి విజయవాడ కేంద్ర సంచాలకుల్లో పి.యు. అయూబ్‌గారు (ఈయన మలయాళీ) మంచి కార్యక్రమాలు చేయించారు.

ఆయన, నాటకాల రికార్డింగ్ సమయంలో రచయితల్ని పిలవాలని ఆదేశించారు. ఇది నా నాటకంతో ఆరంభమయింది.

ఆ తర్వాత కన్నడిగులయిన శ్రీ కులకర్ణిగారు ఆకాశవాణి డైరెక్టరుగా విజయవాడ వచ్చారు.

అప్పుడు నాటక విభాగం అధికారిగా ఉన్న పాండురంగ నన్ను ఆయనకు పరిచయం చేసారు.

నా నేపథ్యం విని, అప్పటికప్పుడు ఆయన నాకొక ఇతివృత్తం చెప్పారు. అదేమిటంటే–

ఒక మిలట్రీ అధికారి, రిటైరయి భార్య, కుమారుడితో తన స్వగ్రామం తిరిగి వస్తాడు. పిల్లలతో ఆడుకుంటున్న ఆయన కుమారుడ్ని ఒక పిల్లాడు "మీదేం కులం?" అనడుగుతాడు. ఏం చెప్పాలో తెలియక ఇంటికొచ్చి "మనదేం కులం?" అని తల్లిని అడుగుతాడు. ఆమె విషయం తెల్సుకుని, "ఈ సంకుచిత మనుషుల మధ్య మనం ఉండొద్దు. సిటీకి వెళ్లిపోదాం పదండి" అని భర్తని తొందర పెడుతుంది. మిలటరీలో కులాల ప్రసక్తి ఉండదు.

కులకర్ణిగారు ఇంతవరకే చెప్పి, అరగంట నాటిక రాయమన్నారు. ఆ రాత్రి బాగా ఆలోచించి దానికి 'గవాక్షం' అని పేరు పెట్టాను.

"కిటికీ విశాలంగా ఉంటే ప్రపంచం విశాలంగా కనిపిస్తుంది. మనసు కూడ అలాగే ఉండాలి" అనేవారు నా సాహిత్య గురువైన మా నాన్నగారు.

ఆ సందేశాన్ని నాటికలో పొదిగాను.

కులకర్ణిగారి కథను పొడిగించాను. మిలట్రీ అధికారి తమ గ్రామంలోని వ్యక్తుల్లో కుల భావనలు పోయేలా విజయవంతమైన కృషి చేస్తాడు. నాటకం సందేశంతో ముగుస్తుంది.

దీని మీద శ్రోతల అభినందన ఉత్తరాలు చాలా వచ్చాయి. వాటిని చదివించుకుని విన్న కులకర్ణిగారు చాలా సంతోషించారు.

తర్వాత కాలంలో ఆయనే నా చేత, తనే ఇతివృత్తాలనిచ్చి, మూడు గంటల నాటకాలు రాయించారు. ఒకటి: అక్కమహాదేవి. చారిత్రకం. దీనికోసం ఎనిమిది పాటలు రాసాను. వాటికి ఆకాశవాణి ఆర్టిస్టు ప్రియంవదగారు బాణీలు కూర్చారు.

రెండవది 'వైతాళికులు'. స్వాతంత్ర్యం చీకటిలోంచి మనల్ని వెలుగులోకి తెచ్చింది. నిర్లక్ష్యం చేస్తే, మళ్లీ మనం చీకట్లోకి వెళ్తాం అనేది అంతస్సూత్రంగా నడిచే నాటకం ఇది. ఇందులో కూడా కొన్ని పాటలున్నాయి. ప్రధాన పాత్రలో ఆచంట బాలాజీ నాయుడు నటించారు. పాండురంగ ప్రయోక్త.

నాటకం చాలా బాగా వచ్చింది.

మూడో నాటకం: 'ద్వా సుపర్ణా సయుజా సఖాయా' అనే ఉపనిషత్తుల సందేశం మీద అల్లబడిన కథ. ఇది ముండకోపనిషత్తులోని ఒక శ్లోకం.

కులకర్ణిగారు తమ భావాలను ఇంగ్లీషులో రాసుకుని, ఇప్పుడు ఆకాశవాణి హైదరాబాదు కేంద్రంలో అధికారిగా పన్చేస్తున్న శ్రీ సి.యస్. రాంబాబుని సాయం తీసుకుని, మా ఇంటికి వస్తుండేవారు.

ఆ నాటకాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని, మూడు సార్లు తిరిగి రాసాను. శ్రీ కోకా సంజీవరావు ప్రయోక్తగా వ్యవహరించారు. అది జాతీయ స్థాయి పోటీలకు పంపబడింది.

శ్రీ పురాణం సుబ్రహ్మణ్య శర్మ, శ్రీమతి గిరిజ(డైరెక్టరు కె.విశ్వనాథ్ చెల్లెలు), ఎస్ఆర్ఆర్ కాలేజి ప్రిన్సిపాల్ (స్క్రీనింగ్ కమిటీ సభ్యులుగా మంచి మార్కులు వేసారు).

ఆ నాటకం ఇంగ్లీషు, హిందీ భాషల్లోకి ఆకాశవాణి అనువాదం చేయించింది. ఆ రెండు ప్రతులతో తెలుగు ప్రతిని బైండు చేయించి, కులకర్ణిగారు అభినందనలతో నాకు బహూకరించారు.

అదొక రికార్డు.

ఆ నాటకంలో తెనాలి వైయస్టి శాయి యముడి పాత్ర ధరించారు. రెండు చింత రామచంద్రరావు కాలపురుషుడిగా, కోకా సంజీవరావు, పద్మజా నిర్మలగార్లు ప్రధాన పాత్రలుగా నాటకాన్ని రక్తి కట్టించారు.

ఈ నాటకం రికార్డు కూడ భద్రంగా ఉంచాను. ఆ తర్వాత, ఆకాశవాణి జాతీయ నాటకాల పోటీ ప్రకటించింది. రెండు విభాగాలు.

ఒకటి: హాస్యం.

రెండు: సాధారణం.

రెంటికీ రాసాను.

'జురాహమ' నాటకం హాస్య విభాగంలో ప్రథమ బహుమతి పొందింది.

ఇతివృత్తం: "న్యాయం ఆలస్యం అవటమంటే, అలభ్యంగా మారటమే" అనేది సందేశం. (justice delayed is denied) దీన్ని వ్యంగ్య హాస్య రీతిలో రచించాను.

ఆదివిష్ణు జడ్జిగా వ్యవహరించారు. ప్రథమ బహుమతికి ఎంపిక చేసారు.

ఆ నాటకాన్ని అడిగి మరీ ఆకాశవాణి హైదరాబాదు నాటక విభాగ అధికారి సరోజానిర్మల ప్రొడ్యూస్ చేసారు. నాటక వారోత్సవాల్లో దాన్ని ప్రసారం చేసారు. ఆ నాటకం ఎందర్నో ఆకట్టుకుంది. వారిలో ఆకాశవాణి ప్రయోక్త సి.వి. సూర్యనారాయణగారు ఒకరు. ఆ విషయం ప్రస్తావించాను.

రెండో నాటకం అంతర్యామి. సాధారణ విభాగంలో ఎంపిక అయింది. ఈ నాటకాన్ని శ్రీ పంతగాని గోపాలకృష్ణ ప్రొడ్యూస్ చేసారు. ఆయన కొత్తగూడెం వెళ్లాక కూడ నా రచనలు 'శలభం', 'చినుకు' (గంట నాటకాలు) ప్రసారం చేసారు.

ప్రస్తుతం ఆయన దూరదర్శన్ అధికారిగా ఉన్నారు. శ్రీమతి వేదవతిగారు నా చేత ధారావాహికలు, ప్రత్యేక నాటకాలు రాయించారు. వాటిలో 'మక-తిక' నాటక వారోత్సవాలలో ప్రసారమయింది. 'అర్జెంటినా' దేశం ఆర్థికంగా కూలిపోయిన స్థితిని ఇతివృత్తంగా, ఒక హెచ్చరికగా రాసిన రచన అది.

మరో నాటిక 'అరణ్యన్యాయం'. బ్రతికున్న వారి ఆస్థులు కాజేయటానికి కొందరు గుండాలు వారు మరణించినట్లు రికార్డులు సృష్టించి, సమస్యలు సృష్టించటం కథాంశం. ఇలాంటి సంఘటన కంకిపాడులో జరిగింది.

ఉత్తరప్రదేశ్‌లో తరచుగా జరుగుతున్నాయి. బాధితులు 'మృతక్ సమాజ్' అనే సంఘాన్ని స్థాపించి, న్యాయపోరాటాలు చేస్తున్నారు. ఈ నాటిక బాగా ప్రశంసలందుకుంది. ఈ విధంగా ఆకాశవాణికి వివిధ ఇతివృత్తాలను నాటకాలుగా అందించాను.

ఇప్పటివరకు నేను రాసిన శ్రవ్య నాటకాలు నూరు దాటాయి.

దూరదర్శన్‌కి ధారావాహికలు, నాటికలు, డాక్యుమెంటరీలు కూడా చేసాను. కవి సమ్మేళనాల్లో పాల్గొన్నాను. చర్చా కార్యక్రమాలు నిర్వహించాను.

# రెండవ అధ్యాయం

శ్రవ్యనాటకాలు ఎలా రచించాలి?

1960 సం॥లో శ్రవ్య నాటక రచన గురించి రేడియో అన్నయ్య ఏడిద కామేశ్వర్రావుగారు కొన్ని మార్గదర్శక సూత్రాలు చెప్పారు.

1) సంభాషణలు అర్థయుక్తంగా, చిన్నవిగా ఉండాలి.

2) కథను సంభాషణల ద్వారా నడిపించాలి.

3) చమత్కారం ఉండాలి.

4) నిర్ధారిత ప్రసార సమయం(15 ని॥లు-30 ని॥లు-60 ని॥లు) లోపల నాటిక /నాటకం పూర్తయిపోవాలి.

5) ప్రసార సమయం కన్న రెండు నిముషాలు తక్కువ ఉంటే నాటక వివరాలు ప్రకటించే వీలుంటుంది.

6) సందర్భానుసారం నాటకాన్ని అంకాలుగా విభజించుకోవాలి.

7) విరామ సంగీతం- సూచనలు ఇవ్వాలి.

8) నాటకంలో ఏ సంభాషణా కులమతాలకు సంబంధించి ఉండకూడదు.

9) వ్యాపార వస్తువుల పేర్లు ఉండకూడదు. ఉదా॥ అమృతాంజనం, విక్స్ లాంటి మందుల పేర్లు రాయకూడదు.

10) ప్రభుత్వ విధానాలను విమర్శించేవిగా సంభాషణలు ఉండకూడదు.

11) ప్రత్యక్షంగా లేక పరోక్షంగా ఏ వ్యక్తినీ ఉద్దేశించి రాయకూడదు.

ఇలాంటి కొన్ని సూచనలు, సూత్రాలు, జాగ్రత్తలూ చెప్పారు. నండూరివారు మరికొన్ని మెళకువలు చెప్పారు. ఆయన హాస్యానికి మారుపేరు గనుక, అందుకు

సంబంధించినవి చెప్పారు. హాస్యం ఆనందించేలా ఉండాలి. కించపరిచేలా, వెక్కిరింతగా, అపహాస్యంగా, నొచ్చుకునేలా ఉండకూడదు.

ఇలా రాయటానికి చాలా శ్రమించాలి. నేను నండూరివారి హాస్య నాటకాలు ఎంతో ఆసక్తిగా వినేవాణ్ణి. ఆయన కొన్ని పాత కాలం మాటలు నవ్వు తెప్పించేలా అనేవారు.

"నీ మొహం మండ..." లాంటి ప్రయోగాలు అనే తీరులో హాస్యం కురిపించేవి. ఫక్కున నవ్వొచ్చేది.

మధ్య తరగతి కుటుంబాల్లోని కొన్ని సంఘటనల్లోంచి ఆయన స్వయంగా చక్కని హాస్య నాటికలు రచించి, ప్రసారం చేసారు.

అందులో ఒకటి ప్రస్తావిస్తాను.

'ఆవకాయ జాడీతో రైలు ప్రయాణం' మీద ఆ నాటిక రచింపబడింది.

సంఘటనలు ఇలా ఉంటాయి.

ఆవకాయ నూనె కొద్దికొద్దిగా కారుతుంటుంది. అది ప్యాకింగ్‌కి పాకి, చూసేవాళ్లకి రక్తం అనిపిస్తుంది.

'టికెట్ ఎగ్జామినర్' అందులో రక్తసిక్తమయిన తలకాయో శరీర భాగాలో ఉన్నాయేమోనని అనుమానపడటం, ప్రయాణీకుడు 'కాదుమొర్రో' అని మొత్తుకోవటం ఆద్యంతమూ నవ్వుల పువ్వులు పూయించిన 'హాస్యరస గుళిక' ఈ నాటిక. నండూరివారు నటించిన నా హాస్య నాటికల్లో ఒకటి ప్రస్తావిస్తాను. కథేమిటంటే-

భార్యాభర్తలు- భార్య గడుసు. భర్త మెతక.

భార్య వంట ఘోరం. పాటలు పాడితే గొంతు మరీ ఘోరం. తనకి తనే పరమ భక్తురాలిగా భావిస్తు, రోజూ శ్రీకృష్ణుడి ఫొటో ముందు భక్తిపాటలు పాడి, తన వంట నైవేద్యం పెడుతుంటుంది.

శ్రీకృష్ణుడు భర్తతో తను పడుతున్న హింస చెబుతాడు.

నైవేద్యం అరక్క అజీర్తితో బాధపడుతున్నట్లు చెప్పగా, అదే విషయం భార్యకి చెబుతాడు.

"నేను మహాపతివ్రతని. నాతో మాట్లాడకుండా స్వామి నీతో ఎలా మాట్లాడతాడు" అంటూ వాదిస్తుంది.

ఇలా సాగిపోతుంటుంది నాటిక.

ఇలాంటి మరో నాటిక 'పర్వతాంబటామీ'. దాంట్లో కూడా శ్రీ నండూరివారే నటించారు.

వంటమనిషితో పడే ఇబ్బందులు హాస్యస్ఫోరకంగా చెప్పటం జరిగింది.

నండూరివారు నటించిన కొన్ని ప్రసిద్ధ నాటకాలు మనం స్మరించుకుతీరాలి. చిలకమర్తివారి 'గణపతి'ని ఆయన స్వయంగా కూర్చుకుని, నటించి చిరస్మరణీయం చేసారు.

## ఆకాశవాణి గురించి కొందరు పెద్దల జ్ఞాపకాలు

"మంచి నాటకం సీరియల్‌గా ప్రసారమవుతుంటే ఆ సమయానికి అన్ని పనులూ మానుకుని, రేడియోలో వచ్చే కార్యక్రమం వింటానికి కుటుంబంలో అందరూ కూర్చుని వినేవారు. స్వర్గీయ కె.వేంకటేశ్వరరావు, రామచంద్రకాశ్యప, బి.రామన్న పంతులు, నండూరి సుబ్బారావు, సి.రామ్మోహనరావులు నటించిన ఎన్నో నాటకాలను జనం మంచి సినిమాల కోసం ఎదురు చూసినట్లు వేచి చూసి, విని ఆనందించేవారు.

**- శ్రీ అందవిల్లి సత్యనారాయణ**

"ఆ రోజుల్లో విజయవాడ రేడియో కేంద్రం లోపల వెలుపల కూడ చెట్లు, పూలమొక్కల మధ్య ఒకనాటి మద్రాసు ఎగ్మూరు కేంద్రాన్ని తలపిస్తు ఉండేది. బుచ్చిబాబు, బాలాంత్రపు రజనీకాంతరావు, జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రి, శ్రీవాత్సవ,

వింజమూరి శివరామారావు, ఆమంచర్ల గోపాలరావు, జి.వి. కృష్ణారావు, ఉషశ్రీ, గొల్లపూడి మారుతీరావు, శంకరమంచి సత్యం, ఓలేటి వెంకటేశ్వర్లు, శ్రీరంగం గోపాలరత్నం, వింజమూరి లక్ష్మి, అన్నవరపు రామస్వామి, కృష్ణమాచార్యులు, జగన్నాథాచార్యులు, పాలగుమ్మి విశ్వనాథం, బందా కనకలింగేశ్వరరావు లాంటి ప్రసిద్ధులు ఆకాశవాణిని సరస్వతీ నిలయం చేసారు.

శంకరమంచి హరహరమహాదేవ, అమరారామం నాటకాలు, కొడుకు పుట్టాల (గణేశ్‌పాత్రో), సైకిల్ అప్పారావు (పురాణం), బుచ్చిబాబు నాటకాలు చిరస్మర ణీయాలు".

**- శ్రీ నందూరి రామ్మోహనరావు**

"In Radio dramas all out attempts are made to convey emotional complexities through ruthless simplicity, moral concerns through a wholly dramatic impagination.

The ideal goals of drama can only be attained when the participant of a drama merges his 'self' into the art, into what he is creating for the moment.

Radio dramas generally intend to impress the listeners with the sentiments or feelings (NVA RASALU)

**- P.U.Aiyoole**

S.D.(Rtd.)

ఈయన మలయాళీ, అయినా తెలుగు నాటకాల పట్ల మంచి అభిరుచి చూపారు.

ఇంకా శ్రీమతి దుర్గా భాస్కర్ S.D.(Rtd.), డా॥ అనంత పద్మనాభరావు (DDG Rtd), ఎమ్.వి.ఆర్.శాస్త్రి (ఆంధ్రభూమి సంపాదకులు), శ్రీకూచి మంచి సత్యసుబ్రహ్మణ్యం వంటి సీనియర్లు ఆకాశవాణి ప్రసారాల మీద విలువైన అభిప్రా యాలు వెల్లడించారు.

వీరందరికీ ఆకాశవాణితో ప్రత్యక్ష సంబంధాలు ఉన్నాయి.

ఆకాశవాణి ప్రసారం చేసిన వివిధ కార్యక్రమాల్లో శ్రవ్యనాటకాలకు ప్రత్యేక స్థానం ఉండేది. కొన్ని నాటకాలు మళ్లీ మళ్లీ(పునః) ప్రసారం అవుతుండేవి.

కొన్ని మద్రాసు ఆకాశవాణి కేంద్రం నుండీ ప్రసారమవుతుండేవి. నా శ్రవ్యనాటికలు కొన్ని మద్రాసు ఆకాశవాణి కేంద్రం నుండీ పునః ప్రసారమయ్యాయి.

ఆకాశవాణి మద్రాసు కేంద్రానికి కొన్ని ప్రత్యేకతలు ఉండేవి. సినీ రంగ ప్రముఖులు అందుబాటులో ఉండేవారు. రచయితల చేత మంచి నాటకాలు రాయిస్తే, ప్రముఖ నటీనటులు అందులో నటించి రక్తి కట్టించేవారు. ఆ వివరాలు శ్రీ గొల్లపూడి మారుతీరావు వ్యాసాల్లో చూడవచ్చు.

ఒక సాహిత్య కార్యక్రమానికి మద్రాసు వెళ్లినపుడు ఆకాశవాణి కేంద్రానికి వెళ్లాను. అక్కడ శ్రీ పి.ఎస్.గోపాలకృష్ణ ఉన్నారు. అర్జంటుగా కథ రాసిమ్మంటే, 'కాదంబరి' అనే కథ రాసిచ్చాను.

నా చేతనే చదివింపజేసి ప్రసారం చేసారు.

ఆ కథ తర్వాత అచ్చులో వచ్చింది.

ఆకాశవాణి మద్రాసు కేంద్రం ప్రసారం చేసిన శ్రవ్యనాటికలు చాలా ఉన్నాయి. శ్రవ్యనాటకం 'నింగి-నేల' చలనచిత్రంలా సాగిపోతుంది.

అన్నట్టు ఆకాశవాణిలో సంక్షిప్త శబ్ద చిత్రాల పేరుతో మంచి మంచి సినిమాలు ఆదివారాలు ప్రసారమయ్యేవి.

ఆదివారాల్లో గంట నాటకాలు నావి చాలా ప్రసారమైనాయి. వాటిమీద 'హిందు'లో సమీక్షలు శ్రీ గుడిపాటి శ్రీహరిగారు రాస్తుండేవారు.

రచయితల మధ్య మంచి నాటకాలు రాసేందుకు బాగా పోటీ ఉండేది. నన్ను బాగా అభిమానించిన ఆకాశవాణి అధికారుల్లో అసిస్టెంటు స్టేషను డైరెక్టరు శ్రీ వై.హనుమంతరావుగారు ముఖ్యులు.

ఆయన సృజనాత్మకంగా కార్యక్రమాలు ప్రసారం చేసేవారు. వ్యవసాయ రంగం ఆయన కార్యక్షేత్రం.

నా చేత ఆయన 'అమ్మఒడి'' అనే గంట నిడివి నాటకం రాయించుకున్నారు. ప్రస్తుతం ఆయన దూరదర్శన్ కార్యక్రమాలకు సహకరిస్తున్నారు.

శ్రీ పి.ఆర్.రెడ్డిగారు కుటుంబ సంక్షేమ అధికారి శ్రీ నాగరాజ్ గారిని, శ్రీ మాడుగుల రామకృష్ణ గారిని మా ఇంటికి పంపి ఒక్క రోజులో శ్రవ్య, ప్రదర్శనలకు పనికొచ్చే నాటకం రాసిమ్మన్నారు.

శ్రీ నాగరాజుగారే ఒక కథ చెప్పారు.

ప్రసిద్ధ రచయిత, నా సోదరతుల్యుడయిన శ్రీ సింగారరాజు రామచంద్రమూర్తి రాసిన బహుమతి కథ 'హనీమూన్' ఇతివృత్తం అది.

దాన్ని అదే పేరు మీద గంట నాటకంగా రాసాను. కొయ్యలగూడెంలో అది ఆకాశవాణి చేత ప్రదర్శించబడింది. 'సెవెన్ స్టార్ థియేటర్' సుబ్బరాజుగారి బృందం నటించారు. స్టూడియోలో రికార్డు చేసాక, ప్రసారం అయింది.

చెప్పుకోదగ్గ నాటకాలలో ఇది ఒకటి.

ఒక్క రాత్రిలో పట్టుదలగా రాసాను. టి.వి.ల ప్రాబల్యంతో ఆకాశవాణి ఆదరణ తగ్గుతున్న సమయంలో, ఆకాశవాణి విజయవాడ కేంద్రానికి డైరెక్టరుగా వచ్చిన శ్రీ మంగళగిరి ఆదిత్యప్రసాద్‌గారు అవిశ్రాంతంగా కృషి చేసి అలనాటి స్వర్ణసమయాన్ని తిరిగి తెచ్చారు.

ఏడాదిపాటు అయిదు జిల్లాల్లో ప్రచార సభలు నిర్వహించి, వాటన్నిటికీ నాతోబాటు ప్రముఖ కళాకారులందర్నీ తీసుకెళ్లారు.

ఈ కృషికి గుర్తింపుగా ఆయనకు 'రేడియో ప్రచార సారథి' పురస్కారం లభించింది. సీనియర్లందరికీ మంచి కార్యక్రమాలనిచ్చారు. ముఖ్యంగా ధారా వాహికలు.

'కార్గిల్ కథలు' పేరిట నేను రాసిన యుద్ధ గాథల్నుంచీ 27 కథల్ని తమ మూడు చానెల్స్‌లో ధారావాహికగా ప్రసారం చేసారు ఆయన.

ఆ కార్యక్రమంలో శ్రీమతి పద్మజానిర్మల (కార్యక్రమ నిర్వహణాధికారి), నేను, శ్రీ ఎమ్.సి.దాస్ పాల్గొన్నాం. నాటక రంగంలో ప్రసిద్ధుడైన శ్రీ ఎమ్.సి.దాస్, ప్రతి కథను నాటకీయంగా చదివి రక్తి కట్టించారు. వాటిని విన్న ప్రేక్షకులు చలించిపోయి ఉత్తరాలు రాసేవారు.

నాటకాల మీదగల మక్కువతో నేను ఆడిషన్‌లో పాల్గొని, బి–హైగ్రేడ్ ఆర్టిస్టుగా ఎంపిక అయ్యాను. ఆ అర్హతతో కొన్ని జాతీయ నాటకాల్లో పాల్గొన్నాను.

## శ్రవ్య నాటకాల్లో సంభాషణలు

ఇంతకుమునుపు చెప్పినట్లు, రచయిత శ్రవ్యనాటక సంభాషణల పట్ల కొంత అవగాహన కలిగి ఉండటం చాలా అవసరం.

ఉదా॥ 'విషయం' సరిగా పలక్కపోతే 'విషం'గా వినిపిస్తుంది. కొన్ని మాటలు రెండర్థాలు, అపార్థాలు, విపరీతార్థాలు కూడ కల్గిస్తాయి. వాటిని రానివ్వకూడదు.

ఒక సుదీర్ఘ సంభాషణను డైలాగ్‌గా రాస్తే నటులు చెప్పటానికి ఇబ్బంది పడతారు. అందువల్ల దానిని విడగొట్టాలి. అయితే, ఏ డైలాగ్‌కా డైలాగ్ అర్థవంతంగా ఉండాలి.

నేను ఆ మధ్య 'జననీ, జన్మభూమి' అనే గంట నిడివి గల నాటకం ఆకాశ వాణికిచ్చాను. అందులో ప్రధాన పాత్రలు రెండే.

శ్రీ ఎమ్.సి.దాసు, రెండుచింతల రామచంద్రరావు ఆ పాత్రలు రక్తి కట్టించారు. "ఇది జాతీయ నాటకం కాగల అన్ని అర్హతలూ కలిగి ఉంద"ని శ్రీ ఎమ్.సి.దాస్ సంచాలకులు శ్రీ మంగళగిరి ఆదిత్యప్రసాద్‌గారికి చెప్పటం విశేషం.

మన పల్లెటూళ్ల రూప చిత్రమది.

రాజకీయాలతో ఆగిపోతున్న ప్రగతి.

అభివృద్ధిని ఆకాంక్షించేవారి ఆరాటం.

ఆ స్ఫూర్తితో విజయం సాధించిన యువకుడు.

వీరితో కథనం సాగుతుంది.

నేను రాసిన మరో శ్రవ్యనాటిక 'బ్లూబెల్స్'. పాపులను క్షమించే చర్చిఫాదర్, తన సోదరిని పలు హింసలు పెట్టి, ఆత్మహత్యకు ప్రేరేపించిన దుర్మార్గుడు వచ్చి తన పాపాలు వెల్లడి చేస్తుంటే, కన్నీటిని ఆపుకోలేకపోయినా, కరుణతో క్షమించిన కథ.

దీన్ని ఆదిత్యప్రసాద్‌గారు ప్రత్యేకంగా అడిగి మరీ రాయించుకున్నారు. కథగా ఇది 'దళితజ్యోతి' మాసపత్రికలో వచ్చింది.

ఇటీవలనే ఆకాశవాణి హైదరాబాదు కేంద్రంవారు నా శ్రవ్యనాటిక 'ఋణం' ప్రసారం చేసారు.

ప్రేమ-పగగా మారి ఆడపిల్లల్ని హింసించాలనే క్రూరత్వాన్ని, ఆ మనస్తత్వాన్ని మార్చుకోవాలనే సందేశం గల నాటిక ఇది. 'బ్లూబెల్స్' నాటిక నిడివి పావుగంట మాత్రమే. దీంట్లో శ్రీ ఎమ్.సి.దాస్, అనంత హృదయరాజ్ ప్రధాన పాత్రలు ధరించారు. కరుణరసాత్మకమైన ఈ నాటిక క్రిస్టియానిటీ మూలసూత్రాన్ని చెబుతుంది.

సంభాషణల పరంగా ఇందులో అవసరమైన రసాలను రంగరించటం జరిగింది.

సంభాషణలు పాత్రోచితంగా ఉండటం చాలా అవసరం. 'అగ్ని' శ్రవ్యనాటక రచయిత శ్రీ రాఘవ నాకు బాగా సన్నిహితుడు. దీని గురించి కొంత చెప్పాలి.

ఆ నాటక సన్నివేశాల గురించి నాతో సుదీర్ఘంగా చర్చించాడు. ముఖ్యంగా రివాల్వరు ఉపయోగం గురించి.

క్లుప్తంగా కథ ఏమిటంటే-

ఒక మిలట్రీ ఆఫీసరు దంపతులకి ఒక్కడే కొడుకు. భర్త చనిపోగా కుమారుడ్ని అల్లారుముద్దుగా పెంచుతుంది. వాడు చెడు అలవాట్లకు బానిస అవుతాడు. సమాజానికి బెడదగా మారతాడు. చివరకు వాడ్ని చంపి సమాజాన్ని రక్షించాలనే కఠోర నిర్ణయానికి ఆ తల్లి రావటం(క్లైమాక్స్) పతాక సన్నివేశం.

"అలా చంపటానికి భర్త రివాల్వర్‌ని ఆమె వాడొచ్చా?" అని రాఘవ సందేహం వెలిబుచ్చాడు.

'లైసెన్సు' భర్తది కాని, ఆమెది కాదు.

ఆ రివాల్వర్‌ని భర్త ఉపయోగిస్తేనే చట్టబద్ధం. ఇంకెవరు ఉపయోగించినా నేరమే అవుతుంది. ఒకవేళ భర్తే కొడుకుని రివాల్వర్‌తో కాల్చి చంపితే అది నేరమౌతుంది. ఆత్మరక్షణకే తప్ప, ఇంకేవిధంగాను లైసెన్సు పొంది ఉన్న ఆయుధాన్ని వాడరాదు. ఈ వివరాలు విని నాటకం రాసాడు. నాటకంలో బాగా సీనియర్లు నటించారు. పతాక సన్నివేశాన్ని రక్తి కట్టించారు.

ఈ నాటకాన్ని ఆకాశవాణి హైదరాబాదు కేంద్రం ప్రసారం చేసింది. ఇలా వేర్వేరు కథాంశాలు, ఇతివృత్తాలు, సంభాషణలు రూపంలో చెప్పబడటమే శ్రవ్యనాటకం.

మరొక సంఘటన-

ఆకాశవాణి విజయవాడ కేంద్రానికి ఒకమాటు యథాలాపంగా వెళ్లాను. కోకా సంజీవరావుగారు ఒక నాటకం రికార్డు చేయడానికి రిహార్సల్సు చేయిస్తున్నాడు. అందులో పేరాలు పేరాలుగా ఉన్న సంభాషణలు చదవలేక నటులు ఇబ్బంది పడుతున్నారు. నేను రావటం చేసిన సంజీవరావుగారుల సంతోషంగా "సమయానికి వచ్చారు గురువుగారూ... ఈ సంభాషణల్ని కాస్త సంస్కరించండి" అంటు ఆ స్క్రిప్టు నాచేతికిచ్చారు.

వేరే రచయిత నాటకంలో మార్పులు చేయటం సభ్యత కాదంటే “ఆయన అలా అనుకునే మనిషికాదులెండి. ఆ సంగతి నేను చూసుకుంటాగా. మీరు త్వరగా మార్పులు చెయ్యండి” అని తొందరపెడితే కాదనలేక, తగు మార్పులు చేసాను. అంతలో అసలు రచయిత వచ్చారు. ఆయన విషయం తెలుసుకుని నాకు ధన్యవాదాలు చెప్పటం సంతోషం కలిగించింది.

నేను చూసినంతవరకు ఒక్క శారదాశ్రీనివాసన్‌గారే ఎంత పెద్ద డైలాగ్‌నైనా అద్భుతంగా, రసస్ఫోరకంగా చెప్పగలరు. నా ‘జననీ, జన్మభూమి’ నాటకాన్ని ఆమె ఫక్కీలో చెప్పించాలని రాయటం జరిగింది.

కానీ, ఆచరణలో కుదరక, డైలాగ్స్ చిన్నవిగా మార్చాను. పద్మజానిర్మలగారి సూచన కూడ అదే. విన్నకోట రామన్నపంతులు గారబ్బాయి, విజయరాం రంగస్థల, రేడియో నాటకాల్లో ప్రసిద్ధుడు. ఏ పాత్ర అయినా సునాయాసంగా నటించేవాడు.

అతను నా నాటకం ఒకదాంట్లో అద్భుతంగా సంభాషణలు పలికించాడు. అతని పలుకుల్లో విరుపు వినసొంపుగా ఉండేది. వ్యంగ్యం ధ్వనించేది.

ఇప్పుడు విజయారం కూడ లేడు!

## నాటకాల్లో ధ్వనిముద్రలు (Sound effects)

శ్రవ్యనాటకాల్లో కొన్ని ధ్వనిముద్రల అవసరం ఉంటుంది. వీటినే Sound effects అంటారు. ఉదా॥ పక్షుల కిలకిలారావాలు, రైలు రాకపోకల ధ్వనులు, కారు, స్కూటరు, విమానం ధ్వనులు– ఇలా రకరకాల ధ్వనుల్ని ఆకాశవాణి లైబ్రరీలో భద్రంగా ఉంచుతారు. అవసరమైన వాటిని తీసుకుని, డబ్బింగ్ సమయంలో కలుపుకుంటారు.

కోకా సంజీవరావుగారు స్వయంగా కొన్ని ధ్వనులు సృష్టించటంలో సిద్ధహస్తులు.

నా నాటకం ‘నరవాసన’కి పావురాలు ఎగురుతున్న శబ్దాన్ని ఆయన పోస్టు

కార్డుల్ని టపటపలాడించటం ద్వారా, తుఫానుని నోటిశబ్దాల ద్వారా సృజించటం నేను స్వయంగా చూసి ఆశ్చర్యపోయాను.

అలాంటి వినూత్న ప్రయోగాలు ఆయన చాలా చేసేవారు. ఆకాశవాణి ఏ-టాప్ గ్రేడ్ ఆర్టిస్టుల్లో ఆయనొకరు. చాలా సౌమ్యుడు. స్నేహశీలి. ప్రజ్ఞామూర్తి. ఇప్పుడు హైద్రాబాదులో ఉన్నారు.

నేను కె.ఎస్.మూర్తి రాష్ట్రస్థాయి నాటకాల పోటీకి జడ్జీగా ఎంపిక అవటానికి ఆయనే కారణం. రెండు సార్లు విజయవంతంగా ఆ బాధ్యతలు నిర్వహించాను. ఆ సమయంలోనే సహ జడ్జీలుగా భానుప్రకాష్‌ని ఒకమాటు, ఎస్.కె.మిశ్రోని రెండోమాటు కలిసాను. మిశ్రోని మా ఇంటకి ఆహ్వానించి ఆతిథ్యం ఇచ్చాను. నాటకాల గురించి ఆయన చాలా విషయాలు చెప్పారు. గతంలో అనేక శ్రవ్య నాటకాల్లో ఆయన పాల్గొన్నారు. ప్రయోక్తగా ఆయన ప్రసిద్ధుడు.

## ధారావాహిక శ్రవ్యనాటకాలు

ఇవి రెండు రకాలు. ఒకటి: అవే పాత్రలతో నడిపించటం. రెండు: ఏ భాగానికాభాగం ప్రత్యేకంగా ఉండటం. మొదటి విధానం రచయితకి సౌకర్యం. రెండోది ప్రొడ్యూసర్లకి సౌకర్యం.

నా 'కామరాజు కాపురం' ధారావాహిక మొదటి రకానికి చెందినది. ఇందులో అవే పాత్రలు ఏడు భాగాల్లోనూ ఉన్నాయి.

వేదవతిగారు తడవకి అయిదు భాగాలు చొ॥న రెండుసార్లు, ఒకే అంశం మహిళల సమస్యలు, నేరనిరోధం, లాంటి అంశాలతో వేర్వేరు కథావస్తువులతో నాటికలు రాయించుకున్నారు. ఇందులో పాత్రలు మారిపోతారు.

శ్రీమతి దుర్గాభాస్కర్‌గారు డైరెక్టరుగా ఉన్నప్పుడు నా గంట నాటకం 'అదుగో ప్రళయం' కోకా సంజీవరావుగారి నిర్వహణలో ప్రసారమైంది. నేను దానికి 'ప్రళయానికి స్వాగతం' అని పేరు పెట్టాను. నాటక విభాగంవారు పేరు మార్చి

'అదుగో ప్రళయం' అని పెట్టారు. దీనికి కోకా సంజీవరావుగారు గట్టిగా అభ్యంతరం చెప్పి "ఆయన సీనియర్ రైటర్. ఆయన అనుమతి లేకుండా పేరు మార్చకూడదు" అని వాదించి, చివరకు పంజాబ్ నేషనల్ బ్యాంకు గవర్నరుపేట శాఖలో పన్చేస్తున్న నా దగ్గరకు, అందులో ముఖ్య పాత్రధారి శ్రీ అర్జా సూర్యప్రకాశ్‌రావుని వెంట తీసుకుని వచ్చారు. విషయం చెప్పి డైరెక్టరు గారికి నా అభ్యంతరాలు చెప్పమన్నారు. నా మీద ఆయనకుగల గౌరవానికి సంతోషించి, మాటలతో శాంతపరిచాను.

"పేరుదేముంది. మీలాంటి అనుభవజ్ఞులు దానిని ప్రొడ్యూస్ చేయటంకంటే ఏం కావాలి" అన్నాను. ఆ నాటకం చాలా బాగా వచ్చింది. ఆ హాస్య ప్రధాన నాటకం కథేమిటంటే–

"ఫలానా తేదీకి కచ్చితంగా వచ్చేస్తుందిట" అనే ప్రచారాన్ని నమ్మి, ఓ అప్పుల అప్పారావు ఎడా పెడా అప్పులు చేసేస్తాడు. ఎలాగూ ప్రళయం వచ్చేస్తుంది. అప్పులు చెల్లించాల్సిన అవసరం ఉండదని అతని భరోసా.

అనుకున్న రోజుకి ప్రళయం రాదుగానీ, భూకంపం వచ్చి అందర్నీ హడల గొడుతుంది. ఆ తర్వాత, కథంతా అప్పుల్రావు అవస్థలతో నడుస్తుంది. ఆకాశవాణిలో ధారావాహిక సీరియల్స్‌గా ప్రసిద్ధ నవలల్ని ప్రసారం చేసారు. హైదరాబాద్ కేంద్రంవారు శ్రీమతి శారదాశ్రీనివాసన్‌గారు పాల్గొనగా కాలాతీతవ్యక్తులు, రంగనాయకమ్మ 'బలిపీఠం' ద్వివేదుల విశాలాక్షిగారి 'మారిన విలువలు' ముఖ్యంగా పేర్కొనదగిన నాటకాలను ప్రసారం చేసారు.

చిరంజీవి (ఆకాశవాణి) గారి ఆధ్వర్యంలో 'సొనార్ బంగ్లా' పురూరవ నాటకాలు ప్రసారమైనాయి.

1959-60 సంవత్సరంలో స్వర్గీయ ప్రధాని శ్రీ పి.వి. నర్సింహారావుగారి మరాఠీ అనువాదం 'ఎవరు లక్ష్యపెడతారు' నాటకం, నండూరి విఠల్‌గారి 'ప్రతిమ' నాటకాలు ప్రసారమైనాయి.

రేడియో అక్కయ్య కామేశ్వరిగారు ఎంతో సౌజన్యంతో వ్యవహరించి, స్త్రీల కార్యక్రమంలో కూడ చక్కని నాటక ప్రసారాలకు కారణమయ్యారు.

నండూరి విఠల్ అనగానే ఆయన 'మనిషి' ధారావాహిక నవల గుర్తొస్తుంది. బుచ్చిబాబులాగా అదొక్కటే నవల రాసారు. ఆంధ్రప్రభ వారపత్రికలో సీరియల్‌గా వచ్చింది. అదే కాలంలో నా కథలు విరివిగా ఆంధ్రప్రభలో వస్తుండేవి. ఆ విధంగా మాది మొదట పరోక్ష పరిచయం. దూరదర్శన్‌కి తొలి తెలుగు డైరెక్టరుగా వచ్చినప్పుడు స్వయంగా వెళ్లి కలిసాను. 'చుట్టాలొస్తున్నారు జాగ్రత్త' నా తొలి టి.వి. నాటకం, గోవిందచౌదరి నిర్వహణలో, ఆయన చొరవతో ప్రసారమైంది. అప్పుడు సోమాజి గూడలో ఒక గుట్టమీద దూర్శన్‌కేంద్రం ఉండేది. 1977-78 నాటి సంగతిది.

సుదీర్ఘ ధారావాహికగా కొన్ని నెలలపాటు సాగిన నాటకం 'సీతాపతి సంసారం'. డాక్టర్ కొమ్మూరి వేణుగోపాల్రావ్‌గారు ఆ రచనలో సింహభాగం రాసారు. అది డైలీ సీరియల్ కావటం మరో విశేషం. అదే మొదటి డైలీ సీరియల్ అనుకుంటాను. ఆ తర్వాత కూడా అలాంటి సీరియల్స్ రాలేదు. ఇప్పుడు ప్రాయోజిత ధారావాహికలు ప్రసారమవు తున్నాయి. మళ్లీ మంచి కథావస్తువులతో ధారావాహికలు వస్తాయని ఆశిద్దాము.

ఉత్సాహవంతులైన అధికార్లు ఇప్పుడు ప్రసార రంగంలో ఉన్నారు. కాబట్టి, భవిష్యత్‌లో ధారావాహిక శ్రవ్యనాటకాలకు బాగా అవకాశం ఉంది.

# మూడవ అధ్యాయము

**హిమగిరి శిఖరమ్మువోలె ఎత్తైన యశస్సువాడు**
**పారిజాత పుష్పమువలె పరిమళించు మనసువాడు**
**గాంగతరంగమ్మువోలె కలుషత కరగించువాడు**
**తెలుగువాడు విశ్వమెల్ల తేజముతో వెలుగువాడు!**

**- డా॥ ప్రసదరాయ కులపతి**

ఆకాశవాణి విజయవాడ కేంద్రం తెలుగువారి ఖ్యాతిని అంతర్జాతీయంగా ప్రసిద్ధం చేసింది.

1973 ఎన్‌హెచ్‌కె జపాన్ ప్రైజుతో ప్రారంభమయిన బహుమతుల పంట నలభైకి మించిపోయాయి. వీటిలో అన్ని ప్రక్రియలూ ఉన్నాయి.

1984లో ప్రి ఇటాలియా అంతర్జాతీయ పోటీల్లో 'లయ' అనే రూపకం ప్రశంసా పత్రం పొందింది. వీటిలో అధికంగా సంగీత రూపకాలున్నా ఎస్. బి. శ్రీరామమూర్తి, పాండురంగలు ప్రొడ్యూస్ చేసిన 'స్మృతి' అనే శ్రవ్యనాటకం ఉండటం హర్షదాయకం. 'ఈ చీకటి కవతల', మహా విశ్వనాటకం, గాలివాన, అమ్మా నన్ను చంపకు(1993), రైలు ప్రయాణం, వంటి శ్రవ్యనాటకాలు జాతీయస్థాయి పోటీల్లో దృఢంగా నిలిచాయి.

## శ్రవ్యనాటకాలకు ముందుగా రిహార్సల్సు

రంగస్థల నాటకాలకే కాదు. శ్రవ్యనాటకాలకు కూడ, ఆయా నాటకాల నిడివిని బట్టి మూడు రోజులకు మించకుండా రిహార్సల్సు ఉంటాయి.

మొదటి రోజుల్లో రికార్డింగు చేసి, ప్రసారం చెయ్యటం ఉండేది కాదు. ప్రత్యక్ష ప్రసారం జరిగేది. అందువల్ల నటులు క్షుణ్ణంగా రిహార్సల్సు చేసి, ఎక్కడా ఎలాంటి పొరబాటు జరగకుండా జాగ్రత్త పడేవారు.

మిగతా కార్యక్రమాలూ అలాగే జరిగేవి.

ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు కార్యక్రమ అధికారిగా పని చేసిన కాలంలో సంస్కృత నాటకాలను, చక్కగా సంస్కరించి ప్రసారం చేసేవారు.

భావరాజు వేంకటకృష్ణారావుగారి 'లవంగి' వాటిలో ఒకటి. కాటూరి వేంకటేశ్వరరావుగారు సాహిత్య కార్యక్రమాల్లో పాల్గొనేవారు. అలాగే విశ్వనాథ, కరుణశ్రీ వంటి మహామహులు కూడా.

డా॥ మిక్కిలినేని రాధాకృష్ణమూర్తిగారు, డాక్టర్ తుర్లపాటి కుటుంబరావుగారు ప్రసంగాలను చేసేవారు. మిక్కిలినేని పలు నాటకాల్లో నటించారు.

అలాగే నేటి మేటి సినీ నటులలో ఎక్కువ మంది రేడియో నాటకాల ద్వారా ప్రసిద్ధులైనవారే.

వారిలో డి.వి.నరసరాజుగారు, వి.మధుసూదనరావుగారు, రామచంద్రకాశ్యప, అట్లూరి రామారావు, పుండరీకాక్షయ్య, విన్నకోట రామన్న పంతులు, నిర్మల, పువ్వుల హేమలత, పుష్పకుమారి, గిడుతూరి సూర్యం, మురళీమోహన్, జంధ్యాల వీరంతా ఆకాశవాణితో నాటకానుబంధం ఉన్నవాళ్లే.

'ధూళిపాళ' కూడ ఆకాశవాణిలో పలు నాటకాల్లో పాల్గొన్నారు. చివరి రోజుల్లో ఆయన ఇంటర్వ్యూ ప్రసారమయింది.

విశ్వనాథవారి 'వేయి పడగలు' నాటకాన్ని ఆయనే స్వయంగా నిర్వహించటం విశేషం.

కాటూరి వేంకటేశ్వరరావు గారి 'మువ్వగోపాల', 'సౌందరనందం', బుచ్చిబాబుగారి 'ఆద్యంతాలు-మధ్య రాధ', 'చివరకు మిగిలేది' మరువలేని నాటకాలు.

కాటూరి వారి 'మువ్వగోపాల' నాటకంలో ముఖ్య పాత్ర 'వరదయ్య'గా మిక్కిలినేని, ఎగ్గెన్నగా శ్రీ నండూరి, మోహనాంగి పాత్రలో పువ్వుల హేమలత నటించారు. నేపథ్యగానాన్ని ప్రఖ్యాత సంగీత విద్వాంసులు శ్రీపాద పినాకపాణిగారు, బృందం ఆలపించారు. ఈ నాటకం 'కలికితురాయి'గా విజయవాడ కేంద్ర నాటక చరిత్రలో నిలిచిపోయింది.

బందా కనకలింగేశ్వరరావుగారి హయాంలోనే పౌరాణిక శ్రవ్యనాటకాలు గయోపాఖ్యానం, కృష్ణరాయబారం, వీరాభిమన్యు వంటివి, చారిత్రక నాటకాలు సిరాజుద్దౌలా, సాంఘిక సంస్కరణలకు సంబంధించిన కన్యాశుల్కం, వరవిక్రయం, కంఠాభరణం, గణపతి, సక్కుబాయి, నాటికి నేడు, పూటకూళ్లు మొదలగు నాటకాలు రూపొందించబడి పలుమార్లు ప్రసారమైనాయి.

బందా వారి కాలంలోనే సి.రామ్మోహనరావు, నండూరి సుబ్బారావు, యం.నాగరత్నమ్మ, వి.బి.కనకదుర్గ, యం.జి.శ్యామలగార్లు శ్రవ్యనాటక నిష్ణాతులయ్యారు. వీటిని 'డ్రామా వాయిస్'లుగా వ్యవహరిస్తారు.

మరొక విశేషం ఏమిటంటే 'హెూనాజిబాల', గోపన్న, సక్కుబాయి వంటి నాటకాల్లో డా॥ మంగళంపల్లి బాలమురళీకృష్ణ, శ్రీరంగం గోపాలరత్నం గార్లు పాల్గొనేవారు.

బందా వారికి ముందు నండూరి విఠల్‌గారు మంచి నాటకాలను ప్రసారం చేసారు.

విజయవాడ నాటక శాఖకు కీర్తి తెచ్చినవారిలో నటీనటులుగా సి.హెచ్. వాణీబాల, ఆలపాటి లక్ష్మి, ఒంగోలు ఇందిర, వై.రాజకుమారి, మద్దాలి సుశీల, అర్జా సూర్యప్రకాశరావు, రామరాజు, సి.హెచ్. కబీరుదాసు, యస్.కబీరు దాసు, విన్నకోట విజయరాం ముఖ్యులు.

నిలయ కళాకారులయిన శ్రీ ఎ.బి.ఆనంద్, కోకా సంజీవరావు, యం.వాసుదేవ

మూర్తి, పేరి కామేశ్వరరావు, ఎం.వీరభద్రరావు, పి.పాండురంగ, మాదుగుల రామకృష్ణ, ఎ.లింగరాజు శర్మ, కృష్ణకుమారి, పద్మజానిర్మల వంటి వారు నాటక విభాగానికి పరిపుష్టిని చేకూర్చారు.

శ్రీ ఎస్.బి.శ్రీరామమూర్తి అనేక అవార్డులు ఆకాశవాణి విజయవాడ కేంద్రానికి సమకూర్చిపెట్టారు. అలాగే కలగా కృష్ణమోహన్, అద్భుతమైన కార్యక్రమాలు రూపొందించి ఆకాశవాణి విజయవాడ కేంద్రానికి ఖ్యాతి చేకూర్చారు.

## నాటకాలకు కథావస్తువులు

శ్రవ్యనాటకాలలో కథావస్తువు బలంగా ఉండాలి. నటీనటులు చక్కని వాచకంతోనే సంభాషణలు రక్తి కట్టించాల్సి ఉంటుంది. సంభాషణలతోనే కథ ముందుకు వెళ్తుంది.

కథ పౌరాణికమయినా, చారిత్రకమైనా సాంఘికమైనా నిర్దిష్టంగా ఉండాలి. పరిమిత వ్యవధిలో ఒదిగిపోవాలి. స్పష్టత ఉండాలి.

శ్రోతలు కథను సులభంగా అర్థం చేసుకోగలగాలి.

తక్కువ పాత్రలు ఉండటం మంచిది.

సాధ్యమైనంతవరకు సంభాషణలు ప్రతి పాత్రధారుని ప్రావీణ్యానికి అవకాశం కల్పించేలా ఉండాలి.

ఎక్కువ పాత్రలు ఉన్నప్పుడు శ్రోతలు కథను అనుసరించలేరు. పాత్రల మధ్య సంబంధాలు కూడా గుర్తుండవు.

నండూరివారు అనేవారు.

"శ్రవ్యనాటక ప్రారంభంలోనే పాత్రల పరిచయం, పాత్రల మధ్య సంబంధం శ్రోతలకు అర్థం కావాలి..." అని.

ఈ సలహాని నేను మర్చిపోలేదు.

సంభాషణల ద్వారానే పాత్రల గురించిన అవగాహన కల్పిస్తుంటాను. పరస్పర సంబంధాలు కూడా.

ఎక్కువ పాత్రలను కూడా పెట్టను.

నేను కేవలం రెండు మూడు పాత్రలతో రాసిన నాటకాలూ ఉన్నాయి. అలాంటప్పుడు నటులు తమ ప్రావీణ్యాన్ని చూపగల అవకాశం మెండుగా ఉంటుంది.

శ్రవ్యనాటకాలలో భావప్రకటన అంతా గొంతులోనే చూపించగలగాలి. అందుకు అనువయిన విధంగా శ్రవ్య నాటకం రచించాలి.

ఇతివృత్తాల విషయం గురించి, ఈ గ్రంథ ప్రారంభంలోనే కొన్ని నాటకాల ప్రస్తావన ద్వారా తెలియపరచటం జరిగింది.

కథావస్తువు గొప్పది కావొచ్చు.

కానీ, దాన్ని గొప్పగా మలిచినప్పుడే అది మంచి శ్రవ్యనాటకమౌతుంది.

శ్రవ్యనాటకంలో అన్నీ బావుండి కథావస్తువు మంచిది లేకపోతే, పేలవంగా ఉంటుంది.

**"సంగీతం తెలిస్తే చాలదు-గొంతు బావుండాలి.**

**గొంతు బావుంటే చాలదు-సంగీతం తెలియాలి"**

శ్రవ్యనాటకమూ అంతే.

అన్నీ సమపాళ్లలో సమకూరాలి.

రచన గొప్పగా ఉంటే చాలదు. నటీనటులు బాగా నటించాలి. అప్పుడే శ్రోతలు ఆనందిస్తారు.

రచయిత రసానుభూతి చెందుతూ సంభాషణలను రాయాలి. మనసులో

ఇతివృత్తాన్ని గుర్తుపెట్టుకోవాలి. సమయ పరిమితిని గమనిస్తుండాలి.

ఇవన్నీ దృష్టిలో ఉంచుకుంటు రాసినప్పుడు ఒక మంచి శ్రవ్యనాటకం తయారవుతుంది.

నాటకం రాసాక. దాన్ని జాగ్రత్తగా చదువుతు ఇతివృత్తం సరిగా అమరిందో లేదో చూసుకోవాలి.

నటీనటుల ద్వారా గాత్రాభినయం చేయబడి, ప్రసారమవుతున్నట్లుగా భావన చేస్తు, నాటకాన్ని బేరీజు వేసుకోవాలి.

కొన్ని సంభాషణలను మనం పైకి చదవాలి.

పలుకుబడి బాగా లేకపోతే మార్చుకోవాలి.

ఇతివృత్తాలు సందేశాత్మకంగా ఉంటే శ్రవ్య నాటకాలకు బావుంటాయి.

అయితే, ఏ సందేశమూ నేరుగా ఉండకూడదు.

పరోక్షంగా ఉండాలి.

స్ఫురించేలా ఉంటే ఇంకా మంచిది.

అలాగే, ఇతివృత్తాలను ఎంపిక చేసుకోవటంలో ప్రజ్ఞ చూపాలి.

సమకాలీన సమస్యలు–

సాంఘిక దురాచారాలు–

మానవ సంబంధాలు–

నైతిక విలువలు–

ఆత్మీయతలు, అనుబంధాలు–

తల్లిదండ్రుల పట్ల బాధ్యతలు–

భార్యాభర్తల మధ్య అవగాహన-

నేరస్థుల పరివర్తన-

ఆధ్యాత్మిక, అవగాహన-

ప్రసిద్ధ పౌరాణికాల నుండి సందేశాత్మక సంఘటన-

జాతీయతా భావాలను ప్రోత్సహించే కథ-

ఏదైనా చారిత్రక గాథ-

ఇలా మనకు నచ్చిన కథాంశాన్ని ఎంపిక చేసుకోవాలి.

దాన్ని క్లుప్తీకరించి రాసుకోవాలి.

అంకాలవారీగా విభజించుకోవాలి.

ఇది మొదటి దశ.

దీన్ని తర్వాత దశలకు తీసుకువెళ్లటంలో నైపుణ్యం చూపాలి.

శ్రవ్యనాటక రచన చేస్తున్నప్పుడు మన మనసు ఇతివృత్తం మీద, పాత్రల చిత్రీకరణ మీద పూర్తిగా లగ్నమై ఉండాలి.

అప్పుడే నాటక శిల్పం దోషరహితంగా రూపొందుతుంది.

నేను పౌరాణిక, చారిత్రక, ఆధ్యాత్మిక, సాంఘిక ఇతివృత్తాలన్నిటితో శ్రవ్య నాటకాలు రాసాను.

## రేడియో నాటకీకరణ

దీన్నే 'రేడియో అనుసరణ' అని కూడ అంటారు. ప్రసిద్ధమైన కథల్ని, నవలల్ని ఆకాశవాణి శ్రవ్యనాటకాలుగా ప్రసారం చేయటం బందావారి కాలంలోనే ప్రారంభించారు.

ఆ క్రమంలోనే, ఆకాశవాణి నిలయ విద్వాంసులచేత, అనుభవజ్ఞులచేత నాటకీకరణలు చేయిస్తుండేవారు. మహీధర రామ్మోహనరావుగారి 'కొల్లాయి గడితేనేమి' చాలా ప్రసిద్ధ నవల. టి.వి. సీరియల్‌గా కూడా ప్రసారమైంది. దాన్ని రేడియోలో నాటకంగా ప్రసారం చేయాలని శ్రీ పాండురంగ సంకల్పించారు. ఆ ఆ నవల నాటకీకరణ నన్ను చేయాల్సిందిగా పాండురంగ కోరారు.

మొదట అంత సుముఖంగా లేకపోయినా, మహీధర పట్ల నాకున్న గౌరవం, మా మధ్య ఆత్మీయతల దృష్ట్యా ఒప్పుకున్నాను. నేను రాయబోతున్నానని తెలిసి మహీధర చాలా సంతోషించారు.

స్వయంగా మా ఇంటికి వచ్చి నవల గురించి నాతో చాలాసేపు చర్చించారు. నాలుగు వందల పేజీల పెద్ద నవలను గంట నాటకంగా మార్చాలి.

అంటే నూరు పేజీలను పావుగంట కాల వ్యవధికి కుదించాలి. ఇతివృత్తం చెదరకూడదు. ఏ పాత్రనూ విస్మరించకూడదు. శ్రోతలకు కథ అర్థం కావాలి.

పాత్రలకు నటించే సౌలభ్యం ఉండాలి.

ఆయన చెప్పిన కొన్ని సూచనలు రాసుకున్నాను.

త్వరగానే రచన ముగించాను.

పాండురంగకి నచ్చింది.

మహీధరగారు కూడా 'స్క్రిప్టు' చదివేరు.

"ఇంత బాగా రాస్తారని తెలిస్తే, నా టి.వి. సీరియల్ మీ చేతనే రాయించేవాడిని" అన్నారు ఆనందంగా నవ్వుతూ.

ఆ నాటకానికి పాండురంగ ప్రయోక్త.

అద్భుతంగా తయారయింది.

అందరి ప్రశంసలూ పొందింది.

అటుతర్వాత, కొన్ని రేడియో అనుసరణలు చేసాను. నేరుగా రచన చేయటం కన్న 'రేడియో అనుసరణ' కష్టమని చెప్పవచ్చు.

కారణం ఏమిటంటే ఆ రచనని ఒకటికి రెండు సార్లు క్షుణ్ణంగా చదవాలి. మూలకథని అర్థం చేసుకోవాలి. రచయిత అంతరంగాన్ని అవగాహన చేసుకుంటూ, ఎక్కడా, ఏ విషయాన్నీ విస్మరించకుండా చెప్పాలి.

నాటకం సాఫీగా వెళ్లిపోవాలి.

అతుకులుండకూడదు.

సాధ్యమైనంతవరకు మూల రచయిత రాసిన సంభాషణలు ఉపయోగించుకోవాలి.

దీనివల్ల మూల రచయిత సంతోషించడంతో బాటు, రచన తన ఆకృతిని, లక్షణాలను నిలుపుకోగలుగుతుంది. శ్రోతలు కూడా ఆనందిస్తారు.

నాటక లక్షణాలు శ్రవ్యనాటకానికీ వర్తిస్తాయి.

ఎత్తుగడ లేక ఆరంభం.

క్రమంగా నాటకంలోకి శ్రోతల్ని మన వెంట తీసుకువెళ్లటం, చక్కని ముగింపు.

ఇవి శ్రవ్యనాటకానికి చాలా ముఖ్యం.

రేడియో నాటకీకరణకి పూనుకునే ముందు, గతంలో నాటకీకరించబడిన రచనలు చదవటం మంచిది.

మూలరచనతో పోల్చి చదవటం ఇంకా మంచిది.

## అనుకరణలు-అనుసరణలు

ప్రపంచ సాహిత్యంలో చాలా గొప్ప రచనలు మనకు కనిపిస్తాయి. భాష వేరయినా వాటిలోని భావం మనల్ని కదిలిస్తుంది.

భవభూతి అన్నట్టు–

"ఏకోరసః కరుణ ఏవ నిమిత్తభేదాత్"

కరుణ ఒక్కటే రసం. తక్కినవన్నీ నిమిత్త భేదాలనుబట్టి రాణిస్తాయి.

మూల పదార్థం కరుణ అయినప్పుడే అది శ్రోతను కాని, పాఠకుడ్ని కాని కదిలించగలుగుతుంది.

శరత్‌చంద్ర కథకుడిగా విశ్వవిఖ్యాతి చెందటానికి అతని రచనల్లోని కరుణరసమే కారణం.

ఆర్ద్రతా భావం కరుణరసం నుండే ఉత్పన్నమౌతుంది. ఇతర భాషల రచనలను తెలుగులోకి అనువదించటం ఒక పద్ధతి అయితే, స్వేచ్ఛానువాదం పేరు మీద కాస్త తమకి వీలయిన విధానంలో రాయటం ఇంకో పద్ధతి. ఇందులో మక్కికి మక్కి ఉండదు. మూలకథ ఉంటుంది. దాదాపు ఎనభై శాతం మూలరచనకి సమాంతరంగానే నడుస్తుంది. మిగిలినది సౌలభ్యం కోసం చేసుకునే మార్పులు. ఇదీ స్వేచ్ఛ అంటే. రచయిత ఎంత స్వేచ్ఛను తీసుకోవాల్సింది తనే నిర్ణయించుకోవాలి.

యాసలు, ప్రాంతీయ పలుకుబళ్లు భాషను బట్టి మారుతాయి. మాండలీకాలూ అంతే.

వీటిని యథాతథంగా అనువదించటం కుదరదు.

అప్పుడు స్వేచ్ఛ అవసరం కలుగుతుంది.

అనువాదాల వల్ల ఆయా సంస్కృతుల విశేషాలు మనం తెలుసుకునే వీలు కలుగుతుంది.

అనుసరణ, అనుకరణలు ఇతివృత్తం (theme), కథల్లోని మూల అంశాలు తెలుసుకునే వీలుంటుంది.

నాటకాల్లో అన్నీ ప్రదర్శనయోగ్యంగా ఉండవు. వాటిని ప్రదర్శన యోగ్యంగా మార్చుకోవడంలోనే దర్శకుడి ప్రతిభ ఉంటుంది. రచయిత, ప్రతిభావంతుడైన దర్శకుడు కూడా అయితే అది మరింత ఉపయోగం. కానీ ఇది సర్వజనీనం కాదు. బహుకొద్ది మందికే ఆ ప్రజ్ఞ ఉంటుంది.

రేడియో నాటకాల్లో ఒక సౌలభ్యం ఉంది.

మన ఊహల్ని సంభాషణల ద్వారా ఆవిష్కరించవచ్చు. అవి అసాధ్యమా, సుసాధ్యమా అన్న ప్రశ్న లేదు.

"అమ్మా! నన్ను చంపకు" అనే నాటకంలో గర్భస్థ ఆడశిశువు సంభాషణలుంటాయి. దానికి జాతీయ బహుమతి వచ్చింది. కేవలం శ్రవ్యనాటకాలకే ఈ అవకాశం ఉంటుంది. సైన్సు, ఫిక్షన్. యుద్ధ వాతావరణం- ఇలాంటివి ఏవైనా, ఎలాంటి అభూత కల్పననైనా మనం శ్రవ్యనాటకాల్లో రూపకల్పన చేయవచ్చును.

శ్రవ్యనాటకం కళ్లు మూసుకుని చూసే నాటకం!

మేధావి 'కోల్‌రిడ్జ్' అన్నట్టు-

"The eyes make pictures when they are shut" మన మనసులకి దృశ్యాలను తోపింపచేయగల శక్తి శ్రవ్య నాటకాలకు ఉంది.

శ్రోత తనకు వినిపించే ప్రతి చిన్న శబ్దానికీ రూపకల్పన చేసుకుంటాడు.

ఇది మనో నేత్రంతో దర్శించే దృశ్యకావ్యం.

నటుడు ఎలా వినిపిస్తున్నాడనేదే శ్రవ్య నాటకంలో ప్రధానం. ఈ విషయాన్ని ప్రతి నటుడూ గుర్తుంచుకోవాలి.

'Voice is an Orchestra-provided we know how to use it.

రచయితగా నేను ఇంతవరకు అనుకరణలు, అనుసరణల జోలికి పోలేదు. అనువాదాలు కొన్ని చేసాను. అవి కూడ యథాతథ అనువాదాలు కాబట్టి, మూల రచనకి న్యాయం చేసినట్లు చెప్పుకోవచ్చు.

అనుకరణ శ్రవ్య నాటికగా పురాణం శర్మగారి 'సైకిల్ అప్పారావు' గురించి చెప్పాలి.

ఒక మాటు దీని గురించి శంకరమంచి సత్యం చాలా విశ్లేషణాత్మకంగా నాకు చెప్పారు. దానికి గల మూలరచన అంతర్జాతీయ బహుమతి సాధించింది.

ఇతివృత్తం ఏమిటంటే–

దేశాల మధ్య క్రీడాకారుల పోటీ జరుగుతుంటుంది. పరుగు పందెంలో పాల్గొన్న తమ దేశం వ్యక్తి గెలవాలి. అందుకు వాడ్ని ప్రోత్సహిస్తూ "నీ భార్య కోసం పరుగెత్తు. నీ పిల్లల కోసం పరుగెత్తు..." అంటుంటారు. వాడు వేగం పెంచినా, ముందు వాడిని దాటలేకపోతుంటాడు.

చివరకు "నీ దేశం కోసం పరుగెత్తు" అనగానే వాడిలో కొత్త శక్తి విజృంభిస్తుంది. అందర్నీ దాటి ముందుకు వెళ్లి గెలుపు సాధిస్తాడు.

ఇందులో కేవలం శబ్దాలతో, సంభాషణలతో దృశ్యాన్ని మనస్సులో ఆవిష్కరింపజేయటం ప్రధానాంశం. దీనిని శంకరమంచి పురాణం శర్మగారికి చెప్పి 'సైకిల్ అప్పారావు' నాటకంగా అనుకరణగా రాయించి, ప్రసారం చేసారు.

ఇలాంటివి ఎక్కువ రాలేదు.

# నాలుగవ అధ్యాయము

**శ్లో॥ వసంత కాలేషు వనాంతరేషు**
**కూజంతి శ్రావ్యం విహగాః పరంతు**
**గ్రీష్మేచ కూజంతి వినూత్న శైల్యాం**
**ఆకాశ వాణ్యాం రమణీయ గాత్రైః**

**- సాపర్ణి విజయ భూషణశర్మ**

ఆకాశవాణి అందరి హృదయవాణిగా, ఇంటింటి వాణిగా తెలుగువారి ఇళ్లలో ఆత్మీయ బంధువులాగా మసలిన రోజులు ఒక స్వర్ణయుగం. ట్రాన్సిస్టర్లు మనిషితో బాటు తిరుగుతు పొలాల్లో కూడా పసందయిన కార్యక్రమాన్ని వీనులవిందుగా వినిపించేవి.

ఇంతకు మునుపు చెప్పుకుంటున్నట్లుగా ఆకాశవాణి ప్రసారం చేసిన వివిధ కార్యక్రమాల్లో నాటకాలు ప్రత్యేక స్థానం పొందాయి.

ఆదివారం అనగానే గంట నాటకం వింటానికి అందరూ సిద్ధమైపోయేవారు. ప్రసార విశేషాల్లోనే నాటకం వివరాలు చెప్పేవారు.

ఒక్కోమాటు మధ్య మధ్య నాటకంలోని కొన్ని సంభాషణలు విన్పిస్తు, ప్రకటనలు చేస్తుండేవారు. ఆ విధంగా శ్రవ్య నాటక ప్రసారాల గురించి, శ్రోతలను ఊరించేవాళ్లు. స్థానిక పేపర్లలో కూడా రేడియో కార్యక్రమ వివరాలు ప్రచురిస్తుండేవారు.

నాటకం పేరు, రచయిత పేరు, నిర్వహణ చేసేవారి పేరుతో సహా ప్రచురించేవారు. అప్పట్లో 'వాణి' అనే ఆకాశవాణి పత్రిక శ్రోతలకి చాలా సమాచారాన్నిస్తుండేది.

ప్రసారమైన కొన్ని రచనలు ప్రచురించేవారు.

అందులో నా రచనలు కొన్ని అచ్చయ్యాయి.

## శ్రవ్య సంగీత నాటకాలు

రచయిత కవి కూడ అయి ఉండి, సంగీత జ్ఞానం ఉంటే శ్రవ్య నాటకాలు రాయటం వీలవుతుంది.

అలా రాయగలవారు బహు కొద్దిమందే ఉన్నారు.

వారిలో ఆద్యులుగా చెప్పదగిన మహనీయుడు శ్రీబాలాంత్రపు రజనీకాంతరావు గారు. వీరి చలవ వల్లనే తను సంగీత రంగంలో రాణించగలిగాననీ, తొలి రోజుల్లో తనకి అవకాశాలు ఇచ్చింది ఆయనేనని పద్మశ్రీ ఘంటసాల వేంకటేశ్వర రావుగారు ఆకాశవాణి విజయవాడ కేంద్రానికిచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు.

ఆత్మీయులు 'రజని' గారని పిలుచుకునే శ్రీ బాలాంత్రపు రజనికాంతరావు గారు నిగర్వి. సౌజన్యశీలి. అందరితో కలిసిపోయేవారు.

ఆకాశవాణి విజయవాడ కేంద్రం డైరెక్టరుగా ఆయన ఎందరో రచయితలకు, కళాకారులకు అవకాశాలిచ్చి ప్రోత్సహించారు.

వయోవృద్ధులయినా, ఆయన జ్ఞాపకశక్తి తగ్గలేదు. ఇప్పుడు విజయవాడలోనే ఉంటున్నారు.

డైరెక్టరు కులకర్ణిగారు నా చేత రాయించిన చారిత్రక నాటకం అక్కమహాదేవి ఒక విధంగా సంగీత శ్రవ్య నాటకం. అందులో ఎనిమిది పాటలు రాసాను.

వాటి రికార్డింగు జరగబోతున్న సమయంలో శ్రీ రజనిగారు స్టూడియోలోకి వచ్చారు. ఆ రోజున వారి సంగీత రూపకం రికార్డింగు ఉంది. ముందు వారి రికార్డింగు చేద్దామని కులకర్ణిగారు అన్నారు.

నేను 'అలానే'నని ఓ పక్కన కూచున్నాను.

రజని గారితో నాకు చిరకాల ఆత్మీయానుబంధం ఉంది.

బాలాంత్రపు వేంకటరావు గారి పుత్రునిగా వారిది కవి పండిత వంశం. రజని గారికి కాటూరి వేంకటేశ్వరరావు గారి మీద ఎంతో గౌరవం, అభిమానం.

'కాటూరి' అనగానే ఆయనకు కవి కాటూరి గుర్తుకు వస్తారేమో, కనిపిస్తే వదిలేవారు కారు. కరచాలనం చేసి, అలా ఎంతసేపయినా మాట్లాడుతుండేవారు.

రజని గారి సంగీత రూపకం తర్వాత నా పాటలు రికార్డు అనటం విన్న ఆయన, "లేదు లేదు. ముందు కాటూరి వారి పాటలు రికార్డు చెయ్యండి" అన్నారు.

నేను ఆత్మీయంగా ఆయనకు నచ్చచెప్పి, వారి రికార్డింగే ముందు జరిగేలా ఒప్పించాను.

అంతటి సౌజన్యమూర్తి ఆయన.

శ్రవ్య సంగీత నాటకాలు ఆకాశవాణి చాలా ప్రసారం చేసింది.

అవి శ్రోతల్ని మరో లోకంలోకి తీసుకువెళ్తాయి.

మంత్రముగ్ధుల్ని చేసి కూచోబెడతాయి.

'కొండ నుంచి కడలిదాకా' అనే సంగీత రూపకం ద్వారా 1973లో జపాన్ ఎన్.హెచ్.కె. బహుమతి ఆర్జించిన ఘనత రజని గారిదే.

ఆ తర్వాత కె.వి. హనుమంతరావు (ఆకాశవాణి జానపద సంగీత విభాగ అధికారి), కలగ కృష్ణమోహన్, ఎస్.బి.శ్రీరామమూర్తిలు సంగీత రూపకాలు రూపొందించి, బహుమతులు సంపాదించారు.

గతంలో సంగీత నాటకాలు ప్రదర్శన కోసం నేను రాసాను.

ఆకాశవాణికి రాసే అవకాశం లభించలేదు.

1940-42 ప్రాంతాల్లో రేడియోలో బెంగాలీ సంగీతం ఆధారంగా తెలుగు నాటకాలు వచ్చాయి. ఉదా: గ్రీష్మం గురించి(మందారి రాగంలో)

**"నడిమింట చూడ**

**రవి మండు టెండకాచె**

**వడగాలులు సుడి తిరిగి**

**హోరుమని వీచె"** అంటు గ్రీష్మ ప్రారంభాన్ని చెబుతుంది. ఇక్కడొక విషయం చెప్పాలి.

నేను దూరదర్శన్ కేంద్రం విజయవాడ డైరెక్టరు శ్రీ పళనిస్వామి గారి సూచనలతో 'గ్రీష్మం' అనే డాక్యుమెంటరీ నిర్మించాను. అది జాతీయ స్థాయికి వెళ్లింది. గ్రీష్మం ఒక మంచి భూమిక.

రజని గారు సంగీత నాటకాల మీద అథారిటీ అని చెప్పవచ్చు. ఆయనకు శ్రవ్య సంగీత నాటకాల గురించి ఎంతో పరిజ్ఞానం ఉంది. ఎన్నో విశేషాలు ఆయన చెప్పేవారు. అవి: సంగీత రూపకం రాయడానికి రచయితకి తగిన పరిజ్ఞానం ఉండాలి. మాటకి ఎన్ని రకాల పర్యాయాలు వాడవచ్చు. గేయాలు ఎన్ని రకాలుగా రాయవచ్చు. ఏ సందర్భానికి ఏ ఛందంలో రాయాలి. వీటి గురించిన పరిజ్ఞానం రచయితకుండాలి.

వాగ్గేయకారుడే నాటక రూపకం రాస్తే, అది సులువు అవుతుంది. సంగీత, సాహిత్యాలలో సమాన ప్రతిభ ఉండాలి. శ్రీ ఎస్.సి. హెచ్. కృష్ణమాచార్యులు గారికి ఈ ప్రతిభ ఉండేది. అప్పుడప్పుడు ఆయన దగ్గర కూచుని, కొన్ని విశేషాలు వినే అదృష్టం నాకు కలిగింది. అలాగే సంగీత కళానిధి శ్రీ చావలి కృష్ణమూర్తిగారు నాకు విద్యాగురువు. ఆయన కూడా నా అభిరుచి, ఆసక్తి గమనించి, సంగీత విశేషాలు విన్పించేవారు.

రజని గారి మాటల్లో-

శ్రవ్య సంగీత నాటక రచయిత, ఏ గేయం ఏ ఇతివృత్తాన్ని ఏ విధంగా చెప్పడానికి సరిపోతుందో, ఏ రాగం, ఏ ఛందం సరిపోతుందో తెలిసి ఉండాలి.

ఒక సంఘటన నుండి మరొక సంఘటనకి మారే విధానం, రాగాంతరం వంటివి కూడా తెలియాలి.

నా 'జననీ జన్మభూమి'లో ఇలాంటి ప్రయత్నం చేసాను. ఆ నాటకం సంగీత ప్రధానంగా చేయాలనుకున్నా, తగిన అవకాశం లభించక వీలు కాలేదు.

"శ్రవ్య సంగీత నాటకంలో ఒక సందర్భాన్ని గేయ రూపకంగా మారుస్తున్నప్పుడు, ఆ సంఘటన నిరూపణకి ఎన్ని పాత్రలు కావాలి? ఒకటా, రెండా? లేక గుంపా?"

గుంపు అయితే, జానపద గేయ రీతులు తెలిసి ఉండాలి.

ఇది ఒక పక్షం.

రెండో పక్షంలో – చక్కగా పాటలు, సంభాషణలు రాసేవారు, చక్కగా సంగీతాన్ని సమకూర్చేవారు ఒకరినొకరు అర్థం చేసుకుని, సంగీత నాటికలు తయారుచేయవచ్చు. లేదా వీరిద్దరినీ సమపాళ్లలో నిర్వహించగల దర్శకుడి ఆధ్వర్యంలో మంచి సంగీత నాటకాలు రూపొందించవచ్చు.

ఈ సమగ్ర నిర్వాహకుడు లేక ప్రయోక్త, అంతటినీ తన దృష్టితో చేసి, కవి-సంగీతజ్ఞుల చేత సందర్భానుసారంగా పని చేయించుకోగలగాలి.

సంగీత నాటకాలలో సంగీత రచయితకి కొన్ని అవరోధాలుంటాయి. రాగస్వరూపం గురించి సంప్రదాయంగా వచ్చే భావాలుంటాయి. రాగం యొక్క స్వరూపం కథలో సందర్భానికి చక్కగా సరిపోయిన రూపం అయితేనే వాడుకోవాలి. స్వరాల వినియోగాల విషయంలో ఎంతవరకు స్వతంత్రించవచ్చో సంగీత రచయిత చూసుకోవాలి.

ప్రయోగాలు, పూర్వ గేయ రచయితలు, జానపదులు స్త్రీల పాటల బాణీలను మనసులో ఉంచుకుని చేసినప్పుడు సంగీత నాటకం శ్రోతలకు వెంటనే హత్తుకు పోతుంది.

ప్రయోగం యొక్క ప్రయోజనం సిద్ధిస్తుంది.

రంగస్థల నాటకాలలో వలె సంగీత నాటకంలో నాటకీయత తీసుకు రావటం చాలా కష్టం.

కానీ, ప్రతి పాత్రకు అవకాశం ఉండే సందర్భాలనే సంగీత నాటకాలకు ఎన్నుకోవాలి. రచయిత సంగీత నాటకాన్ని దృశ్య కావ్యంగా ఊహించి రాయగలిగితేనే ఆ నాటకం ఎక్కువ రాణిస్తుంది".

రజని గారు, కృష్ణశాస్త్రిగారు అలా రాయగలిగేవారు.

"నాటకం స్థలైక్యం, కాలైక్యం, భావైక్యంతో సంఘటనల మాలికగా ఉండాలి. నాటకంలో సంఘటన, ప్రదర్శన ఉంటే రూపకంలో సమాచార సందేశ నివేదన ఉంటుంది".

సన్నివేశాలకు, స్థలాలకు, భావ వైవిధ్యాలకు శాబ్దిక నేపథ్యం సమకూర్చాలి. కొన్ని సన్నివేశాలలో సంభాషణల్ని పాటకి పంచి రాయాల్సి ఉంటుంది. కొన్ని సందర్భాల్లో సన్నివేశాలకు లయాత్మకమైన చిన్న చిన్న మాటలతో న్యాయం చేయవచ్చు.

ధ్వని ప్రధానంగా తీసుకున్నంతసేపూ రేడియో సంగీత నాటకం బాగా వస్తుంది. కళ్లు మూసుకుని వింటే శ్రోతకి కథ అంతా అర్థం కావాలి. పాత్ర స్వరూపం వాచకం ద్వారా, పాట ద్వారా తెలియాలి. ఎక్కువ పాత్రలున్నా సరే. కథాకథనం ఆ దృశ్యం ద్వారా అవగతమవ్వాలి. కొద్ది గొంతులతో ఎన్నో గొంతుల ప్రభావం శాబ్దిక రూపంలో విన్పించవచ్చు.

రచనలో ఏ వాక్య ధ్వనులు వస్తే కథ, కథనం పూర్తవుతుందో చూడటం రచయిత పని. ఆ దృశ్యాన్ని నిరూపించడం ప్రయోక్త నేర్పరితనం మీద ఆధారపడి ఉంటుంది. పాత్రకీ పాత్రకీ గల సంబంధం పాటల్లో మాటల్లో బోధపడుతు ఉండాలి.

'వలపు వంతెన' అనే నాటకంలో రజనిగారు తనదైన శైలి, విధానంలో సంగీత నాటకం రూపొందించారు. "రమ్య మధురభావ లలిత కళాలతిక జాజి సుందరీ... అల్లుకొనియె గాఢముగా" అనే పద ప్రయోగాన్ని సందర్భోచితంగా రాసారు.

సంగీత నాటకం ఆ పాత మధురమయిన సాహిత్య రచనయి ఉండాలి. కానీ శబ్దాడంబర కవిత్వంతో భావభరితమై ఉండకూడదు. వినగానే వాక్యంలో ఉన్న అర్థం, సందర్భం, దృశ్యం, సంఘటన అన్నీ శ్రోతకి వెంటనే బోధపడాలి. శ్రోతను ఆకర్షించాలి. పాట వినగానే కాలం-సాయం సమయమా, స్థలం కోటా లేక ఉద్యానవనమా, అంతఃపురమా, నదీతీరమా- ఏదైనా వెంటనే బోధపడేలా ఉండాలి.

'మేఘసందేశం' నాటకంలో యక్షుడు ప్రణయఖేలలో ఉంటాడు.

"నువ్వు లేకపోతే నాకమేలా

నందనమేలా..." అంటు కుబేరుని హెచ్చరిక గమనించకుండా ప్రణయ గీతాలు పాడుతు ఉంటాడు.

నాటకాలలో దీనిని 'గండం' అంటారు.

ఇలాంటివి సంగీత నాటక కర్తకి ఉపకరిస్తాయి.

1941లో 'చండీదాసు' నాటకంలో మలయమారుతాన్ని రజని గారు ప్రణయ గీతానికి ఉపయోగించారు.

"ఎచటినుండి వీచెనో ఈ చల్లని గాలి" పాట సన్నివేశం లాంటిదన్నమాట.

రజని గారు 'మూలస్తంభాలు' సంగీత నాటకంలో సంగీతంలో చెప్పగల రకరకాల రంగాలుంటాయని చూపారు.

రేడియోలో పాత్రని నిరూపించుకోగల గొంతుల్ని ప్రవేశపెడితేనే శ్రోతలు మెచ్చుకుంటారు. నేపథ్య సంగీతంలో వాద్యాలు ఎక్కడెక్కడ ఎంతెంత కావాలో

అంతే వినియోగిస్తేనే శ్రవ్య సంగీత రూపకం లేక నాటకం రక్తి కడుతుంది. విజయవంతమౌతుంది.

వాద్యాలు ఎక్కువ కావాల్సిన సందర్భం ఉంటేనే వాడాలి. అనవసరంగా ఎక్కువ వాద్యాలు వాడితే సంగీత నాటకం హతమౌతుంది.

వాద్యాలు ఎక్కువ ఉపయోగించాల్సి వచ్చినపుడు వాద్యాలకి, గొంతుకలకి మనం చెప్పదలుచుకున్న సందేశానికి సమమేళనం కనబడాలి.

సందేశం ఆ ధ్వనుల్లో మునిగిపోకూడదు.

ఇప్పుడు పాటల్ని వాద్యాలు మింగేస్తున్నాయి.

అలా జరగకూడదు.

ఇతివృత్తాన్ని రచనాత్మకంగా విస్తరించేటప్పుడు ఆ రంగంలో పాత్రల మధ్యన పంచుతున్న సంఘటనల్ని చెప్పే 'సంవాదగేయా'లుంటాయి. వీటిలో నాటకీయత తీసుకురావచ్చు. కథను కూడ నడపవచ్చు.

సంవాదాలు రుచినీ, కుతుహలాన్నీ కలిగించే రీతిలో ఉండాలి. నాటకంలో ఒక్కొక్క దృశ్యం ఒక యూనిట్.

ఒక్కో యూనిట్, విషయాన్ని అనుసరించి ఒకటి లేక రెండు మూడు రాగాల్లో కూర్చటం జరుగుతుంది.

సంవాదాలతోటి, పాటలతోటి ఉన్న సంగీత నాటకాలలో రసవంతమైన శిఖర దృశ్యాలలోనే పాట వస్తుంది. అలాంటి వాటినే 'ఆర్టు సాంగ్స్' (art songs) అంటారు.

17వ శతాబ్దంలోని తెలుగు యక్షగానాలలో దరువులు అలాంటి పనినే చేసేవి.

యక్షగాన ప్రదర్శనలో ఈ దరువులు రసశిఖరాలు. ఈ దరువులే తర్వాత కాలంలో నాట్య పదాలయ్యాయి.

'అమృతవర్షిణి' అనే సంగీత నాటకాన్ని రజని గారు చేసారు. అది జీమూత వాహనుడి కథ.

గరుత్మంతుని రాక తెలియజేస్తు-

"రివ్వు రివ్వు రివ్వు రివ్వు రివ్వు యనుచును
దవ్వు దవల దవ్వు దవుల సవ్వడాయెను

అని ఏదో జరుగుతుందన్న ఊహను శ్రోతల్లో రేకెత్తించారు. ఆ తర్వాత-

"వచ్చిపడెను వచ్చి పడెను గరుడుడయ్యో
చచ్చినాము చచ్చినాము చచ్చినామయొ ॥వచ్చి॥
కాలరాత్రి శిరోజాల పాయగా
నీల ఘనాఘనముల పెనుఛాయగా.... "

అంటు సాగిపోతుంది.

తగిన లయ వాద్య శబ్ధాలు సమకూర్చడం వల్ల పాములు పొందిన భయాన్ని శ్రోతలూ పొందారు!

నాటకీయతని ఆఖ్యానం వల్ల తగ్గించవచ్చు.

వాక్యాల నిర్మితి, అలజడి అతిగా కలిగించని రాగాన్ని ఉపయోగిస్తు, కథాగమన వేగాన్ని తగ్గించవచ్చు.

సంగీత నాటకం రాణించాలంటే, ప్రామాణికులై శ్రోతల మనసులో ముద్ర వేయగల గాయకులై ఉండాలి. పాటలు నోటికి వస్తే, గాయకులు అనుభవాన్ని ధారపోస్తు రసాన్ని పూరించగలరు.

సంగీత నాటకాలు రజని గారంత ప్రతిభావంతంగా చేయగల వారు తర్వాత తరంలో కరువైనారు.

నేను బహుముఖ ప్రజ్ఞాశాలి పి.భానుమతి గారిని వారి ఇంట్లో కలుసుకున్నప్పుడు, ఎంతో ఆత్మీయంగా మూడు గంటలసేపు ఎన్నో ఎన్నెన్నో విషయాలు ముచ్చటించారు.

బాలాంత్రపు రజనీకాంతరావు గారి గురించి ఎంతో ఘనంగా చెప్పారు. పాత జ్ఞాపకాలను పంచుకున్నారు.

ఈ అధ్యాయంలో సంగీత నాటకాల గురించి ఆయన వెలిబుచ్చిన అభిప్రాయాలనే అధిక భాగం చేర్చటం జరిగింది.

కారణం, శ్రవ్య సంగీత నాటకాల గురించి 'అథారిటీ'గా ఆయనలాగా ఇంకెవ్వరూ చెప్పలేరు.

ఆ అమూల్య విశేషాలు పాఠకులకు తెలియాలి.

అదే ఈ గ్రంథకర్త ఆకాంక్ష.

## ప్రయోగాత్మక శ్రవ్య నాటకాలు

"విభిన్న రుచులు గల జనులందరికీ ఏక పత్ర సమారాధన చేసేది నాటకం" అంటాడు మహాకవి కాళిదాసు.

ఏ నాటకమైనా సత్యదూరమైన ఇతివృత్తంతో ఉండకూడదు. నాటకానికి మూలం 'క్రతువు'గా చెబుతారంటారు సుప్రసిద్ధ దర్శకులు చాట్ల శ్రీరాములు.

ఏదో ప్రయోజనం సాధించటానికి క్రతువు చేస్తారు. సామాజిక ప్రయోజనమే నాటక క్రతువు లక్ష్యం కావాలి.

ప్రజల నమ్మకాలలో మార్పులు తెచ్చేందుకు, ఆలోచనలకు పదును పెట్టేందుకు, ప్రయోగాత్మక నాటకాలు కావాలి అంటారు శ్రీరాములుగారు.

ఈ కోవలోకి వచ్చిన మొదటి నాటకంగా ఎన్.ఆర్.నంది 'మరో మొహంజుదారో' చెప్పుకోవచ్చు. ఆ తర్వాత శ్రీశ్రీ గారి 'విదూషకుడి ఆత్మహత్య' చెప్పుకోవాలి.

రేడియో నాటకం ప్రారంభమైన కొద్ది నిముషాల్లోనే శ్రోతల్లో ఆసక్తి కలిగించాలి. లేకపోతే స్టేషను మార్చేస్తాడు. లేదా రేడియో కట్టేస్తాడు.

ఈ విషయాన్ని నాటకానికి సంబంధించిన వారంతా గుర్తుంచుకోవాలి. లేకపోతే, శ్రవ్య నాటకం విఫలమౌతుంది.

కొన్ని ప్రయోగాత్మక నాటకాలు రంగస్థలానికే పరిమితం. రేడియోకి పనికిరావు.

మరో మొహంజుదారో అలాంటిదే.

దీన్ని శ్రవ్య నాటకంగా మార్చటం అసాధ్యం.

రేడియో నాటకాల సన్నివేశాల్లో వీలయినన్ని తక్కువ పాత్రలుండాలి. శ్రోతల ఊహకు వదలాల్సిన అవసరం ఎక్కువ గనక, సంభాషణల ద్వారానే సన్నివేశ కల్పనలు చేయాలి.

రేడియో ప్రయోగ నాటకాల్లో ఇతివృత్తం, కథ, భావ సంఘర్షణాత్మక సంభాషణలు, నేపథ్య సంగీతం వంటివి నాటకం తీర్చిదిద్దటంలో బాగా ఉపకరిస్తాయి.

నేను రాసిన ప్రయోగాత్మక నాటకాలు రెండు చెబుతాను.

ఒకటి: పెళ్లితూపులు.

పెళ్లి చూపులకొచ్చిన వ్యక్తిని ఎదురు ప్రశ్నలు వేసి హడలెత్తిస్తుంది వధువు. కట్నం ఎదురు అడుగుతుంది. ఇది తిరుగుబాటు కాదు. ఆడపిల్లలు కూడా భావస్వేచ్ఛ కలిగి ఉండాలని, తమ భావాలు ధైర్యంగా చెప్పాలని, తల దించుకుని కూర్చునే రోజులు పోయాయనేది ఇందులో సందేశం.

శ్రోతలు దీనిని బాగా స్వీకరించి అభినందించారు.

రెండోది: వరకట్నం మీద.

కోడలు అన్న, గయ్యాళి అత్తగారికి గట్టి గుణపాఠం చెబుతాడు. కోడల్ని వేధిస్తే కలిగే పర్యవసానాలు చెప్పి, ఆవిడను మారుస్తాడు.

ఈ రెండింటిలోను ఆకాంక్షాపూరిత సందేశం ఉంది. ఇలా జరగటానికి అవకాశం ఉంది. ఈ సమస్యలకు ఇవి అనువైన పరిష్కారాలు అని చెప్పటమే నా ఉద్దేశ్యం.

ఆ సందేశాలను తమ జీవితాల్లో ఆచరణాత్మకం చేసుకోవటం శ్రోతల ఇష్టం.

కాబట్టి, ప్రయోగాత్మకంగానే కాదు, అవి ప్రయోజనాత్మకంగా ఉండాలని రచయితలు గుర్తుంచుకోవాలి.

## శ్రవ్య నాటకాల్లో సామాజిక స్పృహ

సాహిత్య ప్రయోజనాల్లో సామాజిక స్పృహకి అగ్రతాంబూలం ఇస్తారు. కన్యాశుల్కం, వరవిక్రయం నాటకాల అంతస్సూత్రం ఇదే. 'గణపతి' నాటకం వినోద ప్రయోజనం గలది.

సమాజ రుగ్మతల గురించి నేర్పుగా చెబుతు, పర్యవసానాలు, పరిష్కార మార్గాలు, పరివర్తనలు లక్ష్యంగా నడిపించాలి.

ఒక తప్పు చేసేవాడు పర్యవసానాల గురించి ఆలోచించడు. తీరా దుష్టపరిణామాల్లో చిక్కుకున్నాక చింతించటం ప్రారంభిస్తారు.

క్రూరమైన నేరాలు చేసిన వారికి మరణ శిక్షలు పడినప్పుడు కోర్టులోనే భోరున ఏడ్చిన సందర్భాలు చాలా ఉన్నాయి. ఇదే పర్యవసానం.

పర్యవసానాలు ఆలోచిస్తే తప్పులు, నేరాలు చెయ్యరు. ఇష్టంగా నేరాలు చేసేవారు కష్టంగా అనుభవిస్తారు. వారిని ఎవరూ మార్చలేరు. మళ్లీ మళ్లీ నేరాలు చేస్తునే ఉంటారు. నేరమే వాళ్ల జీవితంగా మారిపోతుంది.

"నాటకం ఆలోచింపజేసేదిగా ఉండాలి" అనేది మేధావుల అభిప్రాయం.

ఆలోచన బలపడితే అది ఆచరణకి దారి తీసే అవకాశాలు మెండుగా ఉంటాయి.

సమాజంలో ఏమి జరుగుతోంది?

ఎక్కడ ఎలాంటి అన్యాయాలు జరుగుతున్నాయి?

వాటికి నివారణలు ఉంటున్నాయా?

ఇలాంటి శోధనాత్మక పరిశీలనకు రచయితలు పూనుకోవాలి. సామాజిక సమస్యల గుర్తింపుతోబాటు, వాటిని హృద్యంగా కళాత్మకంగా చెప్పగలిగే ప్రజ్ఞను అభివృద్ధి చేసుకోవాలి.

మార్గదర్శనం కోసం సామాజిక స్పృహ గల కొన్ని రచనలు చదువుతుండాలి. దీనివల్ల రచయిత అవగాహనా పరిధి విస్తృతమౌతుంది.

సంఘ సంస్కర్తలయిన వాళ్లు ఆచరణాత్మకంగా బాధితుల్ని ఆదుకుంటే, సామాజిక స్పృహ కల కవులు, రచయితలు ఊహాత్మకంగా ఆ పని చేస్తారు.

శ్రీశ్రీ అన్నట్టు 'ఎవరో వచ్చి ఏదో చెయ్యరు'

ఎవరికి వారు తమ శక్తుల్ని కూడగట్టుకోవాలి.

దోమలు కుడుతుంటే భరిస్తు కూర్చోలేము కద? వాటిని చంపి మనల్ని కాపాడుకుంటాం. ఎవరూ వచ్చి మన కోసం దోమల్ని చంపరు. మన సమస్యల పట్ల కూడా ఇలాంటి మనఃస్థితి కలిగి ఉండాలి. అలాగని విప్లవ మార్గం పట్టమనో, మృత్యుహేల చూపమనో కాదు. పిరికితనం నుండి మనిషి బయట పడాలి.

మహాయోధుడైనా అతన్ని పిరికితనం చంపేస్తుంది.

దుర్బలుడైనా ఆత్మబలంతో గెలుస్తాడు.

ఇలాంటి ఆశావహమైన ఆలోచనలతో సమాజాన్ని బలోపేతం చెయ్యాలి.

అప్పుడే అది సామాజిక స్పృహ కలిగి, సామాజిక ప్రయోజనాన్ని సాధిస్తుంది.

# అయిదవ అధ్యాయం

**కృష్ణానదీ పూత జలేన సిక్తం**
**ఆకాశవాణీ వన పారిజాతం**
**త్రికాల వేలాసు సుగంధ ధూళిం**
**సంప్రోక్ష్య భూమించ తనోతు నిత్యమ్**

**- ఎస్.విజయభూషణ శర్మ**

కవికోకిలల హృదయాలు ఆకాశవాణి ప్రాంగణంలోకి రాగానే పులకరించేవి. అదొక రవీంద్రుని శాంతినికేతన్‌ని తలపించేది. విజయవాడ ఆకాశవాణి నిలయం అలాంటిది.

ఉగాది సందర్భంగా ఆరుబయట, మామిడి వృక్షాల పర్యవేక్షణలో కవి సమ్మేళనాలు జరిగేవి. అక్కడ విశ్వనాథ వారిదే అధ్యక్ష స్థానం.

సినారె, దాశరథి, గజ్జెల మల్లారెడ్డి వంటి నిష్ణాతులందరూ పాల్గొనేవారు. అలాంటి కవి సమ్మేళనాలు తర్వాత తర్వాత స్టుడియోలోకి మారిపోయాయి.

అందువల్ల అలాంటి కమనీయ దృశ్యాలు మళ్లీ చూసే అవకాశం లేదు. వాటిని చూడగలిగిన అదృష్టవంతుల్లో నేనూ ఉన్నాను.

ఆకాశవాణి ఆరుబయలు కార్యక్రమాలు ఇప్పుడూ చేస్తోంది. గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి కొన్ని ఎంపిక చేసిన కార్యక్రమాలు ప్రదర్శిస్తారు. ఆ కార్యక్రమాల్నే స్టుడియోలో రికార్డు చేసి ప్రసారం చేస్తారు.

'హనీమూన్' పేరిట నేను రాసిన నాటకం అలాంటిదే. అది కుటుంబ నియంత్రణ మీద, స్ఫురించే సందేశంగా చెప్పబడిన గొప్ప ఇతివృత్తం.

సింగరాజు రామచంద్రమూర్తికి ఈ కథకిగాను ఆంధ్రప్రభ వారపత్రిక, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు సంయుక్తంగా నిర్వహించిన కథల పోటీలో ప్రథమ

బహుమతి లభించింది. దీనిని నాటకంగా చెయ్యటానికి నేను కొన్ని పాత్రల్ని ప్రవేశపెట్టి, పెంచటం జరిగింది.

ఇది సామాజిక ప్రయోజనం గల నాటకం.

క్లుప్తంగా కథ ఇది.

నవ దంపతులు హనీమూన్‌కి సుందర ప్రదేశాలకు బదులు తమ సన్నిహిత బంధువుల ఇళ్లకు వెళతారు.

అధిక సంతానం గల వారి అవస్థల్ని, పరిమిత కుటుంబం గలవారి సుఖ సంతోషాల్ని స్వయంగా చూసి తెలుసుకుంటారు. చివరకు తాము కూడా పరిమిత కుటుంబంతోనే జీవితం సాగించాలని నిర్ణయించుకుంటారు. ఇందులో నేరుగా ఎలాంటి సందేశాలూ ఉండవు.

అవగాహనకి తోడ్పడేలా, స్ఫురించేలా చేప్పటం వల్ల ఇది ప్రయోజనాత్మకంగా తయారయింది.

అయితే, అన్ని వేళలా ఇది సాధ్యం కాదు.

సందేశాలు చెప్పాల్సిన సందర్భాలూ ఉంటాయి.

వాటిని అలానే చెప్పాలి. అలాగే రూపొందించాలి.

ఇప్పుడు వాటి సంగతి తెలుసుకుందాం.

## సందేశాత్మక శ్రవ్యనాటకాలు

దేశం విదేశీ పాలనలో మ్రగ్గుతున్న రోజుల్లో సృజనాత్మక శక్తిగల వారు తమ తమ పద్ధతుల్లో ప్రజల్లో స్వాతంత్ర్యేచ్ఛ రగిలించేవారు.

కొందరు ఉత్తేజపూర్వక ప్రసంగాలు చేసేవారు. కొందరు ఎలుగెత్తి కవితలు, గేయాలు గానం చేసేవారు. లయబద్ధంగా నాట్యం కూడ చేసేవారు.

ఇప్పుడు మన సమకాలీనుడైన గద్దర్ ఆ పాత్ర పోషిస్తున్నాడు.

స్వాతంత్ర్యం వచ్చాక క్రమంగా ఉద్యమ స్ఫూర్తి సన్నగిల్లిపోవటం మనం చూస్తున్నాం.

దేశభక్తి అవసరానికి మాత్రమే ఉపయోగించేదిగా భావించకూడదు. అది మన స్వభావంలో ఉండాలి. మన జీవన విధానం కావాలి.

స్వాతంత్ర్యం వచ్చినా దేశభద్రతకు ముప్పు కలుగుతునే ఉంది. చైనా దురాక్రమణ, పాకిస్థాన్ కుయుక్తులు, ఉగ్రవాద దాడులు, సైబర్ దాడులు- ఇలా అనేక రకాలుగా మనం జాతీయ సమస్యల్ని ఎదుర్కొంటున్నాం.

శత్రువుల్ని అంతమొందించటానికి తుపాకీ ఉపయోగిస్తాం. ఆ తుపాకీని మనం పేల్చాలి తప్ప శత్రువుని తనంతట తానుగా వెతుక్కుని, తూటా పేల్చి చంపదు.

అలాంటిదే దేశభక్తి.

అప్రమత్తంగా ఉంటు, సమస్యలు ఉత్పన్నం కాకుండా జాగ్రత్త పడాలి తప్ప, ఏదో జరిగేక కాదు.

అగ్ని ప్రమాదం జరక్కుండా జాగ్రత్త పడాలి.

ఒకవేళ దురదృష్టవశాత్తు జరిగితే, తక్షణం మంటలు చల్లార్చేందుకు మన వద్ద సన్నద్ధత ఉండాలి.

దేశభద్రత గురించి ఇలాంటి జాగ్రత్త అవసరం.

నా నాటకం 'వైతాళికులు' ఇదే సందేశంతో రాయబడింది. "ఉత్తిష్ఠ నరశార్దూలా! కర్తవ్యం దేశ రక్షణమ్" అంటూ మత్తులో జోగుతున్న నవతరానికి మేలుకొలుపు పాటతో నాటకం ప్రారంభమౌతుంది.

పదునైన, అర్థవంతమైన సందేశంతో ముగుస్తుంది.

జాతీయ స్థాయిలో వివిధ భాషల్లో జన జాగృతికి సంబంధించి అనేక రచనలు వచ్చాయి. ఇంకా వస్తునే ఉన్నాయి.

ప్రజలు వీటిని స్వీకరించాలి.

తమ జీవన విధానం, ఆలోచనా ధోరణి మార్చుకోవాలి.

అప్పుడే ఆశించిన ఫలితాలు లభిస్తాయి.

పరాయిపాలనలో దేశ ప్రజలు అనుభవించిన అష్టకష్టాలు ఇప్పటి తరానికి తెలియవు. అప్పటి వారి త్యాగాలు కనీసం ఊహించనుకూడా లేరు. కారణం: ఇప్పుడు ఎటు చూసినా స్వార్థపూరిత వాతావరణమే.

స్వార్థలాభం తప్ప ఇంకో ఆలోచన రావటం లేదు.

ఈ ధోరణి ఎంత ప్రమాదమో తెలియజేసే నాటకాలు రావాలి. మహిళా జాగృతి కూడ చాలా అవసరం.

మహిళల రక్షణకు ఎన్ని చట్టాలు చేసినా, అరక్షితంగానే జీవిస్తున్నారు.

అలాగే, తాత్కాలిక సుఖం కోసం జీవితాలను దగ్ధం చేసుకుంటున్నారు. 'ఎయిడ్స్' మహమ్మారికి ఎందరో బలవుతున్నారు.

దీని గురించి హెచ్చరించేదే నా 'శలభం' గంట నాటకం. ఇది కొత్తగూడెం కేంద్రం నుండి శ్రీ పంతగాని గోపాలకృష్ణ గారి నిర్వహణలో ప్రసారమైన శ్రవ్య నాటకం.

అదే కేంద్రం నుండి 'చినుకు' శ్రవ్య నాటకం ప్రసారమైంది. గ్రామీణ ప్రాంతాల్లో వర్షాభావం వల్ల నీటి ఎద్దడి కలుగుతుంటుంది. మోతుబర్లు తమ ఏర్పాట్లు తాము చేసుకోగలరు. వారికి ధనశక్తి ఉంది.

బీదవారి పరిస్థితి దయనీయం.

అంటరాని కులాలుగా కొందర్ని చూడటం మన దేశ రాజ్యాంగ విరుద్ధమూ, శిక్షార్హమైన నేరంగా చూడబడుతున్నా, కొన్ని చోట్ల ఈ అకృత్యం జరుగుతూనే ఉంది.

అలాంటి ఒక గ్రామంలో కడజాతివాడు ఇచ్చిన కాసిన్న నీళ్లతో ప్రాణం నిలుపుకున్న అగ్రజాతి వ్యక్తిలో కలిగిన పరివర్తనే ఈ నాటకంలోని కథావస్తువు.

ఇది కూడ సందేశాత్మకమే.

మనిషి మాటలతో మారడు.

అనుభవాలతోనే మారతాడు.

కానీ, ప్రతిదీ అనుభవాలతోనే నేర్చుకోవాలనుకుంటే ఒక జీవితం చాలదు.

కాబట్టి, అనుభవజ్ఞులైన పెద్దల మాటల్ని స్వీకరించాలి.

అప్పుడే సమాజం పటిష్టమూ, పరిపుష్టమూ అవుతుంది.

## బాలల కోసం శ్రవ్య నాటకాలు

'నేటా బాలలే రేపటి పౌరులు' కాబట్టి, బాల్యావస్థ నుండే పిల్లలకు, వారి వారి తెలివితేటలను బట్టి, వివిధ రంగాలలో కృషి చేసేందుకు ప్రోత్సహించాలి. అవసరమైన సదుపాయాలు సమకూర్చాలి.

అస్తమానం 'చదువు-చదువు' అని వేధిస్తుంటే పిల్లల్లో కోపం, తిరుగుబాటు తత్వం పెరుగుతుంది. ఇవి వారి ఆలోచనల్ని తప్పుదారి పట్టిస్తాయి.

నా అదృష్టం- మా పెద్దన్నయ్య.

ఇద్దరి మధ్య పదకొండేళ్ల వ్యత్యాసం ఉన్నా ఆప్తమిత్రుల్లా ఉండేవాళ్లం. (ఇటీవలనే

ఆయన ఎనభై ఏళ్ల వయస్సులో కాలం చేసారు).

చాట్ల శ్రీరాములుగారు, డా॥ కొమ్మూరి వేణుగోపాలరావుగారు, డాక్టర్ జంధ్యాల శంకర్ అన్నయ్యతో కాలేజీలో చదివినట్లు చెప్పేవారు.

అన్నయ్యకి రాయటం అంటే ఆఫీసు కాయితాలే!

నా రచనలు వినేవాడు.

చదివేవాడు.

విమర్శించేవాడు కాదు. క్లుప్తంగా 'బావుందిరా' అనేవాడు. అదే నాకు కొండంత ఉత్సాహం కలిగించేది.

నాక్కావాల్సిన కాగితాలు, కలాలు, పోస్టేజి ఖర్చులు అన్నీ అన్నయ్యే చూసుకునేవాడు.

నేను రచనలు చేస్తున్న విషయం చాలా ఆలస్యంగా మా నాన్నగారికి తెల్సింది.

చదువు నిర్లక్ష్యం చేయవద్దని మందలించినా తర్వాత్తర్వాత నాకు గురువై, ఆయనకు తెల్సిన విషయాలు నాకు చెబుతుండేవారు. ఎక్కడికి వెళ్లినా వెంట తీసుకువెళ్లేవారు. అలా కవిసామ్రాట్ విశ్వనాథ్‌ని తరచుగా కలుసుకుంటుండే వాళ్లం. అడిగి మరీ ఆయన ఆశీస్సులు నాకు ఇప్పించేవారు నాన్న.

విశ్వనాథకి నోబుల్ కాలేజి (బందరు)లో నాన్న గారు జూనియర్. వారింట్లోనే ఉండి చదువుకునేవారు, విశ్వనాథ అర్ధాంగి 'అన్నయ్యా' అని మా నాన్నగార్ని ఆప్యాయంగా పిలిచేది. విశ్వనాథ పావని శాస్త్రి నాన్నగార్ని 'మామయ్యా!' అనీ, నన్ను 'బావగారూ' అని చనువుగా ఉండేవాడు.

ఇవన్నీ ఎందుకు చెబుతున్నానంటే, ఇలాంటివి జరక్కపోతే, నేను ఇంతగా సాహిత్య కృషిలో మమేకం కాలేకపోయేవాడ్ని.

ఇంతకు ముందు చెప్పినట్లు నా చేత రేడియో రచనలు చేయించిన ఏడిద కామేశ్వరరావు గారు, ప్రారంభంలో బాలల కోసం శ్రవ్య నాటికలు రాయించారు.

వాటిని మేమే రాసేవాళ్లం. వాటిలో సందేశాత్మకము, హాస్యమూ వంటివి ఉండేవి.

మా బాల్యంలో వన భోజనాల వేళ జరిగే సాంస్కృతిక కార్యక్రమాల్లో మా బృందం కూడ ఆకాశవాణి కళాకారుల తరఫున పాల్గొనేది.

మా పెద్దన్నయ్య (ఇరిగేషన్ డిపార్ట్‌మెంటు సూపర్నెంటు) తమ కార్యక్రమాలకు మమ్మల్ని ఆహ్వానించేవాడు.

ఇప్పుడు పిల్లలు చూపుతున్న ప్రతిభ చూస్తుంటే అవాక్కయిపోతున్నాం. పాటలు, నాట్యాలు... ఒకటేమిటి దేంట్లోనయినా తారల్లా వెలిగిపోతున్నారు.

ఇందుకు పెద్దల ప్రోత్సాహమే ప్రధాన కారణం.

మా అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, నేను పిల్లల కోసం 'బాల ఉగాది' అనే శ్రవ్య సంగీత నాటకం రాసాను. అలాగే 'వేయి వేణువులు' అనే మరో నాటకం.

పిల్లల కోసం రాయటం వల్ల, పిల్లలే ఆ కార్యక్రమంలో పాల్గొనటం వల్ల, వాటిని చూస్తున్న పిల్లలకు సైతం ఉత్సాహం కలుగుతుంది.

అయితే, పిల్లల కోసం పిల్లలచేత నాటికలు, నాటకాలు రాయించటం మంచి పద్ధతి.

దీనివల్ల వారి సృజనాత్మక శక్తి పెరుగుతుంది.

పిల్లల రచనలు చదివి విమర్శించకూడదు.

అవి, ఆ వయసులో కలిగే భావాలనే విషయం గుర్తుంచుకుని, మెళుకువలు నేర్పాలి. లోపాల గురించి మృదువుగా నచ్చచెప్పాలి. చివర్న బాగా ప్రోత్సహిస్తు భుజం తట్టాలి.

అప్పుడు వారి మనసు పురి విప్పిన నెమలి అవుతుంది. మన ప్రోత్సాహాన్ని జీవితాంతం గుర్తుంచుకుంటారు.

బాల్య స్మృతులు మధురాతిమధురం.

ఎన్ని మార్లు తలుచుకున్నా తనివి తీరదు.

'ప్రోత్సాహం' సందర్భంగా ఇద్దరు వ్యక్తుల గురించి చెప్పాలి. ఒకరు– బోడపాటి హరికిషన్. సుప్రసిద్ధ నవలా రచయిత. కథలు, శ్రవ్యనాటకాలూ రాసేవాడు. మా అన్నయ్యగారి ఆఫీసులోనే సూపర్నెంట్. మా అన్నయ్య ద్వారా పరిచయం. కథలు, నవలలు, శ్రవ్య నాటకాల మీద నాతో చర్చిస్తుండేవాడు. నా రచనలను చదివి, ప్రోత్సాహంగా అభినందించేవాడు. ఇప్పుడు కీర్తిశేషుడు.

రెండో వ్యక్తి– కవి కాటూరి వేంకటేశ్వరరావు గారి కుమారుడు విజయసారథి. ఆకాశవాణిలో ఉద్యోగం చేసేవాడు. ఆంధ్రప్రభలో 'పితృవనం' నవలకి బహుమతి గెల్చుకున్నవాడు. మా పెద్దన్నయ్య, విజయసారథి ఒకే ఈడువాళ్లు. పైగా, సన్నిహిత బాంధవ్యం. 'ఏరా' అనేంత ఆత్మీయత.

నేను శ్రవ్యనాటకాలు రాస్తున్న తొలినాళ్లలో మా అన్నయ్య నన్ను విజయసారథి దగ్గరకి తీసుకెళ్లి "మా వాడికి రేడియో నాటకాల కిటుకులు చెప్పరా" అన్నాడు. ఇది 1960కి ముందుమాట.

"ఏమైనా రాసాడా?" అనడిగేడు విజయసారథి.

"ఆఁ...నీకు చూపించేందుకు ఒకటి తెచ్చాడు" అని, నా దగ్గర్నుంచి ఒక రేడియో నాటకం స్క్రిప్టు తీసుకుని ఇచ్చాడు. అంతా చదవి "బాగానే రాస్తున్నాడు కదరా!" అన్నాడు ఆశ్చర్యంగా నాకేసి చూస్తు. నేను చిర్నవ్వు నవ్వేను.

"అభ్యాసము కూసువిద్య! రాయగా రాయగా ప్రావీణ్యం పెరుగుతుంది. నేనూ అలా రాస్తున్నవాడినే!" అన్నాడు. నేను విజయసారథి మాటలు మర్చిపోలేదు.

అభ్యాసంతోనే, స్వయంకృషితోనే మెట్లు ఎక్కాను.

ఇటీవలనే కాటూరి విజయసారథి కాలం చేసాడు. అతని 'పితృవనం' కీర్తిపతాకగా రెపరెపలాడుతోంది. అప్పుడప్పుడు నాకు ఫోన్లు వస్తుంటాయి. "పితృవనం

కాపీలు ఎక్కడ దొరుకుతాయి?" అంటూ, అవి దొరకటం కష్టంగా ఉంది.

నా దగ్గర కూడా కాపీ లేదు.

ఎంత ప్రయత్నించినా దొరకలేదు!

ఈ విధంగా రచయితలు, బాగా రాయగలవాళ్లు, బాలల కోసం శ్రవ్యనాటికలు, నాటకాలు రాయాల్సిన అవసరం ఉంది.

అందులో దేశభక్తి, సామాజిక దృక్పథం, శీల ప్రాధాన్యం, సైన్సు, ఫిక్షను వంటి అంశాలు వేటిని తీసుకున్నా ఫర్వాలేదు.

బాలల చేత బాల సాహిత్యం, శ్రవ్య నాటికలు రాయిస్తే, వారు భవిష్యత్‌లో మంచి రచయితలు కాగలరు.

ఇది నా స్వానుభవం.

# ఆరవ అధ్యాయము

**ఆకాశవాణీ జయవాటికాయాః**

**స్వర్ణోత్సవే దివ్య ముహూర్తకాలే**

**గాయంతు సంగీత విశారదశ్చ**

**నర్తంతు రాష్ట్రస్య కళాభినేత్ర్యః**

**- ఎస్.వి. భూషణశర్మ**

ఆకాశవాణి విజయవాడ కేంద్రం 1998లో స్వర్ణోత్సవాలను వైభవోపేతంగా జరుపుకుంది.

1960 నుండీ ఆకాశవాణితో అనుబంధం ముఖ్యంగా రచయితగా (బాల నటుడిగా అంతకుముందు నుండే కార్యక్రమాల్లో పాల్గొనేవాడిని) ఉన్న నాకు ఒక స్వర్ణోత్సవ అనుభూతి ఉంది.

'స్వర్ణయుగం'గా చెప్పగల కాలాన్ని చూసాను.

మారుతున్న పరిస్థితుల్నీ చూస్తున్నాను.

కార్యక్రమ నిర్వాహకులుగా యువతరం వస్తోంది.

కొత్త కొత్త కార్యక్రమాలు రూపకల్పన చేస్తున్నారు. కొన్ని గత కాల వైభవాలను గుర్తుకు తెచ్చే కార్యక్రమాలను మళ్లీ మళ్లీ ప్రసారం చేస్తున్నారు.

వాటిలో గణపతి, వరవిక్రయం నాటకాలను ప్రత్యేకించి చెప్పుకోవాలి.

వీటిని 'ఎవర్‌గ్రీన్'గా చెబుతుంటారు.

కథకుడిగా 'గాలివాన' కథతో తెలుగు కథకి అంతర్జాతీయ గౌరవం కల్పించిన పాలగుమ్మి పద్మరాజు గారు ఆకాశవాణి ఆలంబనంగా ఎదిగినట్లు చెప్పుకునేవారు. అలా చెప్పుకున్న మహానుభావులు ఎందరో ఉన్నారు.

కారణం- ఆకాశవాణికి లక్షల సంఖ్యలో గల శ్రోతలు. (ఇప్పుడు కోట్లు అన్నా తప్పు లేదు)

శ్రోతలు ఉత్తరాలతో వెంటనే స్పందించేవారు.

ఆకాశవాణి ఆర్టిస్టులను, రచయితల్ని చూసేందుకు తహతహలాడేవారు. ఆరాధనా భావం కలిగి ఉండేవారు. ముఖ్యంగా ఉషశ్రీ, నండూరి, బాలాంత్రపు రజని, మంగళంపల్లి బాలమురళీకృష్ణ, సి.రామ్మోహనరావు, కోకా సంజీవరావు, ఎ.బి.ఆనంద్, శ్రీరంగం గోపాలరత్నం, వి.బి.కనకదుర్గ, ఇప్పుడు ఆవాల శారద- వీరందర్నీ శ్రోతలు మెచ్చారు.

వింజమూరి శివరామారావుగారు, బందాగారు ఎందరికో ఆదర్శం. ఆకాశవాణి ద్వారా గుర్తింపు పొందిన అదృష్టవంతుల్లో నేనూ ఉన్నాను.

పాలగుమ్మి పద్మరాజుగారు శ్రవ్యనాటకాల నిర్మాణం గురించి కొన్ని విలువైన అభిప్రాయాలు చెప్పారు. అవి ఆయన మాటల్లోనే-

"చాలా కాలం క్రితం అప్పటికి భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిందో, రాబోతుందో నేను రాసిన నాటకం ఒకటి మద్రాసు కేంద్రం (ఆకాశవాణి) వారు ప్రసారం చేసారు. చాలా బాగా రాశాననుకున్నాను. ప్రసార సమయానికి అన్ని పనులూ మానుకుని అంటే ఆ రోజుల్లో రాత్రి పది వరకు క్లబ్బుకి పోయి పేకాడ్డం అలవాటు. కొందరు మిత్రుల్ని పిలిచి వాళ్లకి 'టీ' కూడా సప్లయి చేసి, వాళ్లతో బాటూ, నేనూ రేడియో ముందు కూర్చున్నాను. నా ప్రతిభకి నా మిత్రులందరూ ముగ్ధులవాలని నా ఆశ. ప్రసారం ప్రారంభమైంది. ఎత్తుగడ బాగుంది. గొంతులు మంచివి. ఉచ్చారణ బాగుంది. ఒక్క పాత్రధారి మాత్రం అనవసరంగా గొంతు చించుకుంటున్నాడు. అయినా ఫర్వాలేదు. అసలు ఘట్టం వచ్చింది. రాత్రి ప్రశాంత సమయం. ఆ నిశ్శబ్దాన్ని బద్దలు కొడుతు పిస్టలు పేలాలి. నేను ఆత్రంగా ఎదురుచూస్తున్నాను. పిస్టలు పేలవలసినప్పుడు ఏదో 'తుస్సు'మన్న శబ్దం వినవచ్చింది. ఆ తర్వాత నాటకం నీరు గారిపోయింది. పాత్రధారులు బాగాను

'చదువు'తున్నారు. కానీ, నాకూ నా మిత్రులకూ నాటకం పట్టు సడలినట్టు అని పించింది".

ఈ సంఘటన చెబుతు పద్మరాజుగారు శ్రోత, రచయిత మెచ్చే నాటకం ఎలా ఉండాలో కొన్ని విషయాలు చెప్పారు.

నా అనుభవంలో ఇలాంటిదొకటి జరిగింది.

ఆకాశవాణి విజయవాడ కేంద్రానికి అప్పుడు అయూబ్‌గారు డైరెక్టరుగా ఉన్నారు.

శ్రీకృష్ణుడు పాత్రగా నేను రాసిన నాటకంలో శ్రీకృష్ణుడి పాత్రధారిగా పళ్లు ఊడిన నటుడ్ని పెట్టారు. తొస్సుమాటలు వినలేకపోయాను. దేవుడి పాత్రకి అలాంటి నటుడ్ని పెట్టటాన్ని డైరెక్టరు అయూబ్ గారి ముందు అసంతృప్తి వ్యక్తం చేసాను.

అప్పట్నుంచి రచయితతో సంప్రదించి, తగిన నటుల్ని ఎంపిక చేయమనీ, రిహార్సల్సుకి రచయితని పిలవమనీ ఆయన 'రూలింగ్' ఇచ్చారు.

పద్మరాజుగారు దీని గురించి చెబుతూ–

"రచయితకీ శ్రోతకీ మధ్య మరొక ముఖ్యమైన అవధి ఉంది. అది ప్రసారం.

రచయిత ఒక పాత్రని ఊహించుకుని రాస్తాడు.

ఆ గొంతు గంభీరమైనది.

ఎంత ఆవేశం వచ్చినా గొంతు పెంచడు.

నాటకం పతాక సన్నివేశంలో ఒక్కసారే గొంతెత్తి అరుస్తాడు. అప్పుడు అందరూ అదిరిపోవాలి. ప్రసారం దగ్గరకు వచ్చేసరికి ఆ పాత్రకి ఏ కీచు గొంతువాడో దొరుకుతాడు. నాటకం రక్తి కట్టదు. మంచి ప్రసారానికి శ్రోతల్ని మెప్పించే ప్రసారానికి రచయిత శక్తి సామర్థ్యాలు ఎంత ముఖ్యమో, ప్రసారం చేసే వారి సామర్థ్యం చాకచక్యం

అంత ముఖ్యం. ఒకప్పుడు రచన పేలవంగా ఉన్నా చాకచక్యం ద్వారా ప్రసారంలో శ్రోతలను బాగా మెప్పించవచ్చు".

చాలా మంది శ్రవ్య నాటక రచయితలు (నాతో సహా) ఈ అభిప్రాయాలతో పూర్తిగా ఏకీభవిస్తారు.

## శ్రోతలు-రచయితలు మెచ్చే నాటకాలు

తనకు వినిపించే దాన్ని బట్టే శ్రోత ఒక నాటకం మంచి చెడ్డలు బేరీజు వేసుకుంటాడు. కేవలం సంభాషణలే కాదు. సౌండు ఎఫెక్ట్సు, నేపథ్య సంగీత, విరామ సంగీతం ఉంటాయి. అన్నీ కలిసి సన్నివేశంలో ఉన్న రసాన్ని పోషించాలి.

పద్మరాజుగారి ఉదా: ప్రేయసీ ప్రియులు విడిపోయారు. కలుసుకోవడానికి వీల్లేనంత దూరంగా వెళ్లిపోయారు.

రచయిత "అప్పుడు చెట్లు నిట్టూర్చాయి. ఆకాశం జాలిగా కన్నీరు కార్చింది" అని వ్రాస్తే ఎలా ప్రసారం చెయ్యగలరా సన్నివేశాన్ని?"

ఆ మూడ్‌ని శ్రోతకు అందించే సాధనం కూడ రేడియో నాటకకర్త సూచించాలి. లేదా వాచ్యం చెయ్యాలి.

ఈ రహస్యం పూర్తిగా అవగాహన చేసుకుని, చక్కటి రేడియో నాటకాలు రాసిన మహనీయుడు దేవులపల్లి. 'శర్మిష్ఠ' నాటకంలో దేవయాని మనోవేదన ఒక గేయం ద్వారా వ్యక్తపరిచాడాయన.

"ఏ సరేదు ఎటుల మ్రోగు

ఈ ఈదర గాలి పిలుపు" అని ఆమె చేత పాడించాడు. 'దేవయాని ఈదర గాలి పిలిచింది" అని నాటక రచయిత రాస్తే ప్రసారకులు చెయ్యగలిగిందేమీ లేదు.

ప్రసార సాధనాల ద్వారా స్పష్టంగా చెప్పటానికి వీలులేనివి రేడియో నాటికలో రచయిత వాచ్యం చేసి తీరాలి. అప్పుడుగానీ రచయిత ఉద్దేశించినది శ్రోత మనసుకి ఎక్కదు.

రేడియో నాటకంలో శ్రోతకీ- రచయితకీ మధ్య అనుబంధం, సహానుభూతీ కల్పించేది ధ్వని ఒక్కటే. అందువల్ల రేడియో నాటక ప్రసారం పరిధుల పట్ల, రచయిత స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలి.

మరొక విషయం.

ప్రతి రచయిత ఒక శ్రోత కూడ.

అతను ఏది రాసిన తనలో ఉన్న శ్రోతని ఉద్దేశించే రాస్తాడు.

తనతో సమాన అవగాహన గల శ్రోతలుంటారనీ తన రచన విని వాళ్లు మెచ్చుకుంటారనీ ఆశిస్తాడు.

ఎంత ఎక్కువ మంది శ్రోతల్ని మెప్పించగలిగితే అతను అంత సమర్థుడైన నాటక రచయితగా రేడియో వారు అంచనా వెయ్యటం సహజం

కారణం- రేడియో సామాన్య జనం కోసం.

అయితే, ఇది అన్ని సందర్భాలకూ వర్తించదు.

కృష్ణశాస్త్రి గారి రేడియో నాటికలే ఇందుకు ఉదాహరణ. వీటిని విని ఆనందించినవాళ్లు కొద్దిమందే!

అయినా, ఎన్నాళ్లకీ మరిచిపోలేని నాటికలవి.

శాశ్వతంగా, సాహిత్య విలువలతో, ప్రముఖ స్థానం సంపాయించుకున్నాయి.

ఎంతో మంది శ్రోతలు విని ఆనందించిన కొన్ని నాటకాలు, మరునాటికే మర్చిపోవచ్చు.

ఇలాంటివే రేడియో వారు కోరటం సహజం.

కానీ, దేవులపల్లి చేత గొప్ప నాటకలు రాయించిన ఘనత ఆకాశవాణిదే.

రేడియో రచయితలు గుర్తుంచుకోవాల్సిన కొన్ని విషయాలు పాలగుమ్మి పద్మరాజు గారు చెప్పారు.

"రేడియో సామాన్య జనుల కోసం గనుక, రేడియో నాటకాల్లో వాళ్లకి అందని భాష ఉండకూడదన్న వాదం ఉంది. అది చాలా వరకు నిజమే.

కాని, మయసభలో అవమానం పొందాక దుర్యోధనుడు తన బాధను వ్యక్తపరుచుకునే స్వగతం ఒకటి బాగా ప్రజాదరణ పొందింది. అది రేడియోలో విన్నట్టు గుర్తు.

ఆ సమాసాలు కొద్దో గొప్పో చదువుకున్న నాకే అర్థం కాలేదు. ఇక సామాన్య జనానికి ఏమర్థమవుతాయని?

అయితే, చాలా బరువుగా, లోతుగా దుర్యోధనుడి మనోవ్యథ ఆ స్వగతం వింటుంటే, ప్రతి శ్రోత మనస్సుకీ ఎక్కుతుంది.

ఒక్క వాక్యం పూర్తిగా అర్థం గాకపోయినా, పాత్ర మాట్లాడే భాష, దాని తీరు, సందర్భం అన్నీ కలిసి, ఆ సన్నివేశంలోని ప్రధాన రసాన్ని శ్రోతకు అందించాలేగాని శ్రోతకు తెలిసిన (భాషలోనే) మాటల్లోనే అది చెప్పాలన్న నియమం అక్కర్లేదను కుంటాను.

ఈ సందర్భంలో ఒక రచన గురించి చెప్పాలి.

విజయవాడ దూరదర్శన్ డైరెక్టర్ శ్రీ పి.ఎస్. పళనిస్వామి గారు మంచి సృజనాత్మక మేధావి.

వ్యవసాయ కార్యక్రమంలో 'నవధాన్యాల' మీద కవి సమ్మేళనం చేయించిన ఘనత ఆయనది. వోలేటి పార్వతీశం గారు దానికి నిర్మాత. శ్రీ బేతవోలు రామబ్రహ్మంగారు నిర్వహణ. నేను కందుల మీద కవిత చెప్పాను.

అలాంటి మేధావి ఒక మాటు ఒక పౌరాణిక ఇతివృత్తాన్నిచ్చి నాటకం రాయమన్నారు.

ఆ ఇతివృత్తం విని నేను చాలా ఆశ్చర్యపోయాను.

కథ ఇది-

దుర్యోధనుడు అన్నీ పోగొట్టుకుని, మరణావస్థలో అంతిమ దశలో ఉంటాడు. మనస్ఫూర్తిగా శ్రీకృష్ణుని ధ్యానిస్తాడు.

ఆయన ప్రత్యక్షమవుతాడు.

"ఏమిటి దుర్యోధనా? ఎందుకు నన్ను స్మరించావు?" అనడుగుతాడు. సంభాషణ ఇలా ఉంటుంది.

"స్వామీ! నేను నీ పరమభక్తుడని నీవెరుగవా?"

"నీవా?! నా పరమభక్తుడివా?! నా సహాయానికి వచ్చి, అమర్యాదగా నా శిరసు వైపు కూర్చున్నావు. మీ రాజసభలో నా సింహాసనాన్ని నేలమాళిగలో పడేలా చేసావు. ఇదంతా భక్తి అనుకోమంటావా?"

"ప్రభూ! సర్వాంతర్యామీ! నీకు తెలియక కాదు. అయినా, నా అంతరంగాన్ని తెలుసుకోదలిచి అడుగుతున్నావు గనుక చెబుతాను.

మొదటిది- శిరసు వద్ద కూర్చోవటం.

స్వామీ! నీ పాదాల వద్ద జగన్మాత మహాలక్ష్మి నిన్ను సేవిస్తు ఉంటుంది. నీ శిరసు మీద పడగలు గొడుగుగా పట్టి ఆదిశేషువు సేవకుడై వినమ్రంగా ఉంటాడు. కాబట్టి నీ సేవకుడి సరసన, సేవకుడిగా కూర్చున్నాను.

రెండవది- నీవు నీ విశ్వరూపాన్ని యుద్ధ రంగంలో అర్జునుడికి చూపావు. అది శ్మశానంతో సమానం. అనేక మంది వీరులు శవాలవుతారు. రక్తం ఏరులై ప్రవహిస్తుంది. రాజసభ పవిత్ర ప్రదేశం కదా?

ఇక్కడ నీ విశ్వరూప సందర్శనం నా తండ్రికి కలగజేయాలనే నీ సింహాసనం నేలమాళిగలో పడే ఏర్పాటు చేయించాను. అలా చేయకపోతే, నీవు విశ్వరూపం ధరించేవాడివా?"

శ్రీకృష్ణుడు సంతృప్తి చెందుతాడు.

ఇదీ స్థూలంగా కథ.

ఇందులో రెండే పాత్రలు.

రంగస్థల నటులు చేయాలి గనక రెండు పద్యాలు కూడ పెట్టాను. దీనికి 'భక్త సుయోధన' అని పేరు పెట్టాను.

ఇందులో పద్మరాజు గారు చెప్పినట్లు భావబలం ఉంది. ప్రదర్శనకే కాదు. శ్రవ్య నాటకంగా కూడా పనికొస్తుంది.

పద్మరాజు గారేమంటారంటే-

షేక్స్పియర్ కొన్ని సందర్భాల్లో అదివరకు ఆంగ్ల భాషలో లేని పదాలు కొన్ని కేవలం శబ్ద గాంభీర్యం కోసం సృష్టించాడని అంటారు. అయితే, భాషా భేషజం వెలగబెట్టి, శ్రోతకు ఏ అనుభూతీ అందించలేకపోతే ఆ ప్రయత్నం వృథా. అలాగని, బొత్తిగా పేలవమైన విషయాన్ని అతనికి తెలిసిన మాటల్లో చెప్పటం కూడా వృథానే.

ఇక ఇతివృత్తాల విషయంలో కూడ పద్మరాజు గారు విలువైన అభిప్రాయాలు వెల్లడించారు.

"హాస్య నాటికల్లో కొన్ని ప్రస్ఫుటంగా లేని ఇతివృత్తంతో ఉంటాయి. అప్పటికప్పుడు శ్రోతలకు గిలిగింతలు పెట్టి నవ్వించటమే వాటి లక్ష్యం. వాటిలో శ్రోతకీ రచయితకీ మధ్య అంతరం అట్టే ఉండదు. కొన్ని హాస్య సన్నివేశాల ద్వారా శ్రోతల్ని తనతో కడకంటా తీసుకుపోగలుగుతాడు రచయిత.

(ఆకాశవాణి మద్రాసు కేంద్రం వారు జి.వి.జి. రచన 'మందుల కామందు' అనే హాస్య నాటకం ప్రసారం చేసారు. సినీ నటుడు పద్మనాభం ప్రధాన పాత్ర పోషించారు. ఆద్యంతమూ నవ్వులజల్లుగా సాగిపోతుంది. ఈ నాటకం రికార్డు నా దగ్గరుంది. అప్పుడప్పుడు వింటుంటాను.)

కొన్ని ఇతివృత్తాలు ఒక సిద్ధాంతానికి అనుబంధించి ఉంటాయి. ఆ సిద్ధాంతాల మీద రచయితకు అమితమైన తాత్పర్యం ఉంటుంది. వాటిని శ్రోతలకు ఎక్కించి, అతని చేత ఒప్పించాలనే తపన ఉంటుంది.

వాళ్లని 'కమిటెడ్ రైటర్స్' అంటారు.

వాళ్ల కమిట్‌మెంటు మార్క్సిస్టు సిద్ధాంతాలకే పరిమితం కానక్కర్లేదు.

కొందరు రచయితలకు సనాతన ధర్మం మీద భక్తి తాత్పర్యాలుండొచ్చు.

అది పునరుద్ధరించాలన్న తపన వారికి ఉండొచ్చు.

కొందరికి దైవభక్తి ప్రధానోద్వేగం కావొచ్చు.

కొందరికి కొన్ని సామాజిక సిద్ధాంతాల మీద నమ్మకం ఉండొచ్చు.

ఈ 'కమిటెడ్ రైటర్స్'లో కూడ ఎందరో గొప్ప వాళ్లున్నారు. గొప్ప రచనలు చేశారు.

వాటిలో అనుక్షణం తాము నమ్మిన సిద్ధాంతాన్ని ప్రచారం చేసే ప్రయత్నమూ వారు చేస్తారు.

ఇటువంటి రచయితల నాటకాలు రేడియోలో వింటుంటే అందరికీ ఒకే రకమయిన అనుభూతి కలగటం అసంభవం.

ఉదా: దైవభక్తి ఒక్కటే అన్ని మానవ సమస్యలకూ పరిష్కారం అన్న ఇతివృత్తంపై నాటకం రాస్తే, అది అందరికీ నచ్చకపోవచ్చు. శ్రోతలలో కొందరు నాస్తికులుండొచ్చు. అయితే, రచయిత గొప్పవాడైతే, అతని సిద్ధాంతం ఏదైనా, అతని పాత్రలలోని మానవత, సన్నివేశాలలోని గాంభీర్యం, ఎటువంటి శ్రోతనయినా ఆకర్షిస్తాయి. టాల్‌స్టాయ్ నవలలు చదువుతుంటే అతని సిద్ధాంతాలు గుర్తుకు రావు. వాటిలోని విభిన్న పాత్రలే మనసులో నిలిచిపోతాయి.

భారతం చదివితే మనసులో మిగిలేది ఆ పాత్రల మూర్తులే గానీ, వ్యాసుడు నిర్వచించిన ధర్మసందేహాలు కావు. వీరు తమ సిద్ధాంతాలకు అనుగుణంగా పాత్రలను మలచటానికి, తద్వారా తమ సిద్ధాంతాలను రుజువు చెయ్యటానికి పూనుకోరు. అయితే, గత ఇరవై సంవత్సరాలుగా, తెలుగు రంగస్థలం మీదా, రేడియోలోనూ వస్తున్న నాటకాలలో ఎక్కువ భాగం కొన్ని సిద్ధాంతాలను రుజువు చెయ్యటానికి రాయబడ్డవి. వాటిలో ప్రతి ధనవంతుడూ, ప్రతి భూస్వామీ ఒక రాక్షసుడు. సామాన్య ప్రజను పీడించి వాళ్ళ రక్తం తాగుతుంటాడు.

మొదటి రోజుల్లో సామాన్యులకు ఈ రకం నాటకాలు బాగానే ఉండేవి. జనాభాలో ఎక్కువ భాగం లేనివాళ్లే గనుక ఇటువంటివి వాళ్లకి నచ్చటం సహజం. ఎవరి మీదనో కసి తీర్చుకున్నట్లుండేది శ్రోతలకి.

(మా బాబాయి గానుకపాటి సత్యంగారు "రెండెకరాల పైన ఉన్న పొలాలన్నీ గవర్నమెంటు లాక్కోవాలి" అనేవాడు కసిగా ఆయనకున్నది రెండెకరాలే!)

అయితే, వందలకొద్దీ ఇటువంటి నాటకాలే రావటంతో పాత్రలలో వైవిధ్యం ఉండటం లేదు. ఒక ఫ్యాక్టరీ యజమాని, ఒక దొంగ వ్యాపారి, ఒక రాజకీయవేత్త, అందరూ ఒకే రంగులో ఒకే మూసలో కనిపిస్తారు. వాళ్లు మాట్లాడే తీరు, వ్యవహరించే పద్ధతి ఒకటే. అంచేత రానురాను ఇంక ఎన్నని వింటాం ఇటువంటి నాటకాలు అనిపిస్తుంది శ్రోతలకు.

శ్రోతను తనతో పాటు కడగంటా పట్టుకుపోయి, తన దృక్కోణం నించి లోకాన్ని అతనికి చూపించి, మానవ జీవితాన్ని మరో రంగులో చిత్రించగల రచయిత నిజంగా గొప్పవాడు. ఆ రచయితకూ కొన్ని సామాజిక సిద్ధాంతాల మీద నమ్మకం ఉండొచ్చు.

రచనా ధోరణిలో హాస్య వ్యంగ్య పద్ధతి అవలంబించి, మానవ జీవితాన్ని చిత్రించటం చాలా కష్టం. ఎవరో బెర్నార్డ్‌షా వంటి నాటక కర్తలు కొద్ది మంది ఉన్నారు.

హాస్య వ్యంగ్య పద్ధతిలో ఒక ఆకర్షణ ఉంది.

సంభాషణల చమత్కారం, విభిన్న వ్యక్తుల మధ్య విచిత్ర సన్నివేశాలు, శ్రోతల మనసుని వెంటనే ఆకట్టుకుంటాయి.

తరువాత వచ్చే కథలో పెద్ద ఒడిదుడుకులు, బీభత్సం లేకపోయినా, ఎత్తుగడలోనే ఒక ఆశ్చర్యం కలిగించటం, ఈ రకం రచనలో ఉంటుంది.

(నా శ్రవ్యనాటకాలలో ఎత్తుగడ విషయంలో ఇలాంటి జాగ్రత్తలు తప్పనిసరిగా పాటిస్తుంటాను)

బెర్నార్డ్‌షా 'సెంట్‌జోన్' నాటకం ఆంగ్ల సైనికాధికారి కోడిగుడ్డు కోసం చేసే హంగామాతో ప్రారంభిస్తాడు.

మరో తెలుగు నాటకం "ఇంత దారుణం చేస్తాడా?" అంటు ఆవేశపడటంతో ప్రారంభమవుతుంది.

ఇంతా జేసి ఆ రెండో పాత్ర తనతో చెప్పకుండా ఊరికి వెళ్లిపోయాడు. జరిగింది అంతే.

అయితే, అలా ప్రారంభించటం వల్ల, శ్రోతకు తర్వాత ఏం జరుగుతుందో వినాలన్న కుతుహలం కలుగుతుంది.

హాస్య వ్యంగ్య ధోరణిలో జీవితంలోని అసందర్భాలు మనుష్యుల స్వభావాల మధ్య వచ్చే ఘర్షణలు, సరదాగా నవ్వుకుంటు రచయిత చెప్పటానికీ, శ్రోత వినటానికీ అవకాశం ఏర్పడుతుంది.

జీవితం లోతుపాతులు అవగాహన చేసుకోవటానికి అవకాశం కలుగుతుంది. అయితే, చేదు నిజానికి పంచదార పూసి చూపించటం చాలా కష్టమైన పని. ఆ సామర్థ్యం ఉన్న రచయితలు ఏ కొద్దిమందో ఉంటారు. వాళ్లు ఎలాంటి శ్రోతలనైనా తమతో కడగంటా తీసుకుపోగలుగుతారు. వారికి వినోదంతో పాటు మానసిక వికాసం కలిగిస్తారు. అనుభూతికి వైశాల్యం కల్పిస్తారు.

రేడియో నాటిక చెయ్యవలసింది అదే.

సినిమా తరువాత రేడియో చాలా శక్తివంతమైన సాధనం. (ఇప్పుడు టి.వి.)

ముఖ్యంగా భావాలు ప్రచారం చెయ్యటానికి, రేడియోకి సంబంధించినంత వరకు నాటికలు ఎక్కువగా శ్రోతల ఆదరణ పొందటానికి అవకాశం ఉన్నది. ఆ సాధనాన్ని రచయితలూ రేడియో కార్యక్రమ నిర్వాహకులు ఎంత సమర్థంగా ఉపయోగించగలిగితే సమాజానికి అంత మేలు.

## ఉపఉసంహారం

నాటకాన్ని రసరమ్య కావ్యంగా చెబుతారు.

కాబట్టి, కావ్యానికున్నట్టే నాటకానిక్కూడ 'ఉపసంహారం' ఉండాలి.

ఆకాశవాణి ప్రజారంజకమైన కార్యక్రమాల్లో అన్ని వర్గాల శ్రోతలకూ నచ్చే విధంగా అంశాలు ఉండేవి. స్త్రీల కార్యక్రమాలు, బాలల కార్యక్రమాలు, యువజనుల కార్యక్రమాలు, వ్యవసాయదారుల కార్యక్రమాలు, కార్మికుల కార్యక్రమాలు, వయోజనుల కార్యక్రమాలు- ఇలా విభిన్న కార్యక్రమాలు ప్రసారమవుతుంటాయి.

పాలగుమ్మి పద్మరాజు గారన్నట్టు నాటకాలది ఒక ప్రత్యేక స్థానం. టి.వి.లు తమ విస్తృతిని పెంచుకుని, ప్రజల జీవితంలో ప్రాధాన్యత వహించటం మొదలెట్టాక, రేడియోలు మూలపడ్డాయి. చాలా మంది ఇళ్లల్లో రేడియోలు లేవు.

అప్పట్లో ఇంట్లో రేడియో, చేతిలో ట్రాన్సిస్టరు ఉండేది. ఇప్పుడు అందరూ టి.వి.కి అతుక్కుపోతున్నారు.

అయితే, ఆకాశవాణి మూగపోలేదు.

ఎఫ్.ఎమ్. చానెల్స్‌ని ప్రవేశపెట్టింది.

ఇప్పటి తరానికి పనికొచ్చేవి, నచ్చేవి ప్రసారం చేస్తున్నారు.

ఇది కాలానుగుణ్యమైన మార్పే.

కాదనలేం.

అయితే, బంగారం పాతది కదా అని విలువ లేకుండా పోదు. ఒకనాటి రేడియో నాటకాలూ అంతే. అలనాటి శ్రవ్య నాటకాలు ఆణిముత్యాలు. అజరామరమైనవి. వాటిని తరతరాలకు పరిచయం చేయాల్సిన బాధ్యత ఆకాశవాణి నిర్వాహకులకు ఉంది. మిగతా ఉద్యోగాలు వేరు. ఆకాశవాణి ఉద్యోగాలు, ముఖ్యంగా కార్యక్రమ నిర్వాహకుల ఉద్యోగ బాధ్యతలు వేరు.

సృజనాత్మక శక్తి ఉన్నవారికి, తమ ప్రజ్ఞను చూపటానికి, పెంచుకోవటానికి పుష్కలమైన అవకాశాలు ఉన్నాయి.

స్థానికంగా ఉన్న రచయితల్ని, కళాకారుల్ని ఆహ్వానించి, చక్కని కార్యక్రమాలు రూపకల్పన చెయ్యాలి. శ్రవ్య నాటకాలకు గల ప్రాధాన్యత గుర్తించి, వాటిని తరచుగా ప్రసారం చెయ్యాలి.

"వినేవారు లేరు" అనుకోవటం సరికాదు.

గ్రామీణ ప్రాంతాల వారు ఎంతో ఇష్టంగా రేడియో కార్యక్రమాలు వింటున్నారు. తమ స్పందనల్ని ఉత్తరాల ద్వారా తెలియజేస్తున్నారు. ఇవి కార్యక్రమ నిర్వాహకుల్ని ఉత్సాహంతో నింపుతాయి.


టి.వి.ల పట్ల కూడ ప్రజలకు మొహం యెత్తుతోంది. నెలనెలా కేబుల్ కనెక్షను వాళ్లకి అద్దె చెల్లించటం, వాళ్లు ఎప్పుడు ఎంత పెంచుతారో తెలియని పరిస్థితి, తడిసి మోపెడవుతున్న కరెంటు బిల్లులు, మూస పోసినట్లు ఒకే రీతిలో సాగే సీరియల్స్....

ఇవన్నీ టి.వి.ల పట్ల మోజు తగ్గిస్తున్నాయి.

రేడియో ప్రాధాన్యత తిరిగి మొదలయ్యే శుభ ఘడియలు రావొచ్చు. అంతవరకూ 'బహుదూరపు బాటసారి'లా కాకుండా 'రావోయి బంగారుమావా'లా ఆత్మీయంగా రేడియో పలకరిస్తునే ఉండాలి.

రేడియో వింటు పనులు చేసుకోగల ఏకైక సౌలభ్యాన్ని మనం విస్మరించరాదు.

## కాటూరు రవీంద్రత్రివిక్రమ్



కాటూరు రవీంద్రత్రివిక్రమ్ 1955 నుండీ తెలుగు పాఠకులకు సుపరిచితులు. కథానికలు, కవితలు, రేడియో నాటకాలు, నవలలు విరివిగా రాసారు. అనేక బహుమతులు, పురస్కారాలు పొందారు. వీరి రచనలు ఇతర భాషల్లోకి అనువదించబడ్డాయి.

వీరి 'జురాహమ' (మహరాజుకి తిరగరాత) హాస్య శ్రవ్య నాటకం 2000 సంవత్సరములో ఆకాశవాణి జాతీయ స్థాయి నాటకాల పోటీలో ప్రథమ బహుమతి పదివేల రూపాయలు గెలుపొందింది.

అయిదు దశాబ్ధాలపైగా సాగుతున్న సాహిత్య యాత్రలో నూరుకి పైగా రేడియో నాటికలు, నాటకాలు, ధారావాహిక నాటకాలు రచించారు. ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా వెలువడుతున్న విశిష్ఠ రచన ఇది.

Blank Page

Blank Page

## ప్రపంచ తెలుగు మహాసభల ఆశయాలు

- తెలుగు జాతి భాషా సంస్కృతులపై నేటి యువతరానికి ఆసక్తి కలిగించేలా ప్రణాళికలు తయారు చేయడం.
- ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారిని ఒక వేదికపై చేర్చి భాషాసంస్కృతులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలు కనుగొనడం.
- తెలుగుభాష ప్రపంచ భాషలతో సరితూగేలా అంతర్జాలంలో ఉపయోగించడానికి చర్యల లు చేపట్టడం.
- తెలుగు పాలన, బోధన, ప్రసార మాధ్యమ భాషగా వినియోగించేందుకు చర్యలు తీసుకోవడం.
- తెలుగువారి జానపద, సంప్రదాయ కళారూపాల ప్రదర్శనలకు, ప్రచారానికి ప్రణాళిక రూపొందించడం.
- తెలుగు జాతి ప్రాచీనతలను, ప్రశస్తిని వెలుగులోకి తేవడం.
- తెలుగు జాతి చరిత్రపై, భాషపై గ్రంథాలు ప్రచురించి కొత్త పారిభాషిక పదాలు తయారుచేయడం.
- తెలుగు భాషను అభ్యసించే వారికి సరళమైన శైలిలో పాఠ్యగ్రంథాలు, బోధనోపకరణాలు తయారు చేసే ప్రణాళిక రూపొందించడం.
- తెలగు నేలపై గల చారిత్రక, ఆధ్యాత్మిక స్థలాలకు, పర్యాటక కేంద్రాలకు ప్రాచుర్యం కల్పించడం.

**తెలుగు భాష వికాసం** **తెలుగు సంస్కృతి ప్రకాశం**

**దేశ భాషలందు తెలుగు లెస్స**